


www.prajapaksham.in

PRAJAPAKSHAM

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

★★★★




సంపుటి 09, సంచిక: 145 | శనివారం | 25-04-2026 | ఖమ్మం    Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**    పేజీలు: 12+8 | వెల రూ. 5.00



జై తెలంగాణ

జై జై తెలంగాణ

## నవతెలంగాణ అభివృద్ధి ప్రధాతగా..
## అణగారిన వర్గాల ఆత్మగౌరవ పతాకగా..







# కొత్త రాజకీయ
# శక్తిగా వస్తున్నాం

25 ఏప్రిల్ 2026, ఉదయం 9 గంటలకు

అద్వయ కన్వెన్షన్, మునీరాబాద్, మేడ్చల్

# తమిళనాడు, బెంగాల్ భారీ పోలింగ్ దేనికి సూచిక?

తమిళనాడు అసెంబ్లీలోని మొత్తం 234 నియోజకవర్గాలకు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలోని 294 స్థానాల్లో 152కు (తొలిదశ; మలిదశ పోలింగ్ ఏప్రిల్ 29) గురువారంనాడు జరిగిన పోలింగ్‌లో ఓటర్లు సరికొత్త రికార్డులతో చరిత్ర నెలకొల్పారు. తమిళనాడులో 85.15శాతం, పశ్చిమ బెంగాల్‌లో 92.88శాతం ఓట్ల పోలింగ్ రికార్డు అయింది. పూర్తి వివరాలు అందాక, సర్వీసు ఓట్లు, పోస్టల్ బ్యాలెట్లు జతచేశాక ఈ సంఖ్యలు మరి కొంత పెరగవచ్చు. ఇంత పెద్ద సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవటానికి కారణాలేమిటి? ఈ భారీ పోలింగ్ ఏ పార్టీకి లాభం అనే అంశాలపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. ఓటర్ల జాబితాల సమగ్ర పరిశీలన('సర్') కారణంగా మొత్తం ఓటర్ల సంఖ్య 10 –12శాతం తగ్గటం పోలింగ్ శాతం ఎక్కువగా కనిపించటానికి ఒక కారణం. కాగా సర్ అనంతరం ఓటు చేయటం ద్వారా తమ ఉనికిని ధ్రువపరుచుకోవటానికి ఓటర్లు చూపిన ఉత్సాహం రెండో కారణం. రాజకీయ కూటములు లేదా పార్టీల మధ్య పెరిగిన సవాళ్లు, ఉధృత ప్రచారం, పోటాపోటీగా తాయిలాల ప్రకటన మూడవ కారణమనవచ్చు. అధికశాతం ఓట్లు పోలుకావటంపై సాంప్రదాయకంగా రాజకీయ పండితులు రెండుభాష్యాలు చెబుతారు. ఒకటి, అధికారంలో ఉన్న పార్టీ పట్ల వ్యతిరేకత. రెండు, ప్రజల్లో సుస్థిర పాలనపట్ల నెలకొన్న ఆకాంక్ష.

తమిళనాడు, పశ్చిమ బెంగాల్ భారతదేశ పటంలో బహుదూరంగా ఉన్నప్పటికీ తమ భాష–సంస్కృతుల పరిరక్షణలో పట్టుదల కలిగిన రాష్ట్రాలు. రాజకీయాల్లో భిన్నత్వం ఉన్నా రెండూ బిజెపియేతర ప్రాంతీయ పార్టీల పాలనలోని రాష్ట్రాలు. రెండు రాష్ట్రాలు జాతీయ స్థాయిలో ప్రతిపక్ష ఇండియా కూటమిలో భాగస్వాములు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక శాతంలో ఓట్లు పోలుకావటానికి కారణాలు వేర్వేరుగా ఉన్నాయి. సూక్ష్మంగా చెప్పాలంటే తమిళనాడులో భారీగా ఓట్లు పోలు కావటానికి కారణం – రాజకీయ పార్టీల మధ్య పోటీ, యువక ఓటర్లు, చిన్నాభిన్నంగా ఉన్న ప్రతిపక్షం. పశ్చిమ బెంగాల్‌లో అయితే రాజకీయ విభజన, స్థానికులుగా గుర్తింపు, అధికారం కోసం ముమ్మర పోటీ, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య తారాస్థాయికి చేరిన ఘర్షణ.

గురువారంనాటి పోలింగ్ సరళిపై రెండు రాష్ట్రాల్లోనూ ప్రజాసమూహాలు ఆసక్తితో చర్చించుకుంటున్నాయి. తమిళనాడులో ద్రవిడ ఉద్యమ వారసులైన డిఎంకె, ఎఐఎడిఎంకె (ఇది బిజెపి కూటమి) మధ్య ప్రధానంగా పోటీ ఉంది. అయితే ఎంజి రామచంద్రన్, ఎం.కరుణానిధి, జయలలిత తదుపరి సినిమా హీరో విజయ్ రాజకీయాల్లో తమ ఆకర్షక శక్తిని పరీక్షించుకోవటం ఈ ఎన్నికలకు కొత్త కోణం చేకూర్చింది. ముఖ్యంగా యువత, మహిళలు ఆయన మద్దతుదారులుగా ఉన్నారు. తనతో పొత్తుకోసం బిజెపి ప్రయత్నాలను ఆయన తిరస్కరించారు. అతనికి రాజకీయ అనుభవం లేదు, నిర్మాణం లేదు. గ్లామర్‌ని నమ్ముకున్నాడు. అధికారం చేబట్టాలని ఆయనకు ఆశవున్నా అది నెరవేరదని అంచనాలు వినిపిస్తున్నాయి. అయితే ఏ పార్టీకి నష్టం కలుగుతుందన్న అంచనాల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. ఎన్నికల క్షేత్రంలో విజయ్ ఉనికి ఓటర్లను ముఖ్యంగా తొలిసారి ఓటర్లను ఎక్కువగా పోలింగ్ కేంద్రాలకు తెచ్చి ఉండవచ్చు, డిఎంకె వ్యతిరేక ఓటును చీల్చి ఉండవచ్చు; ఇది ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో కొంత అనిశ్చితి కలిగించింది.

ఎఐఎడిఎంకె, బిజెపి, విజయ్ టివికెలు డిఎంకెకు వ్యతిరేకంగా ఎక్కువ శబ్దం చేసినప్పటికీ స్టాలిన్ తమ పార్టీని సుస్థిర ప్రభుత్వానికి హామీదారుగా, సంక్షేమం అభివృద్ధి మేళవింపుదారుగా, దక్షిణాది రాష్ట్రాల హక్కుల ఛాంపియన్‌గా ప్రజలముందు బలంగా నిలిచారు. 28 పార్టీలతో బలమైన కూటమి నిర్మాణం అదనపు బలం. మహిళలను విశేషంగా ఆకర్షించారు. ప్రతిపక్షం జాగాలో సఖ్యత లేదు. జయలలిత మరణం అనంతరం ఏర్పడ్డ నాయకత్వం శూన్యాన్ని ఎఐఎడిఎంకె పూడ్చుకోలేకపోయింది. బిజెపికి మరికొన్ని ఓట్లు వస్తాయిగాని ద్రవిడ రాజకీయాల నేలలో అది పాదం మోపలేకపోతున్నది. ఇవన్నీ డిఎంకెకు అనుకూలతలుగా అంచనా. తమిళనాడులో ఓట్ల పోలింగ్ ఎప్పుడూ ఎక్కువే. ఈ పర్యాయం సర్ వల్ల మొత్తం ఓటర్లు — 2021 ఎన్నికల ఓట్లతో పోల్చితే 57 లక్షలు తగ్గినందున ఓటింగ్ శాతం చాలా ఎక్కువగా కనిపిస్తున్నది.

పశ్చిమ బెంగాల్‌లో ఆచరణలో టిఎంసి, బిజెపి మధ్య ముఖాముఖీ పోటీ జరుగుతున్నందున – తాడోపేడో అనే పరిస్థితి తలెత్తినందున ఓటింగ్ దాదాపు 93శాతం జరిగింది. ఓటు చేయటం తమ అస్థిత్వానికి రూఢిగా తయారైనందున ఓటర్లు పోటాపోటీగా తరలి వచ్చారు. వలసవెళ్లిన బెంగాల్ కార్మికులు పెద్దసంఖ్యలో తిరిగివచ్చి ఓటు చేసిన వైనం ఓటర్లలో 'సర్' కలిగించిన భయాందోళనను వెల్లడిస్తున్నది. ఇది మామూలు సమీకరణ కాదు, భావోద్వేగ వ్యక్తీకరణ. కేంద్రప్రభుత్వం ఎన్నికల కమిషన్ ద్వారా 'సర్'ను ప్రయోగించి దాదాపు 91లక్షల ఓట్లు తొలగించినప్పటికీ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ దాదాపు నాలుగు నెలలు పోరాడి, అడ్జుడికేషన్‌లో ఉంచిన 60లక్షల ఓటర్లలో 27లక్షల ఓట్లు చెల్లుబాటు చేయించారు. ఆమె ఈ ఎన్నికల పోరాటాన్ని ప్రభుత్వం వర్సెస్ ప్రతిపక్షం నుండి బెంగాల్ వర్సెస్ బాహ్య శక్తులు నెత్తినెక్కటంగా మార్చటంలో సఫలమైనారు.పౌరసత్వ చట్టాలు(సిఎఎ), ఏకీకృత పౌరస్మృతి (యుసిసి) ప్రమాదం, సర్‌లో అక్రమాలు – అన్నిటినీ కలగలిపి ఆమె బెంగాల్ సంస్కృతి, రాజకీయాలకు ముప్పుగా చిత్రించారు. సర్‌తోపాటు బెంగాలీ ముస్లింలను చొరబాటుదారులుగా చిత్రించి వారిని వెళ్లగొడతామంటూ బిజెపి చేసిన ప్రచారం కూడా మమతకు తోడ్పడింది. మైనారిటీలు, గ్రామీణ ఓటర్లు ఆమె వెనుక సమీకృతమైనారు. బిజెపిది చిత్రమైన పరిస్థితి. ధనం, అధికార దుర్వినియోగం, అబద్ధాల ప్రచారంతో అది తన రాజకీయ పునాదిని విస్తరించుకున్నప్పటికీ వ్యతిరేకతనూ పెంచుకుంది. ఇది ప్రత్యర్థికి ఓట్లను పెంచింది. అయినా ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా రెండవ దశ పోలింగ్ కోసం అతిశయోక్తులు ప్రచారంలో పెడుతున్నారు. 152లో 110 సీట్లు తమవేనని అమిత్ షా ఊదరగొడుతున్నారు. కాగా ప్రధానమంత్రి మహిళా బిల్లును టిఎంసి ఓడించిందని నిందిస్తూ, రాష్ట్రంలో అధికారంలోకి రాగానే మహిళలకు రూ.3వేలు వారి ఖాతాలో వేస్తామని, మహిళా పట్టభద్రులకు రూ.50వేలు ఇస్తామని మహిళా ఓట్లకు గాలం వేస్తున్నారు. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లోనూ బిజెపి ఇంత తీవ్రంగానే ప్రచారం చేసింది. ఈ పర్యాయం పెద్దసంఖ్యలో ఓట్ల తొలగింపు, అధికార యంత్రాంగం స్వాధీనం తమకు మేలుచేస్తుందని బిజెపి ఆశిస్తోంది. ఆశ చావకపోవటమే రాజకీయం! ●



## అడ్డంకులు లేని టోలింగ్ వ్యవస్థ

దేశవ్యాప్తంగా పలు జాతీయ రహదారులపై డిసెంబర్ నాటికి ఎలాంటి ఆటంకాలు లేని, నిరంతరాయ టోలింగ్‌ను అమలు చేయనున్నాం. లాజిస్టిక్స్ ఖర్చును తగ్గించడానికి భారత్ మంచి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాల్సి ఉంది. భారత్ ప్రపంచ శక్తిగా ఎదగాలంటే లాజిస్టిక్స్ వ్యయాన్ని సింగిల్ డిజిట్‌కు తగ్గించుకోవాల్సి ఉంటుంది. భారత్ తన చమురు అవసరాలు తీర్చడానికి 87 శాతం దిగుమతులపై ఆధారపడి ఉంది. మనం రూ.22 లక్షల కోట్ల విలువైన శిలాజ ఇంధనాలను దిగుమతి చేసుకుంటున్నాం. ఇది కాలుష్యానికి కూడా కారణం అవుతోంది. కాబట్టి మనం ప్రత్యామ్నాయ ఇంధనం, జీవ ఇంధనం ఉత్పత్తిని పెంచేందుకు కృషి చేయాలి.

– రోడ్డు రవాణా, రహదారుల మంత్రి
నితిన్ గడ్కరీ

## రాజ్యసభలో 'రాజకీయ ఆపరేషన్'.. ప్రజాస్వామ్య ఖూనీ!

భారత రాజకీయ యవనికపై 'ప్రత్యామ్నాయ రాజకీయాలు' అనే నినాదం తో, అవినీతికి వ్యతిరేకంగా సామాన్యుడి గొంతుకగా ఆవిర్భవించిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేడు నిలువునా చీలిపోవడం ప్రజాస్వామ్య చరిత్రలో ఒక విషాదకర అధ్యాయం. 2026 ఏప్రిల్ 24న వెలువడిన వార్తలు దేశవ్యాప్త రాజకీయ ప్రకంపనలు సృష్టించాయి. పార్టీలో అత్యంత కీలక నేత, యువ గొంతుకగా పేరున్న ఎంపి రాఘవ్ చద్దా తన పదవికి, పార్టీకి రాజీనామా చేసి బిజెపిలో చేరడం ఒక ఎత్తయితే, సిద్ధాంతాల బలిపీఠంపై అధికార కాంక్ష! సామాన్యుడి ఓటుకు విలువేది? అనే ప్రశ్న ఇప్పుడు ప్రతి ఓటరు మదిలో మెదులుతోంది. 'నేను ఇంతకాలం రాంగ్ పార్టీలో ఉన్నాను' అని రాఘవ్ చద్దా చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేశాయి. ఒక సిద్ధాంతాన్ని నమ్మి, వీధి పోరాటాల ద్వారా పుట్టిన పార్టీలో దశాబ్దకాలం పాటు వెన్నంటి ఉండి, ఇప్పుడు అది 'తప్పుడు పార్టీ' అని ప్రకటించడం వెనుక దాగిన అధికార కాంక్షను విశ్లేషించాల్సిన అవసరం ఉంది. సామాన్యుడి ఓటు కేవలం అధికారం మార్చడానికేనా లేక ఆ ఓటు వెనుక ఉన్న ఆశయాలను కూడా నాయకులు ఇలాగే స్వార్థ ప్రయోజనాల కోసం బలిపీఠం ఎక్కిస్తారా అన్నది ప్రజాస్వామ్య మనుగడకు సంబంధించిన అంశం. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ఒక నమ్మకం, కానీ నేటి రాజకీయాల్లో ఆ నమ్మకం కేవలం ఎన్నికల వరకు మాత్రమే పరిమితమవుతోంది. గెలిచిన తర్వాత సిద్ధాంతాలను గాలికి వదిలేసి, అవకాశవాద రాజకీయాలకు తెరలేపడం వల్ల సామాన్య ఓటరు తనను తాను వంచించుకున్నట్లు భావిస్తున్నాడు. ఈ తరహా ఫిరాయింపులు కేవలం వ్యక్తుల మార్పు మాత్రమే కాదు, ఒక రాజకీయ వ్యవస్థపై ప్రజలకున్న కనీస విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యలు.

ఈ మొత్తం పరిణామం వెనుక కేంద్ర అధికార పార్టీ పక్కాగా అమలు చేసిన 'రాజకీయ ఆపరేషన్' స్పష్టంగా కనిపిస్తోంది. ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో బలమైన ఉనికి కలిగి, జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలని భావించిన ఆప్‌ను లోపలి నుండే దెబ్బతీయడం ద్వారా ప్రతిపక్ష గొంతును నిర్వీర్యం చేయడం ఇక్కడ ప్రధాన ఎత్తుగడ. ఈ విలీన పర్వం రాజ్యాంగం కల్పించిన లొసుగులను ఎలా వ్యూహాత్మకంగా వాడుకోవచ్చో ప్రపంచానికి చాటిచెబుతోంది. రాజ్యసభలో 'రాజకీయ ఆపరేషన్'.. రాజ్యాంగ లొసుగులతో ప్రజాస్వామ్య ఖూనీ! అని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. ఫిరాయింపు నిరోధక చట్టం (10వ షెడ్యూల్) ప్రకారం, ఒక పార్టీ ప్రజాప్రతినిధులు అనర్హతకు గురికాకుండా ఉండాలంటే మూడింట రెండొంతుల మెజారిటీ సభ్యులు విడిపోయి మరో పార్టీలో విలీనం కావాలి. ఆప్‌లోని పదిమంది ఎంపిల్లో ఏడుగురు బయటకు రావడం అంటే, అది సాంకేతికంగా చట్టబద్ధమైన 'విలీనం' కిందికే వస్తుంది. ఈ సాంకేతికతను ఆసరాగా చేసుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తిని ఖూనీ చేస్తున్నారు. చట్టం ప్రకారం ఇది సరైనదే కావచ్చు, కానీ ప్రజలు ఒక గుర్తుపై గెలిపించిన ప్రతినిధులు మరో గుర్తు కిందకి మారిపోవడం అంటే అది ఓటరును వంచించడమే. ఇక్కడ ఫిరాయింపు నిరోధక చట్టం తన ప్రాథమిక ఉద్దేశ్యాన్ని కోల్పోయి, సామూహిక ఫిరాయింపులకు ఒక సులభమైన మార్గంగా మారుతోంది. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నత విలువల పతనానికి నిదర్శనం.

వెంకగారి భూమయ్య, 9848559863

# భవానీపూర్‌లో మమతా బెనర్జీకి అగ్నిపరీక్ష

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తొలిదశ పోలింగ్ గురువారం మొత్తం మీద ప్రశాంతంగా ముగిసింది. మండుటెండలను లెక్క చేయకుండా ఓటర్లు ఉత్సాహంగా ఎప్పటివలే భారీగా తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఏప్రిల్ 29న రెండవదశలో మిగతా 142 నియోజకవర్గాలకు పోలింగ్ జరుగుతుంది. ఆ ప్రచారంలో ఉన్న ప్రధాని నరేంద్రమోదీ, హోం మంత్రి, బిజెపి ఎన్నికల ప్రచారసారథి అమిత్‌షా పోలింగ్ సరళిని పరిశీలించారు. 110 సీట్లు తమవే అంటున్నారు అమిత్ షా. తృణమూల్ కాంగ్రెస్ అధినేత, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అధికారం తిరిగి తమదే అని తొలి దశ పోలింగ్ అనంతరం పునరుద్ఘాటించారు. అయితే రెండవ దశ పోలింగ్ జరిగే ప్రాంతంలో ఉన్న ఆమె నియోజకవర్గం భవానీపూర్ వైపు ఇప్పుడు అందరి దృష్టి మరలింది. అది ఆమె సొంత నియోజకవర్గం అయినప్పటికీ ఆమెను ఓడించటమే ధ్యేయంగా అమిత్‌షా నేతృత్వంలో బిజెపి సర్వశక్తులూ ఒడ్డుతున్నది. గత ఎన్నికల్లో ఆమె నందిగ్రామం నుంచి పోటీచేసి టిఎంసి ఫిరాయింపుదారు, బిజెపి అభ్యర్థి సువేందు అధికారి చేతిలో కొద్దిపాటి ఓట్ల తేడాతో ఓటమి పొందారు. అనంతరం ఉప ఎన్నికలో భవానీపూర్ నుంచి విజయం సాధించారు. వీలైతే ఆమెను ఓడించటం లేదా నియోజకవర్గానికి పరిమితం చేయాలన్న దురుద్దేశంతో బిజెపి వారు అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సువేందు అధికారిని ఆమెపై పోటీకి దింపారు. ఆయన తన సొంత నియోజకవర్గం నందిగ్రాం నుంచి కూడా పోటీ చేస్తున్నారు. మమతాబెనర్జీ తన నియోజకవర్గం ప్రజలపై నమ్మకముంచి టిఎంసి ఏకైక నాయకురాలిగా రాష్ట్రమంతటా అవిశ్రాంతంగా ప్రచారం చేస్తున్నారు. తన నియోజకవర్గంలో మమత, రాష్ట్రంలో ఆమె పార్టీ (తృణమూల్ కాంగ్రెస్) ఓటమి నిర్ధారణ కాకపోయినా, ఆ అభిప్రాయం కలిగించటానికై ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షా తమ ఎన్నికల ప్రచార సభల్లో చిత్రంగా ఆమెకు "వీడ్కోలు" చెబుతున్నారు.

భవానీపూర్ ముఖ్యమంత్రి మమత పోటీ చేస్తున్నందువల్లనే గాక, ఆమె సభల్లో ఒకదానికి రిటర్నింగ్ అధికారి అనుమతి నిరాకరించినట్లు ఆమె ఆరోపించటం వల్ల కూడా వార్తల్లోకి ఎక్కింది.

పశ్చిమబెంగాల్‌లో ఈ ఎన్నికల్లో ఒక ప్రత్యేకత రాష్ట్ర పరిపాలనా యంత్రాంగాన్ని భారత ఎన్నికల కమిషన్ స్వాధీనం చేసుకోవటం. బిజెపియేతర పార్టీల ఎన్నికల ప్రచారానికి ఆటంకాలు కల్పిస్తున్నట్లు అధికారులపై ఆరోపణలున్నాయి. ఎన్నికల సభలో పాల్గొనకుండా తనను నిరోధించేందుకు తన విమానాన్ని ఆలస్యం చేశారని మమత ఆరోపించారు. తమ పార్టీ ప్రచారానికి వచ్చిన జెఎంఎం నాయకుడు, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ విమానం దిగటానికి అనుమతి నిరాకరించారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ సభకు అనుమతి నిరాకరణతో దాన్ని రద్దు చేసుకున్నారు. అయితే ఇందుకు మమతా బెనర్జీ కారకురాలిగా కాంగ్రెస్ ఆరోపించింది.

కేంద్ర బలగాల సహాయంతో బోగస్ ఓట్లు పోల్ చేయించి భవానీపూర్‌లో తనను ఓడించటానికి బిజెపి, ఎన్నికల కమిషన్ కుట్రపన్నుతున్నట్లు మమత ఆరోపించారు. "గుర్తుపెట్టుకోండి, పోలింగ్ రోజుకు మూడు వార్డులు ఎంపికచేసుకున్నారు. అవి 74, 77, 63. కేంద్ర భద్రతా దళాలను ఉపయోగించి ఈ వార్డుల్లో రిగ్గింగ్‌కు పాల్పడతారని ఆమె బారక్‌పూర్ ఎన్నికల ర్యాలీలో ఆరోపించారు. ఈ అసెంబ్లీ నియోజకవర్గంలో 8వార్డులున్నాయి. వాటిలో మూడింటిలో రిగ్గింగ్ అంటే చాలా పెద్ద సంఖ్యే అవుతుంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి 74 అలీపూర్‌లో, 63లోని కొన్ని ప్రాంతాల్లో, వార్డు సంఖ్య 77లో కిడ్డార్‌పోర్ భాగాల్లో ఆధిక్యత లభించింది. మిగతా 5వార్డుల్లో 73, 82లో బిజెపి మెజారిటీ సాధించింది. 70, 71, 72 వార్డుల్లో కూడా బిజెపి ఆధిక్యత లభించింది. భవానీపూర్‌లో ఇక్కడే టిఎంసి, బిజెపి మధ్య ఓట్ల దూరం తగ్గింది.

2021లో భవానీపూర్ ఉపఎన్నికల్లో మమతాబెనర్జీ 58,832 ఓట్ల భారీ మెజారిటీతో సుమారు 72శాతం ఓట్లతో ఘనవిజయం సాధించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఈ అసెంబ్లీ విభాగంలో టిఎంసి ఆధిక్యత 8297 ఓట్లు మాత్రమే. ఈ నియోజకవర్గంలోని 260 బూత్‌ల్లో 147 చోట్ల బిజెపి ఆధిక్యత సంపాదించగా, టిఎంసికి 111 కేంద్రాల్లోనే మెజారిటీ ఓట్లు పోలైనాయి.

ఇక ఇప్పుడు భవానీపూర్‌లో ఓట్ల ప్రక్షాళన ('సర్') చూద్దాం. ఏప్రిల్ 8న స్తంభింపజేసిన ఓటర్ల సంఖ్య ప్రకారం 14,113 పేర్ల అడ్జుడికేషన్ (న్యాయాధికారుల స్క్రూటినీ) తర్వాత 3875 తొలగించారు. గత డిసెంబర్ 16న 2,06,925 ఓటర్లు ఉండగా, సుమారు 44వేల ఓట్లు తొలగించారు. టిఎంసి, మమతాబెనర్జీ తమ మద్దతుదారుల పునాదిని కాపాడుకోవటానికి గట్టిప్రయత్నం చేసినట్లు ఇది సూచిస్తున్నది. ఈ నియోజకవర్గ తుది ఓటర్ల జాబితాను ఏప్రిల్ 27న ప్రచురిస్తారు. అంతిమంగా, ఎంతమంది తమ పేర్లను ఓటర్ల జాబితాలో చూసుకుంటారో!



ఫిబ్రవరి 28న ప్రచురించిన తుది ఓటర్ల జాబితా ప్రకారం భవానీపూర్ లో ముస్లిం మైనారిటీ ఓటర్లు 24శాతం మాత్రమే. బెంగాలీ హిందువులు 42శాతం, బెంగాలీ యేతర హిందూ ఓటర్లు 34శాతం. ఈ విధంగా ఓటర్ల పొందిక బిజెపి, టిఎంసి రెండింటినీ మునికాళ్లపై నిలబెడుతున్నది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఈ అసెంబ్లీ సెగ్మెంట్‌లో టిఎంసి మెజారిటీ తగ్గినప్పటికీ, టిఎంసి ఓటర్లను తొలగించినప్పటికీ గెలుస్తామన్న భరోసా బిజెపికి లేదు. కారణం తమ మద్దతు దార్ల ఓట్లను పెద్ద ఎత్తున తొలగించకుండా టిఎంసి జాగ్రత్త పడింది. కొన్ని ఓట్లు తొలగించినప్పటికీ , అవి తమ ఆధిక్యాన్ని తలకిందులు చేసే స్థాయిలో లేవని టిఎంసి ధీమా వ్యక్తం చేసింది.

బిజెపి తన నియోజకవర్గంలోనే గాక, యావత్ రాష్ట్రంలో రిగ్గింగ్‌కు కుట్ర చేసిందని మమతా బెనర్జీ ఆరోపించారు.పశ్చిమ బెంగాల్‌ను స్వాధీనం చేసుకోవటానికి బిజెపి బయటినుంచి 2లక్షల మందిని, 200 హెలికాప్టర్లను, 100 విమానాలను దించిందని ఆమె ఆరోపించారు. తూర్పు మేదినీపూర్ ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తూ ఆమె ఇలా అన్నారు. "ఇక్కడ ఓటు వేయటానికి యుపి, బిహార్ల నుంచి జనాలు వచ్చి ఉండవచ్చు. ఈ ట్రిక్కులు మాకు అవగతమే. మేము శక్తి కొలదీ పోరాడుతాం. మేము ఇతర పార్టీల మాదిరి కాదు. రిగ్గింగ్‌కు పాల్పడేవారు ఒకటి గ్రహించాలి, ఆ పని మేమూ చేయగలం. మేము కూడా ప్రతి ఒక్కదాన్నీ దగ్గరినుంచి పరిశీలించగలం."

భవానీపూర్ నియోజక వర్గంలో టిఎంసి గడపగడపకూ వెళ్లి ప్రచారం చేస్తోంది. ఈ నియోజక వర్గాన్ని 2011లో టిఎంసి 64.7 శాతం ఓట్లతో గెలుచుకుంది. అప్పుడు బిజెపికి వచ్చిన ఓట్లు 27.98 శాతం. 2016లో ఆ ఓటు శాతాలు వరుసగా 47.67; 29.26. కాగా 2021లో 57.71 శాతం, 35.16 శాతం.

సిపిఐ(ఎం), కాంగ్రెస్, జెయుపి అభ్యర్థులు కూడా పోటీ చేస్తున్నారు. మమత ఈ నియోజక వర్గంలో నివాసి, సువేందు అధికారి బయటి వ్యక్తి. మమతకే ఆధిక్యత ఉంది.

### అమిత్ షా నోటి దురుసు

ఓట్లను తొలగించినందుకు బిజెపికి వ్యతిరేకంగా ఓటుచేసి 'పగ తీర్చుకోండి' అని ఓటర్లకు మమతా బెనర్జీ ఇచ్చిన పిలుపు 'ఓటాధికార్ రోకా మంచ్' ఆధ్వర్యంలో రాష్ట్రమంతటా సాగిస్తున్న ప్రచారం పట్టణ మధ్యతరగతులను ఆకట్టుకుంటున్నది. అదే సమయంలో అమిత్ షా నోటి దురుసుతనంతో ' ఏయ్ దీదీ జాగ్రత్తగా విను, బెంగాల్ భారత్‌లోనే ఉంది...''అని చేసిన వ్యాఖ్య బెంగాలీలకు ఆగ్రహకారణమవుతున్నది. ఇది ఆయన వ్యక్తిత్వానికి , అహంకారానికీ నిదర్శనం. ఏప్రిల్ 21 న పశ్చిమ మేదినీపూర్‌లోని గుల్బోని సభలో ఆయన మమతను ''ఏయ్ దీదీ'' అని సంబోధించా రు. ప్రధాని నరేంద్రమోదీ గతంలో ఆమెను అవమానించిన తీరును ఇది గుర్తుతెస్తున్నది. మోదీ 2021లో 'దీదీ ఓ దీదీ' అని మమతను వెటకారం గా సంబోధించారు. ఎన్నికల్లో బిజెపి మూల్యం చెల్లించుకుంది. ఇప్పుడు షా బెదిరింపునకు రాజకీయ అర్థమేమిటి? ఆమెపై చర్య తీసుకుంటామని చెప్పటం షా ఉద్దేశ్యమా? షా బెదిరింపునకు మమత స్పందించలేదు. కానీ ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీ స్పందిస్తూ ఈ ' బజారు ఉచ్ఛారణ' 2021 నాటి మోదీ దురుసుతనాన్ని గుర్తుచేస్తున్నదన్నారు. బిజెపి మహిళా ద్వేషి అన్నారు. మమతను అవమానించిన తన మాటలు ఓటర్లకు ఆగ్రహం తెప్పిస్తాయని షా ఊహించి ఉండరు. 91లక్షల మంది ఓటర్లను తొలగించారు. 2025 అక్టోబర్‌లో 7.66 కోట్లుగా ఉన్న ఓటర్ల సంఖ్య 6.75 కోట్లకు (12శాతం) తగ్గాయి. 2021లో ఉన్న 6.75 కోట్ల కన్నా తక్కువ. ఈ తొలగింపు వెనుక అమిత్ షా ఉన్నారని మమత ఆరోపించారు. అందువల్ల 'ఓట్లు తొలగించబడిన వారి కోసం మీరు ఓటు చేయండి' అని ఆమె ఓటర్లకు పిలుపునిచ్చారు. కాగా అమిత్ షా కలకత్తా సాల్ట్‌లేక్ హోటల్‌లోనే తిష్టవేసి ప్రతిరోజు ఉన్నతస్థాయి సెక్యూరిటీ సమీక్షలు , రాజకీయ సమీక్షలు చేస్తున్నారు. తమ క్యాడర్‌ను కాపాడుకోవటానికి , పోలింగ్‌కు సంసిద్ధుల్ని చేయటానికి టిఎంసి ప్రతిచర్యలు తీసుకుంటున్నది. తమ బూత్ ఏజెంట్లు ఎవరూ బిజెపికి అమ్ముడుపోరనీ మమత అన్నారు. కొన్ని బూత్‌ల్లో ఓటింగ్ యంత్రాలు పనిచేయకపోవచ్చనీ, వాటిని రిపేర్ చేయటానికి ఎన్నికల కమిషన్ అధికారులను అనుమతించవద్దని , వాటి స్థానం లో కొత్త యంత్రాలు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేయాలని ఆమె తమ ఏజెంట్లను ఆదేశించారు. ఓట్ల తొలగింపు మాత్రమేకాదు, మొత్తం రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని ఇసి స్వాధీనం చేసుకోవటం, పెద్ద ఎత్తున అధికారులను ఎన్నికల విధుల నుంచి తొలగించటం, శాంతి భద్రతల పేరుతో రాష్ట్ర పోలీస్‌ను నామమాత్రం చేసి పెద్ద ఎత్తున కేంద్ర బలగాలను దించటం వంటి ఇసి చర్యలన్నీ ఎన్నికల్లో తమ పార్టీని దెబ్బతీయాలన్న బిజెపి దురాలోచనకు ఎన్నికల కమిషన్ తోడ్పాటుగా మమతా బెనర్జీ చూస్తున్నారు. ఈ పక్షపాత చర్యలకు వ్యతిరేకంగా ఓటర్లు తీర్పు ఇవ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

(ఐపిఎ సర్వీస్)

# డేటా దూసుకుపోతోంది.. నగరం ఆగిపోతోంది!

ప్రపంచం ఆరవ తరం (6జీ) మొబైల్ సాంకేతికత వైపు పరుగులు తీస్తున్న కాలంలో, నగర జీవితం ఒక విరుద్ధ వాస్తవాన్ని ప్రతిబింబిస్తోంది. సెకనుకు టెరాబైట్ల వేగంతో సమాచారం గాలిలో ప్రవాహంలా దూసుకుపోతున్నా, అదే నగర వీధుల్లో సామాన్యుడి వాహనం మాత్రం గంటల తరబడి ట్రాఫిక్ గందరగోళంలో చిక్కుకుపోతోంది. అంతర్జాతీ య టెలికమ్యూనికేషన్ యూనియన్–2025 గణాంకాల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా మొబైల్ డేటా వినియోగం ఏటా 25 నుండి 30 శాతం వృద్ధి చెందుతోంది.మన దేశంలో ఢిల్లీ, ముంబయి, హైదరాబాద్ వంటి నగరాలు డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ సేవల్లో ప్రపంచంతో పోటీపడుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో రోడ్ల దుస్థితి, మౌలిక వసతుల లేమి యథావిధిగా కొనసాగుతున్నాయి. సాంకేతికత ఎంత ఎదిగినా, ప్రాథమిక అవసరాలైన డ్రైనేజీ, తాగునీరు, సురక్షితమైన రోడ్ల విషయంలో మనం ఇంకా ఆశించిన పురోగతి సాధించలేదనేది ఒక కఠిన వాస్తవం. అభివృద్ధి చెందుతున్న ప్రతి మెట్రో నగరం నేడు ఒకవైపు హైటెక్ హంగులు, మరోవైపు శిథిలమైన మౌలిక వసతుల మధ్య కొట్టుమిట్టాడుతోంది.

### అంతర్జాతీయ నివేదికల హెచ్చరిక

ప్రపంచ ఆర్థిక వేదిక 2024–25 నివేదికల విశ్లేషణ ప్రకారం, డిజిటల్ పురోగతికి, భౌతిక మౌలిక వసతులకు మధ్య ఉన్న వ్యత్యాసం అనేక ప్రాంతాల్లో ఆందోళనకర స్థాయికి చేరుకుంది. అందుబాటులో ఉన్న వివిధ అంతర్జాతీయ నివేదికలు, అధికారిక డేటా, క్షేత్రస్థాయి పరిశీలనలను ప్రామాణికంగా తీసుకుని విశ్లేషిస్తే.. స్విట్జర్లాండ్‌కు చెందిన మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ విడుదల చేసిన 'స్మార్ట్ సిటీ ఇండెక్స్ 2024'లో అగ్రస్థానంలో ఉన్న సింగపూర్, జూరిచ్ వంటి నగరాలు సైతం ట్రాఫిక్, పర్యావరణ సవాళ్లను ఎదుర్కొంటున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. అమెరికాలోని న్యూయార్క్, చికాగో వంటి నగరాల్లో వర్షాలకు భూగర్భ రైలు సేవలు నిలిచిపోవడం, లండన్, పారిస్ వంటి రాజధానుల్లో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరగడం వంటివి ఆధునిక నగర ప్రణాళికలోని లోపాలను ఎత్తిచూపుతున్నాయి. టాంటాం ట్రాఫిక్ ఇండెక్స్ 2024 ప్రకారం, లండన్ నగరం అత్యంత రద్దీ కలిగిన నగరంగా నిలిచింది. అంతర్జాతీయ పరిణామాలను గమనిస్తే, కేవలం డిజిటల్ నెట్‌వర్క్‌లను నిర్మించినంత మాత్రాన నగరాలు 'స్మార్ట్' కావు అని, భౌతిక మౌలిక వసతుల నిర్వహణే అసలైన సవాలు అని స్పష్టమవుతోంది.

### భారతీయ మెట్రోల దుస్థితి

భారతీయ మెట్రో నగరాల విషయానికి వస్తే, బెంగళూరులో 'రోడ్లపై గుంతలు', ముంబైలో 'లోతట్టు ప్రాంతాల మునక' తరచూ జాతీయ చర్చలకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా తెలంగాణ రాజధాని హైదరాబాద్ సాంకేతిక రంగంలో గ్లోబల్ హబ్‌గా ఎదుగుతున్నా, క్షేత్రస్థాయిలో సమస్యలు జటిలమవుతున్నట్లు కనిపిస్తోంది. 2026 ప్రారంభ గణాంకాల ప్రకారం, హైదరాబాద్‌లోని మియాపూర్, కూకట్‌పల్లి, ఎల్బీనగర్ వంటి ప్రాంతాల్లో మౌలిక వసతులపై ఒత్తిడి విపరీతంగా పెరిగింది. భూగర్భ కేబులింగ్ పనులకోసం తరచూ రోడ్లను తవ్వడం, వాటిని సమర్థవంతంగా పూడ్చకపోవడం వల్ల పౌర భద్రతకు సంబంధించిన ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వర్షాకాలంలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ వంటి విలాసవంతమైన ప్రాంతాల్లో సైతం నీటి నిల్వ సమస్యలు తలెత్తుతున్నాయి.

### పల్లె నుంచి పట్టణం వరకు ఒత్తిడి

ప్రపంచ బ్యాంకు 2023 నివేదిక ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సదుపాయం పట్టణాలతో పోలిస్తే దాదాపు 40 శాతం తక్కువగా ఉంది. తెలంగాణలోని ఆదిలాబాద్, నారాయణపేట్ వంటి జిల్లాల్లో నేటికీ అనేక గ్రామాల్లో సరైన నెట్‌వర్క్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు ఫీల్డ్ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఒకవైపు నగరాల్లో 6జీ కోసం తహతహలాడుతుంటే, మరోవైపు పల్లెల్లో కనీస సిగ్నల్ కూడా లేకపోవడం 'డిజిటల్ విభజన' ను పెంచుతోంది. పల్లెల్లో ఉపాధి అవకాశాలు తగ్గడంతో యువత పట్టణాలకు వలస కడుతున్నారు. ఫలితంగా హైదరాబాద్ వంటి నగరాల్లో గచ్చిబౌలి, హైటెక్ సిటీ వంటి ప్రాంతాలు జనాభా ఒత్తిడితో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. గ్రామీణ ప్రాంతా ల్లో రవాణా, సాగునీరు, ప్రాథమిక వైద్యం వంటి మౌలిక వసతులను విస్మరించి చేసే స్మార్ట్ సిటీ ప్రయోగాలు అసమగ్రంగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. పల్లెలో ఆర్థిక స్థిరత్వం దెబ్బతింటే, దాని ప్రభావం అంతిమంగా పట్టణాల ఆహార భద్రత, మౌలిక వసతులపై పడుతుందన్న సత్యాన్ని పాలకులు గ్రహించాలి.

### నేలపై మార్పే అసలైన పురోగతి

ఒక దేశం నిజంగా అభివృద్ధి చెందిందని చెప్పాలంటే కేవలం డేటా వేగం సరిపోదు, పౌరుల జీవన ప్రమాణాలే అసలు కొలమానం. అంబులెన్స్ సకాలంలో చేరలేని రోడ్లు, వర్షంలో మునిగిపోయే కాలనీలు ఉన్నప్పుడు అత్యాధునిక నెట్‌వర్క్‌ల విలువ తగ్గిపోతుంది. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన 'స్థిరమైన నగరాలు' లక్ష్యం నెరవేరాలంటే, సాంకేతిక పురోగతితో పాటు భౌతిక మౌలిక వసతుల సమన్వయం అత్యవసరం. క్లౌడ్‌లో వేగం ఎంత ఉన్నా, నేలపై జీవితం సౌకర్యవంతంగా లేకపోతే అభివృద్ధి అసంపూర్తిగానే మిగులుతుంది. పల్లె నుం చి పట్టణం వరకు సమాన అవకాశాలు, పటిష్ట మౌలిక వసతులు కల్పించినప్పుడే నిజమైన స్మార్ట్ సమాజం నిర్మాణం సాధ్యమవుతుంది. వ్యవస్థలోని లొసుగులను సరిదిద్ది, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా భౌతిక నగరాలను నిర్మించినప్పుడే అసలైన స్మార్ట్ విప్లవం సంభవిస్తుంది. అది గాలిలో మెరుపులా కాకుం డా, నేల మీద పటిష్టమైన పునాదిలా ఉండాలి.

ఫిరోజ్ ఖాన్, 9640466464

# మలేరియా రహిత భారతాన్ని నిర్మించలేమా!

ఆడ అనాఫిలిస్ దోమకాటు వల్ల ప్లాస్మోడియం అనబడే పరాన్న సుక్ష్మజీవి మానవ రక్తంలోకి చేరి మలేరియా వ్యాధికి కారణం అవుతుంది. చికిత్సను అశ్రద్ధ చేయడం ప్రాణాంతకం కూడా కావచ్చు. ప్రపంచాన్ని వణికించిన ప్రాణాంతక వ్యాధుల్లో మలేరియా కూడా ఒకటి. నేటి డిజిటల్ యుగంలో సహితం దాదాపు వందకు పైగా దేశాల 3.3 బిలియన్ల ప్రజలు మలేరియా అంచున కొట్టుమిట్టాడుతుండడం విచారకరం.

**ప్రపంచ మలేరియా దినం–-2025 ఇతివృత్తం:** ఐరాస నాయకత్వంలో 2007 నుంచి ప్రతి ఏట 25 ఏప్రిల్ రోజున ప్రపంచ మలేరియా దినం (వరల్డ్ మలేరియా డే) పాటించుట ఆనవాయితీగా మారింది. వరల్డ్ మలేరియా డే– 2026 ఇతివృత్తంగా మలేరియా అంతానికి చర్యలు: ఇప్పుడు చేయగలం, అనబడే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు.

**మలేరియా నియంత్రణ జాగ్రత్తలు, వ్యాధి లక్షణాలు:** మలేరియా కట్టడికి పౌర సమాజంతో పాటు ప్రభుత్వాలు కూడా నడుం బిగిస్తేనే ప్రయోజనం ఉంటుందని గమనించాలి. దోమల నిర్మూలన, పరిసరాల శుభ్రత, వ్యాధి నిర్ధారణ, సరైన చికిత్స, నిధుల కేటాయింపు, సామాన్య ప్రజలకు అవగాహన లాం టి చర్యలతో మలేరియా నియంత్రణ సుసాధ్యం కావడం మన అనుభవంలోకి వస్తున్నది. మలేరియా వ్యాధి లక్షణాల్లో జ్వరం, చలి వణుకు, చెమట, తల నొప్పి, అలసట, కండరాల కీళ్ల నొప్పులు, వాంతులు, రక్తహీనత, దగ్గు, కడుపు నొప్పి లాంటివి ఉన్నాయి. దోమకాటు బారినపడకుండా, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు మలేరియా సోకినపుడు వెంటనే వైద్య చికిత్స తీసుకోవడం మన కనీస కర్తవ్యం.

(25 ఏప్రిల్ 'ప్రపంచ మలేరియా దినం' సందర్భంగా)






www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



ఇష్టం లేకుండా గర్భం కొనసాగించాలని బలవంతం చేయలేం : సుప్రీంకోర్టు

పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత పునరుద్ధరించాలి

ఎస్‌పి ఎదుట లొంగిపోయిన మావోయిస్టు సభ్యురాలు 05



సంపుటి 09, సంచిక: 145 | శనివారం | 25-04-2026 | ఖమ్మం

Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**

పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## ఆర్టీసీ కార్మికుల సమస్యలపై

# సుదీర్ఘ చర్చలు

- ఐఎఎస్‌ల కమిటీ, మంత్రులతో జెఎసి నేతల మంతనాలు
- ఆర్టీసీ యాజమాన్యం నుండి 32 డిమాండ్లు పెట్టిన కార్మిక సంఘాలు
- 29 డిమాండ్లకు ఆమోదం తెలిపేందుకు సూత్రప్రాయ అంగీకారం
- మిగిలిన మూడు వెంటనే అమలు చేయాలని పట్టుపట్టిన జెఎసి నేతలు

ప్రజాపక్షం/హైదరాబాద్

సమ్మె చేస్తున్న ఆర్‌టిసి కార్మిక సంఘాలతో రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం దశలవారీగా చర్చలు చేసింది. ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ రాష్ట్ర సచివాలయంలో తొలుత కార్మికసంఘాలతో రెండో దఫా చర్చలు జరిపింది. అనంతరం మధ్యాహ్నం తరువాత ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క నేతృత్వంలోని మంత్రుల ఉప సంఘం కార్మిక సంఘాలతో చర్చలు జరిపింది. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్మిక సంఘాలు సంస్థ యాజమాన్యం ముందు ఉంచిన మొత్తం 32 డిమాండ్లపై వారి మధ్య చర్చలు జరగగా 29 డిమాండ్లను ఆమోదించేందుకు ఆర్‌టిసి యాజమాన్యం, ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిసింది. ప్రభుత్వంలో ఆర్‌టిసి విలీనం, వేతన సవరణ, సంస్థలో ట్రేడ్ యూనియన్ల పునరుద్ధరణ అమలుకు సమయం కావాలని ప్రభుత్వం కోరగా, ఆ 3 డిమాండ్లను కూడా వెంటనే అమలు చేయాలని కార్మిక సంఘాల ప్రతినిధులు పట్టుపట్టినట్లు సమాచారం. చర్చలలో రాష్ట్ర సచివాలయంలో ముందుగా ప్రభుత్వం నియమించిన ఉన్నతాధికారుల కమిటీతో సమావేశమై, తమ డిమాండ్లపై రెండో దఫా చర్చలు జరిపారు. ఈ సమావేశం సుమారు 4 గంటల సేపు తరువాయి 6లో

### ముత్తోజిపేటలో టెన్షన్.. టెన్షన్

## ఉద్రిక్తతల మధ్య

# శంకర్‌గౌడ్ అంత్యక్రియలు



- కాలిన గాయాలతో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందిన ఆర్టీసీ డ్రైవర్
- వరంగల్ జిల్లా నర్సంపేటలోని ముత్తోజిపేటకు మృతదేహం
- నర్సంపేట డిపోకు తరలించేందుకు కార్మికులు, కుటుంబ సభ్యుల యత్నం
- పోలీసులు, కార్మికులు, పార్టీల కార్యకర్తలకు మధ్య తోపులాటలు : ఉద్రిక్తం



ప్రజాపక్షం/వరంగల్

వరంగల్ జిల్లా నర్సంపేటలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఆర్‌టిసి డ్రైవర్ కోల శంకర్‌గౌడ్ (55) మృతి చెందారు. దాదాపు 80 శాతానికి పైగా కాలిన గాయాలతో హైదరాబాద్ డిఆర్‌డిఓ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు చనిపోయినట్లు ఆయన కుటుంబసభ్యులు తెలిపారు. అనంతరం గాంధీ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో బలవన్మరణానికి పాల్పడిన డ్రైవర్ శంకర్ గౌడ్ అంత్యక్రియలు తీవ్ర ఉద్రిక్తతల అంత్యక్రియలు తీవ్ర ఉద్రిక్తతల మధ్య పూర్తయ్యాయి. తొలుత మృతదేహాన్ని నర్సంపేట డిపోకు తరలించేందుకు కార్మికులు, ఆయన కుటుంబ సభ్యులు యత్నించడం ఉద్రిక్తతలకు దారితీసింది. పోలీసులు, కార్మికులు, పార్టీల కర్యకర్తలకు మధ్య తోపులాట చోటుచేసుంది. వీరికి విపక్షాలు, ప్రజా సంఘాలు మద్దతు తెలపగా కేంద్రమంత్రి బండి సంజయ్ పోలీసుల తీరుకు నిరసనగా ఆందోళన చేపట్టారు. చివరకు కుటుంబసభ్యులు, ఆర్టీసీ జేఏసీ నేతలతో పోలీసుల మంతనాలు ఒక కొలిక్కి రావడంతో తరువాయి 6లో

## రూ.10 లక్షలు సాయం

- శంకర్‌గౌడ్ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, ఒకరికి ఉద్యోగం
- రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన
- ఆర్టీసీ డ్రైవర్ కుటుబానికి అండగా ఉంటాం : సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

డ్రైవర్ శంకర్ గౌడ్ బలవన్మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా తరువాయి 6లో



## హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా శిఖాగోయల్

మల్కాజ్‌గిరి కమిషనర్‌గా సుమతి

ఫ్యూచర్‌సిటీ కమినర్‌గా తరుణ్‌జోషి

రాష్ట్రంలో ఏడుగురు ఐపిఎస్‌ల బదిలీ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా రాష్ట్ర ప్రభుత్వం ఐపిఎస్ అధికారి శిఖాగోయల్‌ను నియమించింది. ఈ మేరకు రాష్ట్రంలో ఏడుగురు ఐపిఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి రాష్ట్రంతో పాటు తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటి వరకు ఈ పోస్టులో మహిళా అధికారిని నియమించడం ఇదే తొలిసారి.ఈ ఉత్తర్వులు మే ఒకటవ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని రామకృష్ణారావు పేర్కొన్నారు. ఈ బదిలీలతో కీలక విభాగాల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజిగా ఉన్న షిఖా గోయల్‌ను హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా తరువాయి 6లో



## ఆత్మహత్యలొద్దు...

# తెగించి పోరాడుదాం

**శంకర్ గౌడ్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి**

ఆర్టీసి కార్మికులతో తగువు పెట్టుకుంటే పతనం తప్పదు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హెచ్చరిక

చట్ట పరమైన సమ్మెపై నిర్భంధాలు ఆపాలని డిమాండ్

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

సమస్యల పరిష్కారం కోసం విలువైన ప్రాణాలు తీసుకోవద్దని, ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదని, తెగించి పోరాడి హక్కులు సాధించుకుందామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడిన శంకర్‌గౌడ్ మృతికి సంతాపం తెలిపారు. ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసి కార్మికులు, ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె శుక్రవారానికి మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బస్టాండ్ ఔట్‌గేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించి బస్టాండ్ రోడ్‌పై ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో పాల్గొన్న కూనంనేని మాట్లాడుతూ కార్మికులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వానికైనా పతనం తప్పదని, ఆర్టీసి కార్మికులతో తగువు పెట్టుకోవడం పాలకుల వినాశనానికి నాంది పలికే ప్రమాదం ఉందని, గత ప్రభుత్వం తప్పిదమే తరువాయి 6లో

# సమ్మె న్యాయబద్ధమైనదే

- సమస్యలు సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉండడంతో ఇబ్బందులు పడుతున్న ఆర్టీసీ కార్మికులు
- ఆందోళనలు శాంతియుతంగా నిర్వహించాలి : ఎవరూ సహనం కోల్పోవద్దు
- సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విజ్ఞప్తి
- సూర్యాపేట ఆర్టీసీ డిపోవద్ద కార్మికులకు సంఘీభావం తెలిపిన సిపిఐ నేతలు



ప్రజాపక్షం/సూర్యాపేట

ఆర్‌టిసి కార్మికులు చేపట్టిన సమ్మె న్యాయబద్ధమైనదని ఆర్‌టిసి కార్మికుల సమస్యలు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వెంటనే స్పందించి వారి న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌టిసి డిపో ముందు జరుగుతున్న మూడో రోజు సమ్మెకు వారు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఆర్‌టిసి కార్మికులు, ఉద్యోగులు సహనం కోల్పోవద్దని తీవ్ర చర్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి ఆర్‌టిసి కార్మికులు చేసిన కృషి గుర్తుంచుకోవాలన్నారు. పిఆర్‌సి చట్టబద్ధంగా అమలు చేసే అంశం కాబట్టి ఎలాంటి ఇబ్బందులు ప్రభుత్వానికి ఉండబోవని, గత ప్రభుత్వ హయాంలో రద్దు చేసిన గుర్తింపు యూనియన్ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే ముందు తరువాయి 6లో



కాళోజీ సెంటర్‌లో రాస్తారోకో

## ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి


శంకర్‌గౌడ్ కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : తక్కళ్లపల్లి 12


## నేడు కవిత రాజకీయ పార్టీ ప్రకటన



మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో ఉదయం 10 గంటలకు సభ

జెండా ఆవిష్కరించి ఎజెండాను వివరించనున్న మాజీ ఎమ్మెల్సీ

ప్రజాపక్షం/హైదరాబాద్

'తెలంగాణ జాగృతి' అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నూతనంగా ఏర్పాటు చేయబోతున్న 'రాజకీయ పార్టీ' శనివారం ఆవిర్భవించనుంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మునీరాబాద్‌లోని 'అద్వయ కన్వెన్షన్' (ప్రొఫెసర్ జయశంకర్ ప్రాంగణం) లో వేదికగా ఉదయం 10 గంటలకు నూతన రాజకీయ పార్టీ పేరును ప్రకటించనున్నారు. తొలుత జెండా ఆవిష్కరించి, రాజకీయ పార్టీ ఎజెండాను కవిత వివరించనున్నారు. మునీరాబాద్ లోని అద్వయ కన్వెన్షన్ సెంటర్ తో పాటు దానిని ఆనుకుని ఉన్న తరువాయి 12లో



## సిఇసి జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాల్సిందే

**మరోసారి నోటీసు సమర్పించిన ప్రతిపక్షాలు**



**న్యూఢిల్లీ :** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని ప్రతిపక్షాలు మరోసారి డిమాండ్ చేశాయి. ఈ మేరకు రాజ్యసభలో ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతూ శుక్రవారం మరోసారి నోటీసు సమర్పించినట్లు వర్గాలు తెలిపాయి. ఇప్పటికే జ్ఞానేష్ కుమార్‌పై అనేక ఆరోపణలు చేయగా, తాజాగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో పక్షపాత ధోరణి కొనసాగుతోందని ఆరోపణలు చేశారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు, ఈనెల 18న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతినుద్దేశించి చేసిన ప్రసంగంపై వచ్చిన ఫిర్యాదులపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోలేదని ప్రతిపక్షాలు ఆరోపించాయి. వివిధ ప్రతిపక్ష తరువాయి 12లో



## బిజెపిలోకి ఏడుగురు ఆప్ రాజ్యసభ ఎంపిలు

**న్యూఢిల్లీ :** ఆమ్ ఆద్మీ పార్టీకి (ఆప్) భారీ ఎదురుదెబ్బ తగిలింది. రాఘవ్ చద్దా, సందీప్ పాఠక్, అశోక్ మిట్టల్‌తో సహా ఆ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు పార్టీని వీడారు. పాఠక్, మిట్టల్‌తో కలిసి చద్దా శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యులలో మూడింట రెండు వంతుల మంది పార్టీని వీడారని, వారంతా బిజెపిలో చేరనున్నారని తెలిపారు. పార్టీ ఎంపిలు హర్భజన్ సింగ్, స్వాతి మాలివాల్ కూడా ఆమ్ ఆద్మీ పార్టీని వీడుతున్నారని చద్దా పేర్కొన్నారు. 'నా రక్తం, తరువాయి 12లో

## కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడొద్దు



● సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్‌టిసి కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుద్దని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు. ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావని, పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసి కార్మికుల సమస్యలను, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని యన ప్రభుత్వాన్ని కోరారు. ఆత్మహత్యకు పాల్పడిన ఆర్‌టిసి కార్మికుడు శంకర్ గౌడ్ మృతి బాధాకరమని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని ఆయన కోరారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే దుర్ఘటనలు మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఆర్‌టిసి కార్మికులు ప్రజా సేవలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారికి తగిన గౌరవం, భద్రత, వేతనాలు అందకపోవడం బాధాకరమని సత్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌టిసిని బలోపేతం చేయడం, కార్మికులకు భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.


తెలంగాణ ప్రభుత్వము
జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూసేకరణ)
నాగర్ కర్నూల్ జిల్లా

సంఖ్య Gaz. No. 65/2026

సంఖ్య. G2/139/2026 తేది: 15.04.2026

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 19(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 25 ప్రకారము

ఫారం. VII

(Declaration) రూఢీ ప్రకటన

నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలంలోని గంగారం గ్రామము వద్ద ప్యాకేజి నెం. 29 మార్కేండేయ లిఫ్ట్ యొక్క శాయినిపల్లి కెనాల్ గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్లో ఉదహరించిన **ఎ. 1.20 గుంటలు** భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా మార్కేండేయ లిఫ్ట్ యొక్క శాయినిపల్లి కెనాల్ నిమిత్తం సేకరించవలిసిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి **ఎ.లు 1.20 గు.** భూమి మార్కేండేయ లిఫ్ట్ యొక్క శాయినిపల్లి కెనాల్ నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకు గాను రూఢీ ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

గ్రామము: గంగారం మండలం: బిజినపల్లి జిల్లా: నాగర్‌కర్నూల్

| క్ర. సం. | [illegible] | పట్టా / ఇనాం etc., | [illegible] | [illegible] | పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏవైన హక్కులు గల యితర వ్యక్తులు | సరిహద్దులు | | | | చెట్లు | | నిర్మాణములు | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | ఉ | ద | తూ | ప | [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 360 | లావుణి పట్టా | మెట్ట | 1.20 | రాత్లావత్ నార్య తండ్రి బీక్య (0.02) రాత్లావత్ మోత్య తండ్రి బీక్య (0.02) రాత్లావత్ దీప తండ్రి బీక్య (0.02) ఆర్. ధాక్య తండ్రి ధన్ సింగ్ (0.09) ఆర్. నర్వ తండ్రి ధన్ సింగ్ (0.09) ఆర్. లింబ్య తండ్రి ధన్ సింగ్ (0.09) ఆర్. చంద్రు తండ్రి ధన్ సింగ్ (0.09) ఆర్. లాల్ సింగ్ తండ్రి ధన్ సింగ్ (0.09) ఆర్. రాము తండ్రి ధన్ సింగ్ (0.09) ఆర్. బిచ్య తండ్రి గేగ్యా ఆర్. సర్య తండ్రి రాంసింగ్ ఆర్. శంకర్ తండ్రి రాంసింగ్ ఆర్. జేత్య తండ్రి రాంసింగ్ ఆర్. రవి తండ్రి సామ్య సిఎచ్. కాశన్న తండ్రి వెంకటయ్య కె. సూర్యకాంతం భర్త ఎనోకు పి. దేవదానం తండ్రి బాలయ్య జి. బచ్చన్న తండ్రి చంద్రయ్య ఎస్. చంద్రశేఖర్ తండ్రి మల్లయ్య జి. కృష్ణయ్య తండ్రి చంద్రయ్య జి. మంజునాథ స్వామి తండ్రి పెద్ద మల్లయ్య జి. ఆంజనేయులు తండ్రి పెద్ద మల్లయ్య జి. భాస్కర్ తండ్రి పెద్ద మల్లయ్య పి. రత్నయ్య తండ్రి భీమయ్య కె. మల్లస్వామి తండ్రి రాములు ఆర్. చాంది భర్త నార్య ఆర్. గోమ్లీ భర్త లింబ్య జి. నాగరాజు తండ్రి హన్మంతు ఆర్. హర్య తండ్రి కాస్న ఆర్. చిన్నమ్మ భర్త చంద్య ఆర్. సాలి భర్త రాము ఆర్. శంకర్ తండ్రి వస్య దేవా తండ్రి రాంసింగ్ ఆర్. చంద్రు తండ్రి ధన్ రాజు ఆర్. రెడ్యా తండ్రి కస్నా జి. చంద్రయ్య తండ్రి బాలయ్య జి. శ్రీశైలం తండ్రి బాలయ్య జి. శివరాములు తండ్రి పెద్ద రాములు నాను తండ్రి రాంసింగ్ జి. వెంకటయ్య తండ్రి పెద్ద భీమయ్య జి. బంగారి తండ్రి పెద్ద భీమయ్య జి. నాగయ్య తండ్రి నర్సింహ్మా సిఎచ్. నీలమ్మ భర్త వెంకటస్వామి పర్వతాలు తండ్రి రాములు భీమయ్య తండ్రి రాములు ఆర్. హన్మంతు తండ్రి గేన్యా | 469 | 59 | 463 | 480/1 | లేవు | లేవు | బోర్లు పైప్ లైన్ | 3 |
| | | మొత్తం | | 1.20 | | | | | | | | | |

భూసేకరణ చట్టం 30/2013 లోని సెక్షన్ 15 అనుసరించి పైన కనబరిచిన భూములకు సంభందించినటువంటి రైతుల నుండి ఎటువంటి అభ్యంతరములు/ ఆక్షేపణలు లేనందున ఇట్టి రూఢి ప్రకటన చేయడమైనది.

భూసేకరణ తల పెట్టిన భూలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూ సేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్‌కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ప్రకారము పైన చూపిన భూసేకరణ పిమ్మట ఏ ఒక్కరూను వారి జీవనోపాధి కోల్పోవడం గానీ, భూ లేని వారిగా గాని జరగడము లేనందున ఇట్టి భూసేకరణ ప్రక్రియనందు పునరుపాధి మరియు పునరావాస కల్పన ప్రతిపాదనలు ఏమియును లేవు.

సం/- స్పెషల్ డిప్యూటి కలెక్టర్ (భూ.సే), యూనిట్-I, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్
సం/- అదనపు కలెక్టరు, నాగర్‌కర్నూల్
సం/- జిల్లా కలెక్టర్, నాగర్‌కర్నూల్

DIPR RO NO. 122/LA/PP/Advt/Pub/2026-27


# సమ్మె తీవ్రం కాకముందే ముగించాలి

● వెంటనే పరిష్కారం చూపాలి
● లేకుంటే ఉద్యమం ఉధృతం చేస్తాం
● సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌టిసి కార్మికుల సమ్మె తీవ్రతరం కాకముందే ప్రభుత్వం సమస్యలను పరిష్కరించి సమ్మెకు ముగింపు పలకాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి. నరసింహ అన్నారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆర్‌టిసి కార్మికుల సమ్మెకు మద్దతుగా హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి అధ్యక్షత వహించారు. సమావేశంలో ఆర్‌టిసి జెఎసి నాయకులు గోపాల్ ప్రారంభ ఉపన్యాసం చేస్తూ, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం ముందు ఉంచిన డిమాండ్‌లను వివరించారు.

ఈ సందర్భంగా ఈ.టి. నరసింహ మాట్లాడుతూ గతంలో తెలుగు రాష్ట్రాల్లో ఆర్‌టిసి కార్మికులు చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి, కెసిఆర్ హయాంలో జరిగిన సమ్మెల కంటే నేడు రేవంత్ రెడ్డి పాలనలో కార్మికులు వంద శాతం ఐక్యంగా సమ్మెలో పాల్గొనడం చారిత్రాత్మకమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఇప్పటికీ ప్రజల్లో ఆర్‌టిసి కార్మికుల్లో నమ్మకం ఉందన్నారు. ఈ నమ్మకాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీపై ఉందన్నారు. లేదంటే కార్మికులకు మద్దతుగా సిపిఐ పార్టీ ప్రజలను ఏకం చేసి, ప్రజా రవాణా వ్యవస్థను కాపాడుకోవడం కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని నరసింహ హెచ్చరించారు. సిపిఐ(ఎం) నగర కార్యదర్శి వెంకటేశ్ మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్లే కార్మిక వర్గం సమ్మెలకు దిగుతోందని విమర్శించారు. విద్యుత్ రంగ కార్మికులు, అంగన్‌వాడి సిబ్బంది, ఆర్‌టిసి ఉద్యోగులు సమ్మెల్లోకి వెళ్లడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేత జె.వి. చలపతి మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికులకు పోరాటాల గొప్ప చరిత్ర ఉందని, ఆత్మహత్యలకు పాల్పడకుండా సమరశీలంగా పోరాటం కొనసాగించాలని కోరారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకుడు సదానందం మాట్లాడుతూ సమ్మెకు మద్దతుగా ఏర్పాట్లు చేసిన వారిని పోలీసులు బెదిరించడం సరైంది కాదన్నారు. సమస్యను అణచివేత ద్వారా కాకుండా చర్చల ద్వారా పరిష్కరించాలని సూచించారు. ఎంసిపిఐ(యు) నగర కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం ద్వారానే సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యమన్నారు. ఎస్‌యుసిఐ(సి) నగర కార్యదర్శి తేజ మాట్లాడుతూ ప్రజా రవాణా వ్యవస్థ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆర్‌టిసి కార్మికులను కాపాడుకోవడం ప్రజల బాధ్యత అన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు అరెల్లి కృష్ణ మాట్లాడుతూ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడకూడదని, వారి ఉద్యమానికి వామపక్షా లు అండగా ఉంటాయని తెలిపారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.బాలరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించకపోవడం వల్లే సమ్మె కొనసాగుతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి చేస్తున్న ప్రకటనలతో సమస్యలు పరిష్కారం కావన్నారు. బహుజన ఉద్యమ నాయకుడు బట్టు శ్రీధర్ మాట్లాడుతూ సమస్యలకు పోరాటమే పరిష్కారమన్నారు. ఆర్‌టిసి కార్మికుల సమ్మెకు మద్దతుగా ఈనెల 25 ఉదయం 10 గంటలకు ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్‌తో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.నరసింహ, నేర్లకంటి శ్రీకాంత్, ఉమర్ ఖాన్, మొహమ్మద్ సలీం, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, లక్ష్మి నారాయణ, హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ సభ్యులు మహమూద్, చెట్టుకింది శ్రీనివాస్, ఆరుట్ల రాజ్ కుమార్, జేర్రిపోతుల కుమార్, కాశన్న, గౌస్, సుశాంత్, మనోజ్, ఆర్‌టిసి కార్మికులు సాయి, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.




## ముందే మద్దతు ధరలు ప్రకటించాలి

● తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రతీ సీజన్లలో పంటలు వేయడానికి ముందే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ధరలు ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో జరుగుతున్న ఏఐకేఎస్ రాష్ట్ర మూడో మహాసభల సందర్భంగా రెండో రోజైన శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర పంటల విధానాన్ని ప్రవేశపెట్టాలన్నారు. వరి, మొక్కజొన్న, పత్తి పంటలే కాకుండా ఇతర పంటలకు కూడా మద్దతు ధరలు, బోనస్‌లు ప్రకటించాలని ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కర్నాటక తరహాలో ధరల నిర్ణయ కమిటీలు ఏర్పాటు చేసి ముందుగానే మద్దతు ధరలు ప్రకటించడం మంచిదన్నారు. విత్తన బ్యాంకుల ద్వారానే నాణ్యమైన విత్తనం సాధ్యమని చెప్పారు. విత్తన వ్యాపార సంస్థలు లాభసాటి విత్తనాల గురించి ప్రచారం చేస్తాయని అందుకే ప్రైవేటు విత్తన కంపెనీల మోసాలకు గురికావద్దని రైతులకు సూచించారు. గతంలో అన్ని పంటలను సీజన్లలో పండించిన వారసత్వం ఉందని, ఇప్పుడు కూడా రైతులు ఆ దిశగా నడిచేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కేరళ ప్రభుత్వం 16 పంటలకు 22 శాతం మద్దతు ధర ప్రకటించడం వల్ల ఆ రాష్ట్రంలో రైతులు సుభిక్షంగా ఉన్నారని, ఆ తరహాలో తెలంగాణ ప్రభుత్వం కూడా రైతు సంక్షేమానికి పాటుపడాలని చెప్పారు. గత బడ్జెట్‌తో పోలిస్తే ఈసారి వ్యవసాయానికి రూ.1260 కోట్ల మేర నిధుల కోత పెట్టడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. అదే సమయంలో 1.4 శాతం వ్యవసాయ ఆదాయం పెరిగిందని చెప్పారు. ఆదాయం పెరిగినప్పుడు బడ్జెట్‌లో కోత పెట్టాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. వేసవి సమీపిస్తుండగానే భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. భారత్‌—అమెరికా వాణిజ్య ఒప్పందం దేశ ప్రయోజనాలకు తీవ్ర ప్రమాదకరంగా ఉందని, ఆ ఒప్పందం రద్దయ్యేంత వరకు పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

## తక్షణమే గీత కార్మికుల సమస్యలకు పరిష్కారం

● ఎక్సైజ్ కమిషనర్‌కు తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కల్లు గీత వత్తిలో నిమగ్నమై చెట్లపై నుండి పడి మరణించిన కుటుంబాలకు, క్షతగాత్రులు అయినవారికి ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా మంజూరై ఇప్పటికీ చెల్లించకపోవడం సరైనది కాదని, తక్షణం వారికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ నేతృత్వంలో సమన్వయ కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం, కార్యదర్శి మారగాని ప్రవీణ్ కుమార్‌లతో కూడిన ప్రతినిధి బృందం ఎక్సైజ్ కమిషనర్ సి.హెచ్.హరికిరణ్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కల్లుగీత వృత్తిదారుల కుటుంబాలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వారికి కనీసం ఎక్స్‌గ్రేషియా బకాయిలు కూడా చెల్లించకపోవడం, అర్హులైన గీత వృత్తిదారులకు గుర్తింపుకార్డులు, పెండింగ్‌లో ఉన్న కొత్త సొసైటీలు, టిఎఫ్‌టిల లైసెన్స్‌లు ఇవ్వాలని, ఏజెన్సీ ఏరియాలోని గీత వృత్తిదారులకు సొసైటీలు, టిఎఫ్‌టిలు ఏర్పాటు చేయాలని అన్నారు. 560 జీఓ ప్రకారం కల్లుగీత సహకార సంఘాలకు వన పెంపకానికి భూములు, షాప్‌ల ఏర్పాటుకు గ్రామాలలో వెయ్యి గజాలు, పట్టణాలలో 2000 గజాలు కేటాయించాలని కోరారు.

గ్రామీణ అభివృద్ధి, పట్టణాభివృద్ధి కింద నిధులు కేటాయించి వారి అభ్యున్నతికి చర్యలు చేపట్టాలని కోరారు. చింతల బస్తీకి చెందిన కల్లు సహకార సంఘానికి ఎక్సైజ్ సూపరిండెంట్ ఏర్పాటు చేసిన పర్సన్ ఇన్‌చార్జి కమిటీకి బాధ్యతలు అప్పగించి గీత వృత్తిదారులకు ఉపాధి కల్పించడానికి తక్షణం చర్యలు చేపట్టాలని, ఆ సొసైటీలకు చెందిన వారి విజ్ఞప్తిని కమిషనర్ దృష్టికి తీసికెళ్ళినట్లు తెలిపారు. అర్హులైన గీత కార్మికులందరికీ కాటమయ్య కిట్స్ అందించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# టికెట్ ఏదైనా యాప్ ఒక్కటే

'మీ టికెట్ యాప్' ద్వారా సరళమైన సేవలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వీకెండ్ సరదాగా.. ఫ్యామిలీతో బయటకు వెళ్లాలనుకుంటున్నారా.. మెట్రోలో ప్రయాణం... టెంపుల్ విజిట్, ఏదైనా పార్క్..?? లేదంటే గోల్కొండ ఫోర్ట్, మ్యూజియం సందర్శన చేయాలనుకుంటున్నారా.. పిల్లలకు సెలవులొచ్చాయి కానీ.. ఎండాకాలం అని భయపడుతున్నారా.. తీరా అక్కడికి వెళ్లాక టికెట్ కౌంటర్, క్యూలైన్ అని వెనక్కు తగ్గుతున్నారా..?? ఇప్పుడా అవసరం లేదు.. స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు.. జస్ట్ ఒక్క క్లిక్‌తో వీకెండ్ ప్లాన్ అంతా సాఫీగా జరిగిపోతోంది. టికెట్ ఏదైనా.. యాప్ ఒక్కటే నినాదంతో ఈ మీటికెట్ యాప్ ప్రజాదరణ పొందుతోంది. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని సేవలను ఈయాప్ పరిధిలోకి తీసుకువస్తామని, ఐటీ సేవలను పౌరసమాజం నిత్య జీవితంలో మరింతగా వాడుకునేలా విస్తరిస్తామని సమాచార సాంకేతిక శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. సందర్శించే ప్రాంతం ఏదైనా, అక్కడిదాకా వెళ్లి క్యూలైన్‌లో నిరీక్షించే బదులు మీటికెట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సులభంగా, సౌకర్యవంతంగా అక్కడి ఎంట్రీ టికెట్లను, సౌకర్యాలను బుక్ చేసుకోవచ్చని మీ సేవ కమిషనర్ టి. రవి కిరణ్ వెల్లడించారు. మీ స్మార్ట్‌ఫోన్ ద్వారా సింపుల్‌గా ప్లే స్టోర్ నుంచి 'మీ టికెట్ యాప్' (MEE TICKET APP) డౌన్‌లోడ్ చేసుకుని, మన ప్రయాణ టికెట్లతో సహా, విజిటింగ్ ప్లేస్ టికెట్లు కూడా ఇంటి దగ్గరి నుంచే బుక్ చేసుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం ఐటి శాఖ పరిధిలో ఉన్న మీ సేవ ద్వారా తెచ్చిన ఈ మీటికెట్ యాప్ ఇప్పుడు ఎన్నో సర్వీసులను మీ అరచేతిలో ఉన్న ఫోన్ ద్వారా పొందే సౌకర్యాన్ని కల్పిస్తోంది. బస్, మెట్రో ప్రయాణ టికెట్లు మొదలు, టెంపుల్స్, పార్కులు, మ్యూజియం, ఫారెస్ట్ సఫారీ సందర్శన ఇలా చాలా రకాల సౌకర్యాలు, వాటి టికెట్లను అక్కడి క్యూ లైన్‌తో సంబంధం లేకుండా నేరుగా మనమే బుక్ చేసుకోవచ్చు. ఒక వేళ మీరు మీ ఎలక్ట్రిక్ కారులో (ఇవి కార్) ప్రయాణిస్తే సమీపంలో ఉన్న ఛార్జింగ్ స్టేషన్ లోకేషన్‌ను కూడా ఈ యాప్ ద్వారా తెలుసుకునే వెసులుబాటు కూడా ఉంది. ఇలా ఇండోర్, అవుట్ డోర్ యాక్టివిటీస్ తో పాటు




వివిధ సేవలను ఒకే యాప్ ద్వారా అందించటమే మీ టికెట్ యాప్ లక్ష్యం. ప్రవేశపెట్టిన కొద్ది రోజుల్లోనే ఈ యాప్ మంచి ప్రజాదరణ పొందుతోంది. ఇప్పటికే సుమారు రెండున్నర లక్షల మంది ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఆరు లక్షలకు పైగా సేవలను పౌరులు బుక్ చేసుకున్నారు. నాలుగు కోట్ల రూపాయలకుపైగా విలువైన లావాదేవీలు సురక్షితంగా జరిగాయి. వివిధ ప్రభుత్వ శాఖలు నిర్వహించే 219 లోకేషన్లలో ఈ మీ టికెట్ యాప్ ద్వారా అక్కడి సేవలకు సంబంధించిన ప్రవేశటికెట్లను నేరుగా యాప్‌లోనే ప్రజలు పొందుతున్నారు.

## డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలి

● ఎపి పిటిడి ఎంప్లాయిస్ యూనియన్ విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమ్మె చేపట్టిన తెలంగాణ ఆర్‌టిసి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఎపి పిటిడి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండటం వల్ల వారు తప్పని పరిస్థితుల్లో సమ్మెకు దిగాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని శుక్రవారం ఒక ప్రకటన వారు పేర్కొన్నారు. సమ్మెలో పాల్గొంటున్న ఆర్‌టిసి కార్మికులు ఆవేశంలో ఎటువంటి అఘాయిత్యాలు, ఆత్మహత్యల వంటి తీవ్రమైన చర్యలకు పాల్పడకుండా, ఆత్మస్థైర్యంతో పోరాటాన్ని కొనసాగిస్తూ తమ సమస్యలను పరిష్కరించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఆర్‌టిసి ఉద్యోగుల సమ్మెకు ఎపిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ పూర్తి సంఘీభావం తెలుపుతూ, వారి న్యాయపరమైన డిమాండ్ల సాధనకు మద్దతు ప్రకటిస్తున్నామని, తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉద్యోగుల సమస్యలు, కార్మికుల న్యాయమైన డిమాండ్స్‌ను చర్చల ద్వారా పరిష్కరించాలని కోరారు.

# రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి

● నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చిన తర్వాత రికార్డ్ స్థాయిలో ధాన్యం ఉత్పతి అవుతున్న నేపథ్యంలో 'రబీ సీజన్'లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ధాన్యం కొనుగోలు నిమ్మితం రాష్ట్ర వ్యాప్తంగా 8,500 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, ఇప్పటికే 5 వేల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. 20 జిల్లాల్లో ఇప్పటికే ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభవ్వగా, సాగు ఆలస్యమైన నేపథ్యంలో మరో 13 జిల్లాలో కొనుగోలు ప్రక్రియ ఇంకా మొదలు పెట్టలేదన్నారు. 'రబీ సీజన్'లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ హైదరాబాద్‌లోని సచివాలయంలో పౌర సరఫరాల శాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి శుక్రవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, అడిషనల్ డైరెక్టర్ రోహిత్ సింగ్, డిప్యూటీ కమిషనర్ కొండల్‌రావు, జనరల్ మేనేజర్‌తో పాటు ధాన్యం కొనుగోళ్లు, ఫైనాన్స్, మార్కెటింగ్‌లకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయి సమాచారం మేరకు రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రానుందని, ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించి తగిన ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. ఇప్పటి వరకు నాలుగు లక్షల 89 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు వివరించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు 12 లక్షల మెట్రిక్ టన్నులకు వీలుగా గోదాములను గుర్తించామని, మరో 20 లక్షల బాయిల్డ్ రైస్‌ను నిల్వ ఉంచేందుకు జిల్లాల వారీగా కేటాయింపులు జరిపినట్టు ఆయన తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో 16 కోట్ల గన్ని బ్యాగులను అందుబాటులో ఉంచామన్నారు.

**ఎప్పటికప్పుడే చెల్లింపులు....**

రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి ఎప్పటికప్పుడు చెల్లింపులు జరిగేలా చూడాలని, దీనికి సంబంధించి పౌర సరఫరాల, మార్కెటింగ్ శాఖలతో పాటు జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు. పొరుగు రాష్ట్రాల నుండి అక్రమంగా ధాన్యాం రాకుండా అంతర్ రాష్ట్ర చెక్ పోస్టుల వద్ద నిఘాను తీవ్రతరం చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ తెలిపారు.

## హైదరాబాద్ బుక్ ఫెయిర్ వ్యవస్థాపకులు ఎస్.గోపాలరావు మృతి

● సంతాపం ప్రకటించిన బుక్ ఫెయిర్ కమిటీ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ బుక్ ఫెయిర్ వ్యవస్థాపకులు ఎస్. గోపాలరావు గురువారం కొండాపూర్‌లోని తన కుమారుడి నివాసంలో మృతి చెందినట్లు బుక్ ఫెయిర్ కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు. 90 సంవత్సరాలు వయస్సు ఉన్న గోపాలరావు అనారోగ్య కారణాలతో అకాల మృతి చెందారు. వారి భౌతిక దేహాన్ని ఏప్రిల్ 26 (ఆదివారం) ఆర్‌టిసి క్రాస్ రోడ్స్‌లోని తన గృహంలో మిత్రుల సందర్శనార్థం ఉంచి, అంత్యక్రియలు నిర్వహించనున్నారు. సోము గోపాలరావు 1986లో హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ వ్యవస్థాపకుల్లో ఒకరు. తొలి పుస్తక ప్రదర్శనకు సమన్వయకర్తగా వ్యవహరించారు. సైంటిఫిక్ సర్వీసెస్ అనే సంస్థ ద్వారా వారు పుస్తక రంగానికి సేవలు అందించారు. అనేక పుస్తక ప్రదర్శనల నిర్వహణలో వారి పాత్ర వున్నది. హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు డా.కవియాకూబ్, ఉపాధ్యక్షుడు మలుపు బాల్‌రెడ్డి, బుక్ ఫెయిర్ కార్యదర్శి ఆర్.వాసు, కోశాధికారి నారాయణరెడ్డి, సంతాపాన్ని తెలియజేస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసారు.

## హామీ మేరకు విలీనం చేయాలి

● సిపిఐ మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు టిజి ఆర్‌టిసిని వెంటనే ప్రభుత్వంలో విలీనం చేయాలని సిపిఐ మాజీ ఎంపి, టిజిఎస్‌ఆర్‌టిసి ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షులు సయ్యద్ అజీజ్ పాషా డిమాండ్ చేశారు. సమ్మె కారణంగా నిత్యం ప్రయాణించే 65 లక్షల మంది ప్రజలు అధిక ఛార్జీలు చెల్లిస్తూ ప్రైవేటు బస్సులు, ఇతర వాహనాలలో ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు 92 ఏళ్ల ముందే 'రోడ్డు రవాణా విభాగం'గా స్థాపించబడిన ఆర్‌టిసికి సంబంధించి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె రూపంలో లభించిన అచంచల మద్దతు గురించి ప్రస్తుత ప్రభుత్వానికి పూర్తి అవగాహన ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే ఆర్‌టిసి విలీన ప్రక్రియను పూర్తి చేసిందని, తెలంగాణాలో ఈ నిర్ణయం అమలు చేయడంలో ఎందుకు జాప్యం చేస్తోందని ఆయన ప్రశ్నించారు.

# చర్చలే తప్ప.. ఆత్మహత్యలు పరిష్కారం కాదు

● రైతు బంధు - రైతు బోనస్‌పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి: గుత్తా సుఖేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ :** ఆర్టీసీ కార్మికులు, ప్రభుత్వం ఇద్దరూ పట్టుదలతో వ్యవహరించకుండా ప్రజల పక్షాన ఆలోచించి సమ్మెను విరమించే దిశగా ముందుకు రావాలని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు కీలక అంశాలపై మాట్లాడారు. ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని పేర్కొంటూ, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. సమస్యలకు కేవలం చర్చల ద్వారానే పరిష్కారం లభిస్తుందని, ఇలాంటి ఘటనల వల్ల కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయని అన్నారు. యాసంగి ధాన్యం కొనుగోళ్ల విషయంపై మాట్లాడుతూ కొనుగోళ్లు వేగంగా సాగుతున్నాయని, ఈసారి తాలు సమస్య ప్రధాన ఇబ్బందిగా మారిందన్నారు. సీడ్స్ కారణంగానే ఈ సమస్య వస్తోందని అధికారులు తెలిపారని చెప్పారు. అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోయే అవకాశం ఉన్నందున ధాన్యాన్ని మిల్లులకు వేగంగా తరలించే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతు బంధు పూర్తిగా అందలేదనే అసంతృప్తి రైతుల్లో ఉందని, రైతు బోనస్, రైతు బంధు రెండు పథకాల వల్ల ప్రభుత్వంపై ఆర్థిక భారం పెరుగుతుందని అన్నారు. ఈ రెండు పథకాలలో రైతులకు ఏది మేలు చేస్తుందో ప్రభుత్వం ఆలోచించి, కనీసం ఒక పథకాన్ని సంపూర్ణంగా అమలు చేస్తే మంచిదని సూచించారు. ఇతర రాష్ట్రాల్లో పండిన ధాన్యాన్ని ప్రభుత్వాలు కొనకపోవడంతో అక్కడి రైతులు తెలంగాణకు వచ్చి ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారని, ఇది తెలంగాణ రైతాంగానికి నష్టంగా మారుతోందన్నారు. మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు విషయంలో సహకరించాలని కోరినా ఎలాంటి సహాయం అందలేదని విమర్శించారు. వాస్తవాలను పక్కనబెట్టి ప్రతిపక్షాలు రాజకీయాలు చేయడం తగదని, ప్రజలను రెచ్చగొట్టి ప్రయోజనం పొందాలని చూడవద్దని సూచించారు. కాళేశ్వరం అంశంపై పీసీ ఘోష్ కమిషన్ విషయంలో ఎవరికీ హైకోర్టు క్లీన్ చిట్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. సెక్షన్ 8 ప్రకారం నోటీసులు ఇవ్వనందున కెటి రామారావు, కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుపై చర్యలకు ఉపక్రమించవద్దని మాత్రమే హైకోర్టు తెలిపిందన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని, వారికి అవకాశాలు కల్పించాలని తాను కోరుకుంటున్నానని చెప్పారు. తాను పోటీ చేసే విషయం అప్పటి రాజకీయ పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకుంటామని గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు.


సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
మియాపూర్ సర్కిల్-48 : ఎస్ఎల్‌పి జోన్

Quotation Notice No. ENG-01/GHMC/CIR-48/2026-27, తేది: 24.04.2026

ఈవెంట్స్: మియాపూర్ సర్కిల్-48 సర్కిల్ కార్యాలయం (CMC ఆఫీసు భవనం)లో ప్రీకాస్ట్ స్లాబ్లను సరఫరా చేయడం కోసం కొటేషన్లు ఆహ్వానించబడుతున్నాయి, **తేది & సమయం:** 25.04.2026 మ.2.00గం.ల నుండి 02.05.2026 మ.2.00గం.ల వరకు, **సంప్రదించవలసిన అధికారి చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మియాపూర్ సర్కిల్-48, ఎస్ఎల్‌పి జోన్, సిఎంసి.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మియాపూర్ సర్కిల్-48, ఎస్ఎల్‌పి జోన్, సిఎంసి.

DIPR R.O. No. : 1385-PP/CL/ADVT/2026-27, Date: 24-04-2026

ఇష్టం లేకుండా గర్భం కొనసాగించాలని...

# బలవంతం చేయలేం

• సుప్రీంకోర్టు స్పష్టీకరణ • ఏడు మాసాల గర్భం ధరించిన 15 ఏళ్ల బాలికకు వైద్యపరంగా అబార్షన్‌కు అనుమతి మంజూరు

**న్యూఢిల్లీ :** ఏడు నెలలకు పైగా గర్భం దాల్చిన ఓ 15 ఏళ్ల బాలికకు సుప్రీంకోర్టు శుక్రవారం వైద్యపరంగా తొలగించుకునేందుకు అనుమతి ఇస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక మహిళను ముఖ్యంగా మైనర్‌ను, ఆమె ఇష్టం లేకుండా గర్భం కొనసాగించాలని బలవంతం చేయలేమని, అలా బలవంతం చేసే హక్కు ఏ కోర్టుకూ లేదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మాట్లాడుతూ పుట్టబోయే బిడ్డ నిర్ణయం కంటే గర్భవతి అయిన మహిళ నిర్ణయానికే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని తెలిపింది. అటువంటి గర్భం కొనసాగడం వల్ల ఆ మైనర్ మానసిక ఆరోగ్యం, విద్యావకాశాలు, మొత్తం అభివృద్ధిపై దీర్ఘకాలిక పరిణామాలు ఏర్పడే అవకాశముందని పేర్కొంది. మహిళ యొక్క పునరుత్పత్తి స్వేచ్ఛకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఒకవేళ ఇష్టం లేని గర్భాన్ని కొనసాగించాలని మహిళను బలవంతం చేస్తే ఆమె హక్కులు ఉల్లంఘించబడినట్లేనని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఒకరి శరీరానికి సంబంధించిన విషయాలలో ముఖ్యంగా పునరుత్పత్తికి సంబంధించిన విషయాలలో నిర్ణయాలు తీసుకునే హక్కు వ్యక్తిగత స్వేచ్ఛలో ఒక అంతర్భాగమని ధర్మాసనం స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ముఖ్యంగా మైనర్లు అవాంఛిత గర్భాల వంటి ప్రస్తుత కేసుల వంటి సందర్భాలలో అసమంజసమైన ఆంక్షలు విధించడం ద్వారా ఆ హక్కును నిర్వీర్యం చేయరాదని తెలిపింది. గర్భాన్ని పూర్తికాలం మోయమని బలవంతం చేయడం ఆమె నిర్ణయాధికారాన్ని ఉల్లంఘించడమే కాకుండా, ఒకవేళ ఆమెను ప్రసవించమని బలవంతం చేస్తే తీవ్రమైన మానసిక, భావోద్వేగ, శారీరక క్షోభకు కూడా గురిచేయడం అవుతుందని ధర్మాసనం పేర్కొంది.గర్భవతి అయిన స్త్రీ బిడ్డను పెంచుతున్న క్రమంలో ఆ బిడ్డను పెంచడంపై ఆమెకు ఆసక్తి కలిగి లేనట్లయితే ఆ బిడ్డను ఆమె దత్తతకు ఇవ్వవచ్చని, అందువల్ల ఆమె బిడ్డకు జన్మనివ్వాల్సి ఉంటుందని బెంచ్ వివరించింది. ఒకవేళ అవాంఛిత గర్భాన్ని కూడా కొనసాగించాల్సిందేనని రాజ్యాంగ న్యాయస్థానం పేర్కొంటే, అప్పుడు పార్టీలు అనుమతి కోసం కోర్టును ఆశ్రయించకుండా అక్రమ అబార్షన్ కేంద్రాలకు వెళ్లడం లేదా రహస్యంగా గర్భాన్ని తొలగించుకోవడం వంటివి చేస్తారని, ఇది గర్భిణిని మరింత బలహీనపరిచి, ప్రమాదాలకు గురిచేస్తుందని ధర్మాసనం తెలియజేసింది. ఈ కేసులో మైనర్ వయస్సు 15 సంవత్సరాలని, గర్భం అవాంఛనీయమైనదని, గర్భవతి అయిన మైనర్ రెండుసార్లు తన ప్రాణాలను తీసుకోవడానికి ప్రయత్నించినప్పుడు గర్భాన్ని కొనసాగించడం ఆమె ప్రయోజనాలకు మంచిది కాదని సుప్రీంకోర్టు హితవు పలికింది.



పంచాయతీరాజ్ వ్యవస్థను

# మరింత పునరుద్ధరించాలి

వ్యక్తిగత రాజకీయ మనుగడ కోసం లోక్‌సభ బలాన్ని పెంచడం కంటే ఇది చాలా అత్యవసరం : కాంగ్రెస్





**న్యూఢిల్లీ :** మహిళా సాధికారతకు పంచాయతీ రాజ్ వ్యవస్థ ముఖ్యమైన మాధ్యమమని, వ్యక్తిగత రాజకీయ మనుగడ కోసం లోక్‌సభ బలాన్ని పెంచడం కంటే దానిని మరింత పునరుద్ధరించడం చాలా అత్యవసరమని కాంగ్రెస్ పేర్కొంది. పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా, గ్రామ స్వరాజ్య స్ఫూర్తిని బలోపేతం చేయడానికి తాము పూర్తిగా కట్టుబడి ఉన్నామని కాంగ్రెస్ తెలిపింది. అలాగే దేశవ్యాప్తంగా ఉన్న గ్రామ పెద్దలకు, పంచాయతీలు, స్థానిక సంస్థల సభ్యులకు అభినందనలు తెలిపింది. పంచాయతీ రాజ్ సంస్థలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను అమలు చేసిన ఘనత తమ పార్టీకే దక్కుతుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. పంచాయతీ రాజ్‌కు సంస్థాగత బలాన్ని చేకూర్చి, ప్రజాస్వామ్యాన్ని క్షేత్రస్థాయికి తీసుకువచ్చిన 73వ రాజ్యాంగ సవరణను రాజీవ్ గాంధీనే అమలు చేశారని ఆయన అన్నారు. పంచాయతీ రాజ్ సంస్థలు మన ప్రజాస్వామ్యానికి బలమైన పునాది అని ఆయన అన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థ దేశంలోని మహిళలకు నాయకత్వం వహించడానికి, రాజకీయాల్లో వారి భాగస్వామ్యాన్ని నిర్ధారించుకోవడానికి ఒక సువర్ణావకాశాన్ని ఇచ్చిందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. మహిళా సాధికారతకు పంచాయతీ రాజ్ ఒక ముఖ్యమైన మాధ్యమంగా కూడా ఉంది, అని రాహుల్ గాంధీ పదవ తేదీన హిందీలో పెట్టిన ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. 1993 నుండి 73వ రాజ్యాంగ సవరణ ద్వారా, పంచాయతీ రాజ్ సంస్థలలో మహిళలకు కనీసం 33 శాతం రిజర్వేషన్ కల్పించబడిందని ఆయన అన్నారు. 'నేడు, అనేక రాష్ట్రాల్లో దీనిని 50 శాతానికి పెంచారు' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. కాంగ్రెస్ చేపట్టిన ఈ చారిత్రాత్మక చొరవ ఫలితంగా, నేడు దేశవ్యాప్తంగా పంచాయతీ రాజ్ సంస్థలలో దాదాపు 14 నుండి 15 లక్షల మంది ఎన్నికైన మహిళా ప్రతినిధులు చురుకైన పాత్ర పోషిస్తున్నారని, ఇది ప్రపంచంలోనే మహిళల అతిపెద్ద ప్రజాస్వామ్య భాగస్వామ్యాలలో ఒకటి అని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. ఏప్రిల్ 24వ తేదీని జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవంగా జరుపుకుంటారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ తెలిపారు. 1993లో ఇదే రోజున, రాజ్యాంగ 73వ సవరణ చట్టం అమల్లోకి వచ్చింది. ఈ సవరణ ద్వారా రాజ్యాంగంలో 243 'ఎ' నుండి 243 'ఒ' వరకు అత్యంత విస్తృతమైన అధికరణలు చేర్చబడ్డాయి; ఇవి పంచాయతీలకు అపారమైన అధికారాలను కల్పించి, వాటిని మన రాజకీయ వ్యవస్థకు పునాదులుగా తీర్చిదిద్దాయి. ప్రస్తుతం దేశంలో సుమారు 2.6 లక్షల గ్రామ పంచాయతీలు, 6,700కు పైగా మధ్యంతర పంచాయతీలు, 673 జిల్లా పరిషత్తులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. నిజంగానే పరివర్తనాత్మకమైన ఈ చొరవ, రాజీవ్ గాంధీ పట్టుదల, నిరంతర కృషి ఫలితమేనని ఆయన అభిప్రాయపడ్డారు. 'పంచాయతీ రాజ్ సంస్థలలో ఎన్నికయ్యే స్థానాల్లో మూడింట ఒక వంతు స్థానాలను మహిళలకు— అందులోనూ షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన మహిళలకు సైతం— కేటాయించేలా చూసింది ఆయనే. నేడు పంచాయతీ రాజ్ సంస్థలలో సుమారు 32 లక్షల మంది ఎన్నికైన ప్రతినిధులు ఉండగా, వారిలో దాదాపు 15 లక్షల మంది మహిళలు ఉన్నారు; ఇది పూర్తిగా ఆయన చేసిన కృషి ఫలితమే' అని రమేష్ అన్నారు. వాస్తవానికి ఈ సవరణ (64వ సవరణ) 1989 మధ్యలో ప్రవేశపెట్టబడిందని, అయితే లోక్‌సభలో ఆమోదం పొందినప్పటికీ, బిజెపి నుండి వచ్చిన వ్యతిరేకత కారణంగా రాజ్యసభలో ఆమోదం పొందలేకపోయిందని ఆయన తెలిపారు. 'మే 2004లో పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసినదీ, ఫిబ్రవరి 2006లో చారిత్రాత్మకమైన ఎంజి నరేగా పథకాన్ని ప్రారంభించినదీ డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రభుత్వమే. ఈ పథకం గ్రామ పంచాయతీలకు ప్రణాళిక, అమలులో కీలక పాత్రను కల్పించింది. అయితే, డిసెంబర్ 2025లో మోదీ ప్రభుత్వం ఎంజి నరేగాను రద్దు చేసింది. కేవలం తమ వ్యక్తిగత రాజకీయ మనుగడను కాపాడుకోవడం కోసం లోక్‌సభ సభ్యుల సంఖ్యను పెంచడం కంటే, పంచాయతీలను ( రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 243పి నుండి 243జెడ్‌జి పరిధిలోకి వచ్చే నగరపాలికలను) మరింతగా పునరుద్ధరించడం అత్యంత ఆవశ్యకం' అని రమేష్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

## ఎస్‌పి ఎదుట లొంగిపోయిన మావోయిస్టు సభ్యురాలు



**ప్రజాపక్షం/ములుగు:**మహిళ మావోయిస్టు, సౌత్ బస్తర్ డివిజనల్ కమిటీ ఇన్‌చార్జి 9వ ప్లాటూన్ కమాండర్ అయిన విజ్జాలు(ఐతు) సమక్షంలో ప్లాటూన్ సభ్యురాలు హోదాలో పనిచేసిన ముడియం రామే(18) ములుగు జిల్లా ఎస్‌పి సుధీర్ రామ్‌నాథ్ కేకాన్, ఐపిఎస్ సమక్షంలో శుక్రవారం జన జీవన స్రవంతిలో కలిసింది. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ములుగు జిల్లా పోలీసు అధికారులు ఆదివాసీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం చేపట్టిన పోరు కన్నా ఊరు మిన్న..మన ఊరికి తిరిగి రండి అనే అవగాహన కార్యక్రమం ఫలితంగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్‌శాఖ కల్పిస్తున్న పునరావాస సదుపాయాల గురించి తెలుసుకొని, మావోయిజాన్ని విడిచిపెట్టి ప్రశాంతమైన జీవితం గడపాలనే ఉద్దేశ్యంతో నిషేధిత సిపిఐ(మావోయిస్టు) పార్టీకి చెందిన పార్టీ సభ్యురాలు లొంగిపోయిందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం దేశంలో అత్యుత్తమ సరెండర్ పాలసీని అమలు చేస్తూ, జన జీవన స్రవంతిలో కలిసిన వారికి నగదు రివార్డు, వైద్య సేవలు, పునరావాస సహాయం, సమాజంలో తిరిగి స్థిరపడడానికి పూర్తి మద్దతు అందించడం జరుగుతుందని అన్నారు. ఇంకా మిగిలి ఉన్న కొంత మంది మావోయిస్టు సభ్యులను జనజీవన స్రవంతిలో కలవమంటూ వారి కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్, వివిధ మాధ్యమాల ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈమెకు తెలంగాణ ప్రభుత్వం సరెండర్ పాలసీలో భాగంగా రూ.25వేల తక్షణ పునరావాస ఆర్థిక సహాయం ఎస్‌పి చేతుల మీదుగా అందజేశారు.

# మణిపూర్ ఉఖ్రుల్ జిల్లాలో కాల్పులు

ముగ్గురు మృతి



**ఇంఫాల్ :** మణిపూర్‌లో కల్లోలం కొనసాగుతూనే ఉంది. నిత్యం ఏదో ఒక చోట ఘర్షణలు, ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా ఉఖ్రుల్ జిల్లాలో శుక్రవారం ఉదయం ప్రత్యర్థి గిరిజన వర్గాలకు చెందిన సాయుధ బృందాల మధ్య జరిగిన రెండు వేర్వేరు కాల్పుల ఘటనల్లో ముగ్గురు మరణించారని అధికారులు తెలిపారు. ముల్లం గ్రామ సమీపంలో జరిగిన ఒక ఘటనలో, ఉదయం 11.25 గంటల ప్రాంతంలో భద్రతా దళాలు రెండు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నాయని వారు చెప్పారు. మృతులను ఎల్. సిత్లో, పి. హావోలాయ్‌గా గుర్తించామని, వారు బుల్లెట్ గాయాలతో సైనిక దుస్తులలో కనిపించారని అధికారులు తెలిపారు. అంతకుముందు, టాంగ్‌ఖుల్ నాగాలు అధికంగా ఉన్న ఈ జిల్లాలోని ముల్లం గ్రామంలో ఉదయం 5.30 గంటల ప్రాంతంలో సాయుధ మిలిటెంట్ల మధ్య భారీ కాల్పులు జరిగాయి. గ్రామంలోని కొన్ని శివారు ఇళ్లకు కూడా మిలిటెంట్లు నిప్పు పెట్టారు. ఇదిలా ఉండగా, ముల్లం, సాంగ్‌ఫాల్ గ్రామాలలో ఇద్దరు గ్రామ వలంటీర్ల హత్యను, ఇళ్ల దహనాన్ని కుకీ ఆర్గనైజేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ ఖండించింది. ఈ ఘటనపై తక్షణమే ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి, కాల పరిమితిలోగా దర్యాప్తు జరపాలని ఆ సంస్థ డిమాండ్ చేసింది. మరో ఘటనలో, కామ్‌జోంగ్ జిల్లాలోని చాట్రిక్ ఖుల్లెన్‌కు చెందిన హెచ్. జమాంగ్ అనే 29 ఏళ్ల వ్యక్తి, శుక్రవారం తెల్లవారుజామున ఉఖ్రుల్ జిల్లాలోని సినాకైతేయ్ గ్రామం సమీపంలో సాయుధ మిలిటెంట్ల మెరుపుదాడిలో అక్కడికక్కడే మరణించాడని అధికారులు తెలిపారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు. తాంగ్‌ఖుల్ నాగా సమాజానికి చెందిన అత్యున్నత సంస్థ అయిన 'తాంగ్‌ఖుల్ నాగా లాంగ్', జమాంగ్ హత్య పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసింది.'ఉఖ్రుల్ జిల్లాలోని సిరారాఖోంగ్, సినాకైతేయ్ మార్గాలలో సాయుధ కుకీ కేడర్లు నిరంతరం సంచరిస్తూ, అంతరాయం కలిగిస్తుండటంతో, సిరారాఖోంగ్ సమీపంలో మోహరించిన నాగా గ్రామ రక్షక దళాలు గస్తీకి వెళ్లగా, వారిపై కుకీలు మెరుపుదాడి చేశాయి' అని ఆ సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. 18న ఉఖ్రుల్ జిల్లాలోని టిఎం కాసోమ్ వద్ద పౌరుల కాన్వాయ్‌పై అనుమానిత మిలిటెంట్లు జరిపిన దాడిలో, విశ్రాంత సైనికాధికారితో సహా ఇద్దరు తంగ్‌ఖుల్ నాగా పౌరులు మరణించిన తర్వాత, ఆ జిల్లాలో, పొరుగున ఉన్న కామ్‌జాంగ్ జిల్లాలో ఉద్రిక్తత నెలకొంది. ఈ హత్యల వెనుక కుకీ మిలిటెంట్లు ఉన్నారని తంగ్‌ఖుల్ నాగా సంస్థలు ఆరోపించగా, ఈ దాడిలో తమ ప్రమేయం ఏమీ లేదని కుకీ సంస్థలు ఖండించాయి.

## విశ్వాస పరీక్ష నెగ్గిన సామ్రాట్ చౌదరి



**పాట్నా :** బిహార్‌లో బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం శుక్రవారం రాష్ట్ర శాసనసభలో విశ్వాస పరీక్ష నెగ్గింది. ఏడాదిలో రూ. 5 లక్షల కోట్ల పెట్టుబడులతో వేగవంతమైన ఆర్థిక అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని నడిపిన తొలి బిజెపి నాయకుడిగా నిలిచిన చౌదరి ప్రవేశపెట్టిన విశ్వాస తీర్మానం, 202 సీట్లతో అధికార ఎన్‌డిఎకు తిరుగులేని మెజారిటీ ఉన్న 243 మంది సభ్యుల సభలో మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. మహిళా రిజర్వేషన్ల బిల్లుపై ప్రతిపక్షాల వైఖరిని ఖండిస్తూ సభ మరో తీర్మానాన్ని కూడా ఆమోదించింది. విశ్వాస తీర్మానంపై జరిగిన చర్చలో అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. గత నవంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయాన్ని అధిగమించి, తమ గళాన్ని వినిపించాలని ప్రతిపక్షాలు దృఢ నిశ్చయంతో ఉన్నట్లు కనిపించాయి. ప్రతిపక్ష నాయకుడు తేజస్వి యాదవ్ తీవ్రమైన ప్రసంగం చేశారు. శాసనసభలలో మహిళలకు రిజర్వేషన్ల విషయంలో జరుగుతున్న తీవ్ర చర్చతో సహా పలు అంశాలను ఆయన తన ప్రసంగంలో ప్రస్తావించారు. నియోజకవర్గాల పునర్విభజనతో కోటాలను అనుసంధానించే బిల్లుకు మూడింట రెండు వంతుల మెజారిటీ రాకపోవడంతో పార్లమెంటులో ఈ చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. మహిళలకు రిజర్వేషన్ల వల్ల దళితులు, ఒబిసిలు, అత్యంత వెనుకబడిన తరగతుల ప్రాతినిధ్యం తగ్గకూడదనే ప్రాతిపదికన, యాదవ్ తన ఆర్‌జెడి, ఇతర ఇండియా బ్లాక్ పార్టీలు అనుసరిస్తున్న 'కోటాలో కోటా' అనే వాదనను లేవనెత్తారు.

## బెంగాల్‌లో మమత, తమిళనాడులో డిఎంకెదే విజయం: ఫరూక్ అబ్దుల్లా



**శ్రీనగర్ :** పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ అనే మూడు కీలక రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీలు అసెంబ్లీ ఎన్నికల్లో గెలుస్తున్నాయని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్ సి) అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా పేర్కొన్నారు. హజ్రత్‌బాల్‌లో అబ్దుల్లా విలేకరులతో మాట్లాడారు. బెంగాల్‌లో మమతా బెనర్జీ, కేరళలో కాంగ్రెస్, తమిళనాడు లో ఎంకె స్టాలిన్ పార్టీ (డిఎంకె) గెలుస్తోందన్నారు. మధ్యప్రాచ్యంలోని సంఘర్షణపై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, శాంతి చాలా అవసరమని, ఆ యుద్ధం వీలైనంత త్వరగా ముగుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మధ్యప్రాచ్యంలో శాంతి తిరిగి రాకపోతే, ఈ ప్రపంచానికి తీవ్ర విషాదాలు ఎదురవుతాయని, ప్రతి ఒక్కరూ ప్రతి దేశం, ప్రతి నాయకుడు ఈ యుద్ధం తక్షణమే ముగిసేలా చూడటానికి ప్రయత్నించాలని చెప్పారు. యుద్ధం వైపు తనను పురికొల్పడంలో ఇజ్రాయెల్ తప్పు చేసిందని అమెరికా అధ్యక్షుడు గ్రహించారని ఆశిస్తున్నానన్నారు. ఆయన త్వరగా చర్యలు తీసుకుంటారని, అలాగే చైనా, రష్యాలు కూడా ఈ యుద్ధం వీలైనంత త్వరగా ముగిసేలా చూస్తాయని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. కేంద్రం చేపట్టిన 'నషా ముక్త్ భారత్ అభియాన్'పై జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మాట్లాడుతూ మాదకద్రవ్యాలపై యుద్ధంలో గెలవడానికి ప్రజల మద్దతు అత్యవసరం అని అన్నారు. తల్లిదండ్రులు, ప్రజలు ఈ పోరాటానికి మద్దతు ఇవ్వనంత వరకు, ప్రభుత్వం మాదకద్రవ్యాల ముప్పును అంతం చేయలేదని, ప్రజల మద్దతే ముఖ్యమన్నారు. వారు మద్దతు ఇస్తే, దైవ సంకల్పంతో ఈ ముప్పు అంతమవుతుందని అబ్దుల్లా పేర్కొన్నారు.

ఓటర్ల లిస్ట్ నుంచి పేర్లను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ ...

## దాఖలైన పిటిషన్ల విచారణకు 'సుప్రీం' నిరాకరణ

అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు వెళ్లాలని సూచన




**న్యూఢిల్లీ :** ఎన్నికల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్‌ఐఆర్) అనంతరం ఓటర్ల జాబితా నుంచి తమ పేర్లను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ, ఎన్నికల విధుల్లో ఉన్న 65మంది సహా పశ్చిమ బెంగాల్‌కు చెందిన పలువురు వ్యక్తులు దాఖలు చేసిన కొన్ని పిటిషన్ల విచారణను సుప్రీంకోర్టు శుక్రవారం తిరస్కరించింది. ఓటర్ల జాబితానుంచి పేర్లను తొలగించడం లేదా మినహాయించడంపై దాఖలైన అప్పీళ్లను నిర్ణయించడానికి ఏర్పాటు చేసిన అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలని వారికి అత్యున్నత న్యాయస్థానం సూచించింది. 'మీరు ఈ వాదనలను (అప్పిలేట్) ట్రిబ్యునల్ ముందు లేవనెత్తాలి' అని రెండు వేర్వేరు పిటిషన్లలో పిటిషనర్ల తరపున హాజరైన న్యాయవాదికి ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి, విపుల్ ఎం పంచోలితో కూడిన త్రిసభ్య ధర్మాసనం తెలిపింది. ఈ పిటిషన్లలోని తేడా ఏమిటంటే, 65మంది పిటిషనర్లు రాష్ట్రంలో ఎన్నికల విధుల్లో ఉన్నారని పిటిషనర్ల తరపు న్యాయవాది వాదించారు. 'ఎన్నికల విధి కోసం జారీ చేసిన ఉత్తర్వులో ఇపిఐసి (ఫోటో గుర్తింపు కార్డు) నంబర్‌ను పేర్కొన్నారు. దానిని తదనంతరం తొలగించారు. ఇప్పుడు ఎన్నికల విధి నిర్వహణలో ఉన్నవారు ఓటు వేయలేరు. ఇది స్పష్టంగా ఏకపక్షమైనది' అని న్యాయవాది వాదించారు. పిటిషనర్లకు ఎటువంటి షోకాజ్ నోటీస్ జారీచేయని కారణంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ తర్వాత ఓటర్ల జాబితా నుంచి వారి పేర్లను తొలగించడం ఏకపక్షమేనని ఆయన బెంచ్‌కు విన్నవించారు. పిటిషనర్లు ఇప్పటికే అప్పిలేట్ ట్రిబ్యునల్ ముందు అప్పీళ్లు దాఖలు చేశారని న్యాయవాది తెలియజేశారు. 'అప్పిలేట్ ట్రిబ్యునల్ బెంచ్‌కు తగిన ఉత్తర్వులు జారీ చేస్తుంది' అని ధర్మాసనం ఆయనకు వివరించింది. జాబితాలో కొనసాగే మరింత విలువైన హక్కును మేం తప్పక పరిశీలిస్తామని బెంచ్ చెప్పింది. సుప్రీంకోర్టు 71మంది, ఆరుగురు వ్యక్తులు దాఖలు చేసిన రెండు వేర్వేరు పిటిషన్లను విచారించింది. అప్పీళ్లు ఇంకా పెండింగ్‌లో ఉన్న పిటిషనర్లు తమ హక్కును వినియోగించుకోవడానికి అనుమతించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని ఆ పిటిషన్లలో కోరారు.

వాషింగ్టన్‌లో జరిగిన వాణిజ్య చర్చల్లో...

# భారత్— అమెరికా సానుకూల పురోగతి

వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడి



**న్యూఢిల్లీ :** వాషింగ్టన్‌లో ఇటీవల మూడు రోజులపాటు జరిగిన వాణిజ్య చర్చల్లో భారత్–అమెరికా సానుకూల పురోగతి సాధించాయని, ఈ ఊపును భవిష్యత్తులోనూ కొనసాగించేందుకు ఇరుపక్షాలు అంగీకరించాయని శుక్రవారం ప్రభుత్వం తెలిపింది. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఏ) మొదటి దశ వివరాలను ఖరారు చేయడానికి అమెరికా అధికారులతో చర్చలు జరిపేందుకు భారతదేశానికి చెందిన దాదాపు 12మంది అధికారులు ఏప్రిల్ 20–22 తేదీలలో వాషింగ్టన్‌లో పర్యటించారు. మార్కెట్ ప్రవేశం, సుంకాలేతర చర్యలు, వాణిజ్యానికి సాంకేతిక అడ్డంకులు, కస్టమ్స్, వాణిజ్య సౌలభ్యం, పెట్టుబడుల ప్రోత్సాహం, ఆర్థిక భద్రతా సమన్వయం, లోతైన వాణిజ్యం వంటి అంశాలపై చర్చలు జరిగాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సమావేశాలు నిర్మాణాత్మక, సానుకూల స్ఫూర్తితో జరిగాయని, అర్థవంతమైన భవిష్యత్ దృష్టితో కూడిన చర్చల ద్వారా కీలకమైన అంశాలపై పురోగతి సాధించడం సాధ్యమైందని, ముందుకు సాగుతున్న క్రమంలో ఈ ఊపును మరింత కొనసాగించేందుకు ఇరుపక్షాలు సంప్రదింపులు కొనసాగించాలని అంగీకరించాయని వెల్లడించింది. అమెరికాలో సుంకాల పరిస్థితి మారిన నేపథ్యంలో ఫిబ్రవరి 7న విడుదలైన ఒప్పంద ముసాయిదాను ఇరుపక్షాలు పున: సమీక్షిస్తున్నాయి. భారతదేశానిది ఒక కఠినమైన సమస్య అని యుఎస్ వాణిజ్య ప్రతినిధి జామీసన్ గ్రీర్ అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలు దేశాలపై విధించిన భారీ సుంకాలకు వ్యతిరేకంగా అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో, ట్రంప్ ప్రభుత్వం ఫిబ్రవరి 24నుంచి 150 రోజులపాటు అన్ని దేశాలపై 10శాతం సుంకాన్ని విధించింది. ఆ ఒప్పందం ప్రకారం భారతదేశంపై సుంకాలను 50శాతం నుండి 18శాతానికి తగ్గించడానికి అమెరికా అంగీకరించింది. రష్యా చమురు కొనుగోలుపై భారతీయ వస్తువులపై ఉన్న 25శాతం సుంకాలను తొలగించి, మిగిలిన 25శాతాన్ని కూడా ఆ ఒప్పందం కింద 18శాతానికి తగ్గించాల్సి ఉంది. కానీ ఫిబ్రవరి 20న అమెరికా 1977 అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం (ఐఇఇపిఏ) కింద విధించిన ట్రంప్ పరస్పర సుంకాలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ తర్వాత ఫిబ్రవరి 24 నుంచి ప్రారంభమయ్యే 150 రోజులపాటు అన్ని దేశాలపై 10శాతం సుంకాలను విధిస్తున్నట్లు అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అంగీకరించిన చట్టం ప్రకారం అన్ని అమెరికా పారిశ్రామిక వస్తువులు, ఎండిన డిస్టిలర్ గ్రెయిన్స్ (డిడిజిలు), పశువుల మేతకు ఉపయోగించే ఎర్ర జొన్నలు, చెట్ల గింజలు, తాజా, ప్రాసెస్ చేసిన పండ్లు, సోయాబీన్ నూనె, వైన్, స్పిరిట్స్ ఇంకా ఇతర ఉత్పత్తులతో సహా విస్తృత శ్రేణి అమెరికా ఆహార, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలను తొలగించడానికి లేదా తగ్గించడానికి భారతదేశం ప్రతిపాదించింది.రాబోయే 5ఏళ్లలో500 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా ఇంధన ఉత్పత్తులు, విమానాలు, విమాన విడిభాగాలు, విలువైన లోహాలు, సాంకేతిక ఉత్పత్తులు, కోకింగ్ బొగ్గును కొనుగోలు చేయాలనే తన ఉద్దేశాలను భారత్ కూడా వ్యక్తం చేసింది. ఈ ఒప్పందాన్ని భారతదేశం ఖరారు చేసిన నేపథ్యంలో, అది తన పోటీ దేశాల కంటే సాపేక్ష ప్రయోజనాన్ని పొందింది కాబట్టి ఈ సమావేశం కూడా ముఖ్యమైనది. ఇప్పుడు అమెరికా వాణిజ్య భాగస్వాములందరూ ఏకరీతిగా 10శాతం సుంకాలను ఎదుర్కొంటున్నందున ఈ ఒప్పందాన్ని పున: సమీక్షించాల్సి ఉంది. అందువల్ల ఈ ఒప్పందాన్ని పున: సమీక్షించి, తిరిగి రూపొందించాల్సి ఉంటుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పరిస్థితులు మారినందున అమెరికాతో తమ వాణిజ్య ఒప్పందాల స్వరూపం ఎలా ఉండబోతుందనేది తెలుసుకోవడానికి ప్రతీ దేశం కూడా అమెరికాతో సంప్రదింపులు జరుపుతోంది. అంతేకాకుండా, అమెరికా వాణిజ్య ప్రతినిధి (యుఎస్‌టిఆర్) మార్చిలో భారతదేశం సహా పలుదేశాలపై రెండు ఏకపక్ష విచారణలను ప్రారంభించింది. వాణిజ్య చట్టంలోని సెక్షన్ 301 కింద ఆ రెండు విచారణలలో యుఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ చేసిన ఆరోపణలను భారతదేశం తీవ్రంగా ఖండించింది. ఆరోపణలను నిరూపించడానికి విచారణ ప్రారంభ నోటీస్‌లో బలమైన హేతుబద్ధతను అందించని కారణంగా ఆ విచారణలను నిలిపివేయాలని భారత్ కోరింది.

# స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద రాజకీయ పార్టీలు నిఘా



**చెన్నై :** తమిళనాడులో 234 అసెంబ్లీ స్థానాల్లో గురువారం పోలింగ్ జరిగింది. అనంతరం ఇవిఎంలను ఎన్నికల సంఘం స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించింది. అయితే అధికార డిఎంకె, ఎఐఎడిఎంకె సహా వివిధ రాజకీయ పార్టీలు నిర్దేశిత కేంద్రాల వద్ద 24 గంటలూ షిఫ్టుల పద్ధతిలో నిఘా ఉంచాలని నిర్ణయించాయి. మే 4న జరగనున్న ఓట్ల లెక్కింపునకు ముందుగానే, ఎన్నికల సంఘం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (ఇవిఎంలు), ఓటర్ వెరిఫైయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వివిప్యాట్) యంత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించింది. కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, తమిళనాడు ప్రత్యేక పోలీసు బృందాలతో సహా అనేక భద్రతా వ్యవస్థలు ఇప్పటికే అక్కడ ఉన్నప్పటికీ, ఇవిఎల భద్రతను మరింత పటిష్టం చేసేందుకు రాజకీయ పార్టీలు తమ కార్యకర్తలను మోహరించాయి. ఇవిఎంలు, వివిప్యాట్‌లు భద్రపరిచిన ప్రాంగణంలో తమ కార్యకర్తలు షిఫ్టుల పద్ధతిలో రాత్రింబవళ్లు నిఘా ఉంచుతారని ఎఐఎడిఎంకె న్యాయ విభాగం సంయుక్త కార్యదర్శి ఆర్‌ఎం బాబు మురుగవేల్ పిటిఐతో తెలిపారు. ప్రవేశ, నిష్క్రమణ మార్గాలన్నింటినీ క్షుణ్ణంగా పర్యవేక్షిస్తామని పేర్కొంటూ, మే 4న ఓట్ల లెక్కింపు ప్రారంభమయ్యే వరకు స్ట్రాంగ్ రూమ్‌లకు భద్రత కల్పిస్తామని ఆయన చెప్పారు.స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద విధుల్లో ఉండే పార్టీ కార్యకర్తలకు గుర్తింపు కార్డులు జారీ చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల పరిశీలకుల సమక్షంలో, అవసరమైన పత్రాలపై సంతకాలు చేసి, వీడియో రికార్డింగ్ చేస్తూ స్ట్రాంగ్ రూమ్‌లను సీల్ చేసినట్లు ఎన్నికల సంఘం (ఇసి) వర్గాలు ఇక్కడ తెలిపాయి. సాయుధ బలగాలను మోహరించడంతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని స్ట్రాంగ్ రూమ్‌లలో సిసిటివి కెమెరాలను అమర్చారు. వీటి ద్వారా రాత్రింబవళ్లు నిఘా ఉంచుతారు. ఇవిఎం లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద రాజకీయ పార్టీల ప్రతినిధులు నిఘా ఉంచేందుకు, కొన్ని నిబంధనలు, షరతులకు లోబడి రాష్ట్ర ఎన్నికల అధికారులు అనుమతి మంజూరు చేశారని ఒక సీనియర్ అధికారి తెలిపారు.

# ముజ్తబా ఖమేనీ ముఖానికి ప్లాస్టిక్ సర్జరీ?

సైనిక జనరల్స్ చేతుల్లోకి అధికారం

కీలక నిర్ణయాలన్నీ వారివే

'ది న్యూయార్క్ టైమ్స్' కథనం



**న్యూయార్క్:** అమెరికా ఇజ్రాయిల్ దాడిలో తీవ్రంగా గాయపడిన ఇరాన్ సుప్రీం లీడర్ ముజ్తబా ఖమేనీ జీవించి ఉన్నప్పటికీ మాట్లాడే పరిస్థితిలో లేరని 'ది న్యూయార్క్ టైమ్స్' కథనం వెల్లడించింది. బయటి ప్రపంచానికి కనిపించకుండా, వినిపించకుండా పాలనలో చురుగ్గా ఉన్నప్పటికీ, దేశంలో అధికారం ఆయన చేతుల్లో నుంచి సైనిక జనరల్స్ వైపు మళ్లిందని ఆ కథనం పేర్కొంది. ముజ్తబా ఖమేనీ కాలికి మూడుసార్లు ఆపరేషన్ జరిగిందని, ప్రస్తుతం కత్రిమ కాలు కోసం ఎదురు చూస్తున్నారని ఆ కథనం వెల్లడించింది. ఒక చేతికి కూడా శచికిత్స జరగ్గా... అది నెమ్మదిగా కోలుకుంటోంది. అన్నింటికంటే ముఖ్యంగా ముఖం, పెదవులు తీవ్రంగా కాలిపోవడంతో మాట్లాడటం కష్టంగా మారిందని, భవిష్యత్తులో ప్లాస్టిక్ సర్జరీ అవసరమని కథనం వివరించింది. ఈ గాయాల వల్లే ఆయన ప్రజా జీవితానికి దూరంగా ఉంటున్నారు. బలహీనంగా కనిపించడం ఇష్టం లేకే ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. ఆయనకు సందేశాలు చేరవేయడానికి, ఆయన నుంచి ఆదేశాలు స్వీకరించడానికి ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. చేతితో రాసిన లేఖలను సీల్డ్ కవర్లలో ఉంచి, కార్లు, మోటార్ సైకిళ్లపై మానవహారంలా ఒకరి నుంచి ఒకరికి అందిస్తూ ఆయన రహస్య స్థావరానికి చేరవేస్తున్నారు. ఇజ్రాయిల్ తమను గుర్తించి దాడి చేయొచ్చనే భయంతో సీనియర్ అధికారులు కూడా ఆయన్ను కలవడం లేదని కథనం వెల్లడించింది.

**అధికారం జనరల్స్ చేతిలోకి ...**

ఖమేనీకి కమ్యూనికేషన్ పరిమితం కావడంతో, దేశంలో అధికారం సైనిక జనరల్స్ చేతుల్లోకి వెళ్లింది. ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) కమాండర్లు ఇప్పుడు యుద్ధం, దౌత్యం, జాతీయ భద్రత వంటి కీలక అంశాలపై పూర్తి పట్టు సాధించారు. ''ముజ్తబా ఒక బోర్డు డైరెక్టర్‌లా వ్యవహరిస్తుంటే, జనరల్స్ బోర్డు సభ్యులుగా మారి అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారు'' అని మాజీ అధ్యక్షుడు మహమూద్ అహ్మదీనెజాద్ సలహాదారు ఒకరు వ్యాఖ్యానించారు. ఈ మార్పు తో దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వంటి పౌర నాయకులు కీలక నిర్ణయాల్లో నామమాత్రంగా మారా రు. వారు కేవలం దేశీయ వ్యవహారాలకే పరిమితమయ్యారు. అమెరికా నావికా దిగ్బంధనం కొనసాగుతున్నప్పుడు చర్చలు వద్దని సైనిక కమాండర్లు వ్యతిరేకించడంతో, అమెరికాతో జరగాల్సిన చర్చలు కూడా విఫలమయ్యాయి. మొత్తంగా ఇరాన్‌లో పాలన మారనప్పటికీ, అధికారం ఒక వ్యక్తి చేతి నుంచి సైనిక కూటమి చేతికి బదిలీ అయిందని, వ్యవస్థలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయని న్యూయార్క్ టైమ్స్ కథనం తెలిపింది.

# ఆర్టీసీ కార్మికుల మౌన ప్రదర్శన



రోడ్లపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఆర్‌టిసిలో మూడవ రోజు శుక్రవారం కార్మికుల సమ్మె ఉద్వేగభరితంగా కొనసాగింది. ఒక వైపు ఉద్రిక్తతత, మరోవైపు సహచర కార్మికుడిని కొల్పోయామనే ఉద్వేగంతోనే కార్మికులు సమ్మెను కొనసాగించారు. జెఎసి పిలుపు మేరకు అన్ని డిపోల ముందు ఆర్‌టిసి కార్మికులు మౌన ప్రదర్శనలు నిర్వహించారు.

సమ్మె పట్ల ప్రభుత్వం అనురిస్తున్న వైఖరికి మనస్థాపం చెందిన డ్రైవర్ ఆత్మహత్య పాల్పడి మరణించడంతో ఆర్‌టిసిలో విషాదచ్ఛాయలు నెలకొన్నాయి. బస్ డిపోలు, యూనిట్ల వద్ద మరణించిన శంకర్ గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వసి నిశాళులు అర్పిస్తూనే ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కార్మికులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. పలు చోట్ల కార్మికులు రోడ్లపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొన్ని చోట్ల ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం చేశారు. డ్రైవర్ శంకర్‌గౌడ్ ఆత్మహత్య చేసుకున్న నర్సంపేటలోని డిపోలు, బస్టాండ్ల వద్ద ఉద్రిక్త పరిస్థితి కనిపించింది. ఇదిలా ఉండగా ఆర్‌టిసి హైర్ బస్సులను, కొన్ని ఎలక్ట్రిక్ బస్సులను ప్రైవేటు డ్రైవర్లతో యాజమాన్యం నడిపించింది. వాహనాలు మినహా, మిగతా బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. రోడ్లపై నడుస్తున్న ఒకటి రెండు బస్సులను కార్మికులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు నిలువరించారు. శంకర్ గౌడ్ అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వెళ్ళిన ఆర్‌టిసి యూనియన్ నాయకులను, బిఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ఎక్కడికక్కడే అరెస్ట్ చేశారు.

# ప్రజల ఐక్యతే శత్రువులను దెబ్బ కొట్టింది

ముజ్తాబా ఖమేనీ

**తెహ్రాన్:** ఇరాన్ ప్రజల బలమైన ఐక్యత దేశానికి బలంగా మారిందని, అదే శత్రువులకు గట్టి దెబ్బ కొట్టిందని ఇరాన్ సుప్రీం లీడర్ ముజ్తాబా ఖమేనీ పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఓ పోస్టు చేశారు. దేశ ప్రజల్లో ఏర్పడిన ఐక్యత శత్రువుల యత్నాలను భంగం చేసిందని ఆయన తెలిపారు. ఈ ఐక్యతను మరింత బలోపేతం చేయాలంటే కేవలం మాటలు కాదు, కార్యాచరణ అవసరమని సూచించారు. ప్రజలు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించడం ద్వారా దేశ ఐక్యత మరింత దఢంగా మారుతుందని తెలిపారు. అదే సమయంలో శత్రు దేశాలు మీడియా ద్వారా ప్రజల మనసులను ప్రభావితం చేయాలని ప్రయత్నిస్తున్నాయని ముజ్తాబా హెచ్చరించారు. ఇలాంటి ప్రచారాలకు లోనవకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. దేశ భద్రతను దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ విధమైన ప్రచారాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్, పాశ్చాత్య దేశాలు ఒత్తిళ్లు, ఆంక్షలు, ప్రచార యుద్ధాలు కొనసాగిస్తున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**రాజకీయ విభేదాల్లేవు: పెజెష్కియాన్**

ఇరాన్‌లో రాజకీయంగా ఎటువంటి విభేదాల్లేవని అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ పేర్కొన్నారు. దేశంలో హార్డ్‌లైనర్లు, మోడరేట్లు అనే విభజనలు లేవని స్పష్టం చేశారు. అందరూ ఇరానియన్లుగా, విప్లవ భావజాలంతో ఒకటిగా ఉన్నారని స్పష్టంచేశారు. సుప్రీం లీడర్‌కు పూర్తిగా విధేయతతో దేశ ప్రజలు, ప్రభుత్వం కలిసి పనిచేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దేశంపై ఎవరైనా దాడి చేయాలనుకుంటే, ఐక్యంగా ఎదుర్కొంటామని హెచ్చరించారు. మరోవైపు ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాగేర్ ఘాలిబఫ్ కూడా దేశంలో ఎలాంటి విభేదాలు లేవని, అందరూ ఒకే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని స్పష్టం చేశారు. ఇరాన్ ప్రజలు, ప్రభుత్వం మధ్య బలమైన ఐక్యత ఉందన్నారు. సుప్రీం లీడర్ నాయకత్వంలో దేశం బలంగా ఉందని పేర్కొన్నారు. అదేసమయంలో దేశంపై దాడి చేసే వారెవరైనా తమ చర్యలకు పశ్చాత్తాపపడాల్సి వస్తుందని హెచ్చరించారు.

## టెహ్రాన్‌లో మళ్లీ పేలుళ్లు?



**తెహ్రాన్:** రెండు వారాల క్రితం అమల్లోకి వచ్చిన అమెరికా ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందం క్రమంగా బలహీనపడుతున్న తరుణంలో టెహ్రాన్‌లో మళ్లీ తొలిసారిగా పేలుళ్లు జరిగాయంటూ ఇరాన్ మీడియాలో కథనాలు వచ్చాయి. అయితే ఈ దాడుల్లో తమ ప్రమేయం లేదని ఓ అంతర్జాతీయ వార్తా సంస్థకు ఇజ్రాయిల్ అధికార వర్గాలు తెలిపాయి. అంతకుముందు గురువారం ట్రంప్ జారీ చేసిన మరో హెచ్చరిక కూడా గల్ఫ్ సముద్ర జలాల్లో ఉద్రిక్తతలను పెంచింది. హర్మూజ్ జలసంధి మార్గంలో మైన్లను పెడుతున్న ఇరాన్ చిన్నబోట్లను పేల్చేయాలని అమెరికా నౌకాదళాన్ని ఆయన ఆదేశించారు.

అదే జరిగితే, ఇరాన్ సైతం ప్రతిఘటన మొదలుపెట్టే అవకాశాలు ఉంటాయి. అంటే మరోమారు పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తతలు తారస్థాయికి చేరే ప్రతికూల పరిణామాలు సర్వత్రా కనిపిస్తున్నాయి.

## ఇరాన్ బహిష్కృత నేత రెజా పహ్లావిపై దాడి



**బెర్లిన్:** జర్మనీలోని బెర్లిన్‌లో ఇరాన్ ప్రవాస యువరాజు రెజా పహ్లావిపై దాడి జరిగింది. వెనుక నుంచి ఒకరు ఎర్రటి టమాటో జ్యూస్ విసిరాడు. వెంటనే భద్రతా సిబ్బంది స్పందించి నిందితుడిని పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. 50ఏళ్లుగా స్వదేశానికి దూరంగా ఉంటు న్న రెహ పహ్లావి ప్రస్తుతం జర్మనీలో పర్యటిస్తున్నారు. ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక ప్రెస్‌మీట్ నిర్వహించిన అనంతరం ఒక భవనం నుంచి బయటకు వచ్చి ఫుట్‌పాత్‌పై నడుచుకుంటూ వెళ్తుండగా... ఇంతలో ఒక ఇరాన్ పౌరుడు వెనుక నుంచి వచ్చి టమాటో జ్యూస్‌తో దాడి చేశాడు. తల వెనుక భాగం, మెడ, బ్లేజర్‌పై పడింది. వెంటనే భద్రతా సిబ్బంది అప్రమత్తమై 65 ఏళ్ల వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. తెహ్రాన్‌లోని పాలకవర్గంపై ఐరోపా దేశాలు ఒత్తిడి తీసుకురావాలని రెజా పహ్లావి కోరారు. ''యూరప్ చేయగలిగేవి చాలా ఉన్నాయి. కానీ అవి చేయలేదు... ఉరిశిక్షలను ఆపమని ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకురావడం ద్వారా ఏమీ చేయలేదు. రాజకీయ ఖైదీలను విడుదల చేయమని వారిపై ఒత్తిడి తీసుకురావడానికి కూడా ఏమీ చేయలేదు'' అని విమర్శించారు. ఇక జర్మనీ పర్యటనకు ముందు బుధవారం సాయంత్రం ఎక్స్ పోస్ట్‌లో తమ స్వేచ్ఛ కోసం పోరాడుతున్న ఇరానీయులకు స్వరంగా ఉండేందుకు తాను బెర్లిన్‌ను సందర్శిస్తున్నట్లు చెప్పారు.

## వేతన జీవుల వెతలు

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆవేదన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తగిన వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉద్యోగ సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. రిటైర్డ్ ఐఎఎస్ అధికారి సిఆర్.బిస్వాల్ నేతృత్వంలోని పే రివిజన్ కమిషన్ (పిఆర్‌సి) సిఫార్సులు అమలు కాకపోవడం ఇందుకు ప్రధాన కారణమని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమాన పనికి సమాన వేతనం అనే మౌలిక సూత్రం ఇప్పటికీ అమలు కావడంలేదని, తక్కువ జీతాలతో ఎక్కువ గంటలు పనిచేయాల్సి రావడంతో శారీరక, మానసిక ఒత్తిడి పెరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, ఏజెన్సీ వ్యవస్థల మధ్య చిక్కుకుని నెలల తరబడి జీతాలు ఆలస్యమవుతున్నాయని, కుటుంబ అవసరాల కోసం అధిక వడ్డీకి అప్పులు చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు.

జిఎస్‌టి పేరిట గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3 ఉద్యోగుల నుంచి నెలకు సుమారు రూ.4 వేల వరకు ఏజెన్సీలు కోతలు పెడుతున్నాయని ఆయన విమర్శించారు.

## ప్రిన్సిపల్ సెక్రటరీగా శిఖాగోయల్

(3వ పేజీ తరువాయి)

బదిలీ చేశారు. ఆమె తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు కొనసాగించనున్నారు. అదేవిధంగా అదనపు డిజిపి (పర్సనల్) దేవేంద్ర సింగ్ చౌహాన్‌ను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజిగా నియమించారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డిజిగా ఉన్న షానవాజ్ ఖాసిమ్‌ను మల్టీ జోన్2 ఐజీగా బదిలీ చేయగా, ఆయనకు ఐజి (పర్సనల్) బాధ్యతలు అదనంగా అప్పగించారు. ఎసిబి డైరెక్టర్ డాక్టర్ తరుణ్ జోషిని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్‌గా నియమించారు. ఏప్రిల్ 30న పదవీ విరమణ చేయనున్న సుధీర్ బాబు స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ అవినాష్ మొహంతిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌గా బదిలీ చేయడంతో పాటు, ఎసిబి డైరెక్టర్ బాధ్యతలను కూడా అదనంగా అప్పగించారు. ఇక ఎస్ఐబి ఇంటెలిజెన్స్ ఐజిపి బి. సుమతిని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌గా నియమించారు. ఇంటెలిజెన్స్ ఐజీ కార్తికేయకు ఎస్ఐబి ఐజిపిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న సివి ఆనంద్ స్థానంలో శిఖాగోయల్‌ను నియమించడంతో కొత్త డిజిపిగా సివి ఆనంద్‌కు లైన్ క్లియర్ అయింది. ప్రస్తుత డిజిపిగా విధులు నిర్వహిస్తున్న బి.శివధర్‌రెడ్డి ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్నారు. ఆ తరువాత సివి ఆనంద్‌కు ప్రభుత్వం డిజిపి బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నాయి.

## రూ.10 లక్షలు సాయం

(3వ పేజీ తరువాయి)

ఆదుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ధైర్యం, మనోబలం కలగాలని ప్రార్థించారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ఆ కుటుంబాన్ని దు:ఖసాగరంలో ముంచిందని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు.

**శంకర్ గౌడ్ బలవన్మరణం అత్యంత బాధాకరం–టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ :** ఆర్‌టిసి డ్రైవర్ శంకర్ గౌడ్ మరణ వార్త పట్ల టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదని, చర్చలు చేసి పరిష్కరించుకోవాలని సూచించారు. ఇది ప్రజా ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి నిత్యం కృషి చేస్తోందన్నారు. శంకర్ గౌడ్ మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు.

**రాష్ట్ర బిసి కమిషన్ విచారం :**

ఆర్‌టిసి డ్రైవర్ శంకర్‌గౌడ్ ఆత్మహత్య చేసుకుని మరణించడం పట్ల బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ విచారం వ్యక్తం చేశారు. రాష్ట్ర బిసి కమిషన్ తరపున శంకర్‌గౌడ్‌కు సంతాపం ప్రకటించా రు. ''శంకర్ గౌడ్ మృతిపట్ల సంతాపాన్ని వ్యక్తం చేస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నాను. శోకంలో మునిగిన ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను'' అని చైర్మన్ జి.నిరంజన్ పేర్కొన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులు ఎవరూ కూడా ఈ రకమైనటువంటి చర్యలకు పాల్పడి, తమ కుటుంబాలకు అన్యాయం చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

## సుదీర్ఘ చర్చలు

(3వ పేజీ తరువాయి)

కొనసాగింది. ప్రభుత్వం తరపున డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, డి.శ్రీధర్ బాబు, జి.వివేక్ వెంకట్ స్వామి, అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, చీఫ్ సెక్రటరీ కె.రామ కృష్ణ రావు, స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, సందీప్ కుమార్ సుల్తానియా, దాన కిషోర్, ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డి పాల్గొన్నారు. ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈ.వెంకన్న (ఎంప్లాయిస్ యూనియన్), వైస్ చైర్మన్లు ఎం.థామస్ రెడ్డి (టిఎంయు) కన్వీనర్ ఎండి.మౌలానా, కోకన్వీనర్లు సుద్దాల సురేష్, కత్తుల యాదయ్య, వి.యాదగిరి, వంఇ.ఎస్.రావు, జెఎసి నేతలు ఈ.అశ్వద్ధామరెడ్డి, కె.హనుమంతు ముదిరాజ్, ఎస్.బాబు (ఎంప్లాయిస్ యూనియన్) పాల్గొన్నారు. సమావేశం ప్రారంభం కాగానే ఆత్మహత్య చేసుకున్న నర్సంపేట ఆర్‌టిసి డిపో డ్రైవర్ శంకర్ గౌడ్‌కు మంత్రులు, అధికారులు, జెఎసి నేతలు సంతాపం వ్యక్తం చేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

సమావేశంలో తొలుత డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ ''ఆర్‌టిసి ప్రజలందరి సంస్థ. దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ముఖ్యంగా పేదలు, మహిళలకు రవాణా పరంగా ఉన్న ఏకైక మార్గం ఆర్‌టిసి. వారందరినీ దృష్టిలో పెట్టుకుని, సంస్థను ప్రజలకు మరింత అందుబాటులోకి తెచ్చి నిలబెట్టుకోవాల్సిన సామాజిక బాధ్యత మనపై ఉంది. తెలంగాణలో ఎవరినీ శత్రువులుగా చూసే స్వభావం మా ప్రభుత్వానికి లేదు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లపాటు ఆర్‌టిసి ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంది. పాలనాపరంగా సంస్థ చిన్నాభిన్నమైంది. ఆనాడు పరిస్థితులను తట్టుకోలేక కార్మికులు సమ్మె చేసినప్పుడు, అప్పటి పాలకులు ఎంత కఠినంగా ప్రవర్తించారో మీరందరూ చూశారు. గత పాలకుల మాదిరిగా మేము వ్యవహరించబోమని స్పష్టం చేస్తున్నాను. బడ్జెట్ సమావేశాలు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), మహిళా బిల్లు, ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను, ఇతర మంత్రులు బిజీగా ఉన్న సమయంలో అకస్మాత్తుగా సమ్మె నిర్ణయం తీసుకోవడం వల్ల ఒక కార్మికున్ని కోల్పోవాల్సి వచ్చింది. ఇది అత్యంత బాధాకరం, ఆ కుటుంబానికి ఇది తీరని లోటు'' అని అన్నారు. ఆర్‌టిసి అనేది మన రాష్ట్రంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అని, ఇతర రాష్ట్రాల్లో సంస్థల పరిస్థితి వేరుగా ఉన్నా, మన సంస్థను మనం బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్‌టిసి కార్మికుడు శంకర్ గౌడ్ మరణించడం చాలా బాధాకరమన్నారు. ''వ్యక్తి ఏ స్థాయిలో ఉన్నా సరే, ప్రాణం అనేది అత్యంత విలువైనది. శంకర్ గౌడ్ మరణంతో ఆ కుటుంబం మొత్తం తలకిందులైంది. ఇలాంటి విషాదకర సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తరపున మేము, కార్మిక సంఘాల నేతలుగా మీరు సమిష్టిగా కార్మికులకు పిలుపునిద్దాం. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి తప్ప, ప్రాణాలు తీసుకోవడం సరైన నిర్ణయం కాదు. సమస్య ఎంత క్లిష్టమైనదైనా సరే, కూర్చుని మాట్లాడుకుంటే ఖచ్చితంగా పరిష్కారం లభిస్తుంది'' అని డిప్యూటీ సిఎం అన్నారు.

## సమ్మె న్యాయబద్ధమైనదే

(3వ పేజీ తరువాయి)

వాటిని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇకనైనా ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించకపోతే ఆర్‌టిసి కార్మికులకు సిపిఐ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

గురువారం నర్సంపేట డిపో వద్ద శంకర్ గౌడ్ అనే కార్మికుడు నిప్పంటించుకొని 80 శాతం కాలి చనిపోయిన కార్మికుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. నల్లగొండ, భద్రాచలం ఆర్‌టిసి కార్మికులు ఆత్మహత్యాయత్నం చేశారని ప్రాణాలు తీసుకోవడం వల్ల సమస్యలు పరిష్కారం కాదని కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఆర్‌టిసి కార్మికులతో తగువు పెట్టుకుంటే పతనం తప్పదని యూనియన్ అంటే పాలకులకు భయమెందుకు అన్నారు. డిమాండ్లు పరిష్కరించే వరకు ఆర్‌టిసి కార్మికులకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఆర్‌టిసి కార్మికులు పాల్గొన్నారు.

## శంకర్‌గౌడ్ అంత్యక్రియలు

(3వ పేజీ తరువాయి)

అంత్యక్రియలు పూర్తిచేశారు.

**శంకర్‌గౌడ్ అంత్యక్రియల్లో ఉద్రిక్తత :** వరంగల్ జిల్లా నర్సంపేట బస్టాండ్‌లో ఆత్మహత్యకు యత్నించి ప్రాణాలు కోల్పోయిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి నర్సంపేట మండలం ముత్తోజిపేటలోని ఆయన కుమార్తె ఇంటికి తరలించారు. అక్కడకు చేరుకున్న ఆర్టీసీ కార్మికులు, విపక్ష నేతలు, శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులు మృతదేహన్ని నర్సంపేట డిపోకు తరలించి, నివాళులర్పించేందుకు అనుమతించాలని పోలీసులను కోరారు. దీనికి వారు నిరాకరించగా నర్సంపేటమల్లంపల్లి రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. డిపో వద్దకు తీసుకెళ్లకుండా ఎందుకు అడ్డుకుంటున్నారని కార్మికులు ప్రశ్నించారు. శంకర్ మృతదేహంపై నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మృతదేహన్ని నర్సంపేట ఆర్టీసీ డిపో వద్దకు తీసుకెళ్తామని ఆర్టీసీ కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేయడంతో వెంటనే పోలీసులు అప్రమత్తమై పెద్ది సుదర్శన్‌రెడ్డి అరెస్టు చేస్తుండగా భారీ సంఖ్యలో కార్యకర్తలు పోలీస్‌వాహనాన్ని అడ్డగించారు. సుమారు అరగంటపాటు పోలీసులకు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు, ఆర్టీసి కార్మికులు వాగ్వివాదం చోటుచేసుకుంది. పోలీస్ వాహనం వెళ్లకుండా కార్యకర్తలు కర్రలు, కుర్చీలు వాహనానికి అడ్డువేసి నిరసన వ్యక్తం చేశారు. చివరకు పెద్ది సుదర్శన్‌రెడ్డిని పోలీస్ వాహనంలో ఖమ్మం జిల్లాలోని కారేపల్లి తరలించారు. బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి హాజరై శంకర్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిరసన వ్యక్తం చేస్తుండగా రాణాప్రతాప్‌రెడ్డిని అరెస్టు చేసి మహబూబాబాద్ జిల్లాకు తరలించారు. అనంతరం మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్‌ఎస్ నేత రాకేష్‌రెడ్డిలు హాజరై శంకర్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతదేహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు వ్యక్తం చేశారు. ఆత్మహత్య చేసుకున్న శంకర్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వారిని అరెస్టు చేసి పోలీసులు ప్రత్యేక వాహనాలలో తరలించారు.

మధ్యాహ్నం ముత్తోజిపేటకు చేరుకున్న కేంద్రమంత్రి బండి సంజయ్ శంకర్ గౌడ మృతదేహానికి నివాళులు అర్పించారు. నర్సంపేట డిపోకు తీసుకెళితేనే శంకర్ గౌడ ఆత్మకు శాంతి చేకూరుతుందని కార్మికులు,



కుటుంబ సభ్యులు చెబుతుంటే పోలీసుల అభ్యంతరం ఏంటని బండి సంజయ్ ప్రశ్నించారు. భౌతిక కాయాన్ని తరలించేదాకా కదిలేది లేదని భీష్మించారు. ఈ క్రమంలో సంజయ్‌కు ప్రభుత్వ ఆదేశాలను పోలీస్ కమిషనర్ వివరించారు. శంకర్ గౌడ కుటుంబ సభ్యులు, ఆర్టీసీ కార్మికుల విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోవాలని సంజయ్ కోరారు. ఈ క్రమంలో శంకర్ గౌడ మృతదేహాన్ని తరలించేందుకు కార్మికులు అంబులెన్స్ రప్పించి సిద్దంగా ఉంచుకున్నారు. తీవ్ర ఉద్రిక్త అనంతరం శంకర్ గౌడ కుటుంబసభ్యులు, జేఏసీ నేతలతో పోలీసులు జరిపిన మంతనాలు కొలిక్కి వచ్చాయి. అంత్యక్రియలు చేసేందుకు కుటుంబసభ్యులు అంగీకరించారు.

తొలుత శంకర్ మృతదేహంపై నర్సంపేట ఆర్డీవో ఉమారాణి పూలమాల వేసి నివాళులర్పించి ప్రభుత్వం నుండి రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని, నర్సంపేట ఆర్టీసీలో కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి రూ. 5లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. నర్సంపేట డిపోకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించినప్పటికి పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో ముత్తోజిపేటలోనే నిరసన కార్యకర్తలు చేపట్టారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సమక్షంలో నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో మళ్లీ ఆర్డీవో ఉమారాణి స్పందించి మరో రూ. 5లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

## త్వరపడకుంటే తీవ్ర పరిణామాలు

సమయం మించిపోకముందే ఒప్పందానికి రావాలి

ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక



**వాషింగ్టన్:** ఇరాన్ ఎంత త్వరగా తమతో ఒప్పందం కుదుర్చుకుంటే అంత మంచిదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. సమయం మించిపోతోందని తెహ్రాన్‌కు ఆయన హెచ్చరికలు చేశారు. వైట్‌హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ట్రంప్ మాట్లాడారు. ఇరాన్‌పై అణ్వాయుధాలు వాడే ప్రణాళిక తనకు లేదని చెప్పారు. సంప్రదాయ యుద్ధ పద్ధతుల్లో ఇప్పటికే వారిని నాశనం చేశామన్నారు. అణ్వాయుధాన్ని ఉపయోగించడానికి ఎవరినీ, ఎప్పటికీ అనుమతించకూడదని ట్రంప్ అన్నారు. ఈ సందర్భంగా ఇరాన్‌తో ఒప్పందానికి తాను తొందరపడటం లేదని ట్రంప్ పేర్కొన్నారు. త్వరిత పరిష్కారం కంటే స్థిరమైన, దీర్ఘకాలిక ఒప్పందం పైనే దష్టిసారించినట్లు తెలిపారు. ఇటీవల ముగిసిన రెండు వారాల కాల్పుల విరమణలో ఇరాన్ తన ఆయుధ వ్యవస్థలను పునరుద్ధరించుకొని ఉండవచ్చన్నారు. ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇరాన్‌కు సమయం మించిపోతోందని హెచ్చరిస్తూ ట్రంప్ ట్రూత్‌సోషల్‌లో ఓ పోస్టు పెట్టారు. 'నాకు చాలా సమయం ఉంది. కానీ ఇరాన్‌కు లేదు. సమయం మించిపోతోంది. ఇరాన్ సైన్యం కుప్పకూలిపోయింది. వారి నాయకులు ఇక మనతో లేరు. దిగ్బంధనం పటిష్టంగా ఉంది. ఇకనుంచి పరిస్థితి మరిం త దారుణంగా ఉంటుంది' అని హెచ్చరించారు. ఇటీవల తాము స్వాధీనం చేసుకున్న ఇరాన్ పతాకం ఉన్న ఓ వాణిజ్య నౌకలో చైనా నుంచి ఇరాన్‌కు వెళ్తున్న బహుమతి ఉందని ట్రంప్ పేర్కొన్నారు. అయితే ఆ బహుమతి ఏంటనే విషయాన్ని వెల్లడించేందుకు ఆయన నిరాకరించారు. అది అత్యంత రహస్యమైందని తెలిపారు. ఇరాన్ నౌకలపై విధించిన దిగ్బంధంతో తెహ్రాన్ ఉక్కిరిబిక్కిరవుతోందన్నారు. గల్ఫ్ దేశాలను లక్ష్యంగా చేసుకోవడం, హెర్మూజ్ జలసంధిలో సీ మైన్స్ పెట్టి ఇరాన్ పెద్ద తప్పు చేసిందన్నారు.

**ఇజ్రాయిల్- లెబనాన్ కాల్పుల విరమణ పొడిగింపు**

ఇజ్రాయిల్ లెబనాన్ మధ్య కాల్పుల విరమణను మరో మూడు వారాలు పొడిగిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ క్రమంలో ఇరుదేశాల నాయకులు త్వరలో వైట్‌హౌస్‌లో సమావేశమయ్యే అవకాశం ఉందని కూడా తెలిపారు. అమెరికా మధ్యవర్తిత్వంతో వైట్‌హౌస్‌లో రెండో విడత చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో ఇజ్రాయెల్ రాయబారి యెచిల్ లీటర్, లెబనాన్ రాయబారి నాడా మౌవాద్‌లతో ట్రంప్ చర్చించారు.

## తెగించి పోరాడుదాం

(3వ పేజీ తరువాయి)

ప్రస్తుతం పాలకులు చేస్తున్నారని విమర్శించారు. కార్మిక యూనియన్లు అంటే ప్రభుత్వానికి ఎందుకంత భయమని, హక్కుల కోసం పోరాడే గొంతుకలను నొక్కాలని చూడటం ప్రజా స్వామ్య విరుద్ధం అన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, అందులో భాగంగానే ప్రైవేటీ కరణ దిశగా అడుగులేస్తూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులను ప్రభుత్వం లో విలీనం,ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేత, గుర్తింపు సంఘం ఎన్నికలు, వేతన సవరణ, పని భద్రత, బకాయిలు, కొత్తబస్సులను కొనుగోలు చేయాలనే తదితర డిమాండ్లు సాధ్యం కానివికాదని పేర్కొన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుత చట్ట బద్దంగా సమ్మె చేస్తుంటే అరెస్టులు, అక్రమ నిర్బంధాలు ఎందుకు విధిస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడకుండా రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితులను తీసుకొస్తోందని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ఆర్టీసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి సమ్మెను నివారించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేరేంత వరకు తాము ఆర్టీసి కార్మికులకు పూర్తి అండగా ఉంటామని, భరోసా ఇచ్చారు. కార్మికుడు శంకర్ గౌడ్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, తక్షణమే ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిర్బంధాలు పెరిగే కొద్దీ ఉద్యమం మరింత ఉధృతం అవుతుందని హెచ్చరిచారు. అనంతరం పలువురు ఆర్టీసి మహిళా కార్మికులు మృతి చెందిన శంకర్ గౌడ్ చిత్రపటంతో ర్యాలీ నిర్వహిచారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, సలిగంటి శ్రీనివాస్, మిర్యాల రంగయ్య, ఎస్‌కే ఫహీమ్, జిల్లా సమితి సభ్యులు వంగ వెంకట్, కె రత్నకుమారి, నేరెళ్ల రమేష్, భూక్యా శ్రీనివాస్, రమణమూర్తి, నాయకులు ఎర్రవెల్లి శంకర్, గుమ్మడెల్లి దుర్గయ్య, నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, యూసుఫ్, సత్యనారాయణ చారి, షాహీన్ సైసర్, మేదిని లక్ష్మి , షమీమ్, వీణ తదితరులు పాల్గొన్నారు.

## ‘మేడే’ విజయవంతం చేయండి



ప్రజాపక్షం/గజ్వేల్: ప్రపంచవ్యాప్త141వ మేడేను విజయ వంతం చేయాలని ఏఐటియుసి జిల్లా కౌన్సిల్ సభ్యులు శివలింగ కృష్ణ స్పష్టం చేశారు. శుక్రవారం గజ్వేల్ లో మేడే పోస్టర్ ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి సర్కార్ తెస్తున్న నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసేంత వరకు పోరాటం చేద్దామని తెలిపారు. మేడేను పండుగ వాతావరణంలో జెండా ఆవిష్కరణ చేసుకుని ఘనంగా జరుపుకుందామని వివరించారు. సిపిఐ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు స్వర్గం రాజేశం, గజ్వేల్ మార్కెట్ కమిటీ హమాలి సంఘం అధ్యక్షులు శ్రీను పాల్గొన్నారు.

## భూభారతి రీసర్వేపై అవగాహన

### హాజరైన నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



ప్రజాపక్షం/పెద్ద శంకరంపేట : మండలంలోని చింత లక్ష్మాపూర్, కమలాపూర్ గ్రామాల్లో భూభారతి రీసర్వేపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొని రైతులకు సూచనలు చేశారు. రీసర్వే ద్వారా భూముల హద్దులు, రికార్డులు స్పష్టంగా లభిస్తాయని, పాత భూ వివాదాలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రైతులు సర్వే సమయంలో తమ భూముల సరిహద్దులను చూపించి, తప్పులు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని సూచించారు. ఆధునిక సాంకేతికతతో పారదర్శకంగా సర్వే జరుగుతుందని పేర్కొంటూ, రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. తాసిల్దార్ ప్రభుదాస్, ఎంపీడీఓ క్రాంతి కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## గ్రామ స్వరాజ్యమే దేశానికి బలం



ప్రజాపక్షం/కెరమెరి : గ్రామ స్వరాజ్యమే దేశానికి బలమని, గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని ఇంచార్జ్ ఎంపిడిఓ సాయిరాం గౌడ్ పిలుపునిచ్చారు. కెరమెరి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పెందోర్ ఆనందరావు అధ్యక్షతన శుక్రవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో స్వచ్ఛతపై అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సాయిరాం గౌడ్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారానే గ్రామాలు బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. సర్పంచ్ పెందోర్ ఆనందరావు మాట్లాడుతూ గ్రామాన్ని స్వచ్ఛంగా ఉంచే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. స్థానిక పాలనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, అభివృద్ధికి కలిసికట్టుగా సహకరించాలని కోరారు. పారదర్శకమైన పాలనతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని వెల్లడించారు. పంచాయతీ కార్యదర్శి గణేష్, ఉప సర్పంచ్ శ్రీకాంత్, వార్డు సభ్యులు ఆత్రం రాజ్ కుమార్, గేడం మాన్కు, సాగర్, సుభద్ర, బామ్నే శ్రీకాంత్, రాథోడ్ శ్రీకాంత్, అబ్దుల్ సమద్, ఖాతున్ బి, కారోబార్ వెంకన్న పాల్గొన్నారు.

## డా. నాగమోహన్‌కు ఘన సన్మానం



ప్రజాపక్షం/నిజామాబాద్ : ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గాబాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ డాక్టర్ నాగమోహన్‌ను బీసీటీయు ఆధ్వర్యంలో ఆస్పత్రిలోని ఆయన ఛాంబర్‌లో కలిసి శాలువ, పూలబుకెతో ఘనంగా సన్మానించి సావిత్రిబాయి పూలే జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ మాట్లాడుతూ సేవా గుణంపేదల పక్షపాతి అయిన నాగమోహన్ జిల్లా ఆస్పత్రికి సూపరింటెండెంట్‌గా రావటంతో పేదలకు ఆరోగ్యపరంగా మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓ జిల్లా అసోసియేటెడ్ అధ్యక్షులు పెద్దోల్ల నాగరాజు, బీసీటీయు అసోసియేట్ అధ్యక్షులు మోహన్, గౌరవ అధ్యక్షులు కైరంకొండ బాబు, కార్యనిర్వాహఖ అధ్యక్షులు కంచరి రవికుమార్, కొట్టాల రామకృష్ణ, గౌరవ సలహాదారులు రమణస్వామి, కోశాధికారి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సతీష్‌కుమార్, వేణు, రవిచంద్ర, సుమన్, మనోజ్ పాల్గొన్నారు.

## తగిన జాగ్రత్తలతో ఉపాధి పనులు



ప్రజాపక్షం/నేరడిగొండ: నేరడిగొండ మండల వ్యాప్తంగా జరుగుతున్న ఉపాధి హామీ పనులను డీఆర్‌డీఓ పీడీ రవీందర్ శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడి, వేసవి ఎండల తీవ్రమవుతున్న నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎండ తీవ్రత తక్కువగా ఉన్న సమయంలోనే పనులు ముగించుకొవాలని, అపాయాలకు గురికాకుండా చూసుకోవాలని కోరారు. పని ప్రదేశాల్లో కూలీలకు అవసరమైన తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, విశ్రాంతి కోసం గ్రీన్ టెంట్లను అందుబాటులో ఉంచామని క్షేత్ర సహాయకులను ఆదేశించారు. ఎండల దృష్ట్యా కూలీల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ పనులు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపిడివో శేఖర్, ఏపీఓ వసంతరావు, వదూర్ సర్పంచ్ శ్రీకాంత్, సాంకేతిక సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలందరికీ తెలిసేలా...

# వాస్తవాలు ప్రచురించాలి

### కలెక్టర్, మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ కుమార్ దీపక్



ప్రజాపక్షం/నస్పూర్ : మీడియా సంస్థలు ప్రజలందరికీ వాస్తవాలు తెలిసేలా వార్తలు ప్రచురించాలని జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా పౌర సంబంధాల అధికారి, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ కన్వీనర్ మాదంశెట్టి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దినపత్రికలు, న్యూస్ చానళ్ల ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని తెలిపారు. 2026–28 సంవత్సరాలకు గాను ప్రభుత్వ ఉత్తర్వులు 252, ఆర్‌టి 103 ప్రకారం అర్హత గల వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు జారీ చేయడంలో కమిటీ ప్రభుత్వ ఉత్తర్వుల మార్గదర్శకాలను పాటించాలని తెలిపారు. సరైన గుర్తింపు, అర్హత లేనివారు పాత్రికేయులుగా చలామణి కావడంతో అసలైన పాత్రికేయులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో అందిన దరఖాస్తులను కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి అర్హత గల వారిని ఎంపిక చేయాలని తెలిపారు.జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు అల్లువెల్లి రమేష్ రెడ్డి, గొల్లపల్లి సిద్ధార్థ, పార్వతి సురేష్ కుమార్, దేగ సత్యనారాయణ, మొహమ్మద్ ఇమాద్ ఉద్దీన్, రూపిరెడ్డి ప్రకాష్ రెడ్డి, అయినంపూడి నవీన్ కుమార్, గొల్లన నరేష్, బెక్కం సదానందం, మొదంపురం సంతోష్, జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయ సిబ్బంది కొల్లూరి సంపత్ కుమార్, రవితేజ, మంత్రి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

## ఇల్లు లేనివారికి మొదటి ప్రాధాన్యత

### ఇందిరమ్మ గృహాన్ని ప్రారంభించిన కలెక్టర్



ప్రజాపక్షం/మెదక్ : నిరుపేదల సొంత ఇంటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని తీసుకొచ్చిందని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. మెదక్ మండలం శివ్వాయపల్లి గ్రామంలో శుక్రవారం పండుగ వాతావరణంలో లబ్దిదారుల ఇల్లు గృహ ప్రవేశానికి కలెక్టర్ హాజరై ఇందిరమ్మ గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలో పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. శివాయపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారులు తోట లక్ష్మి గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కోసం ప్రభుత్వం విడుదలవారీగా నిధులు విడుదల చేస్తున్నారు. ఒక్కో గృహ నిర్మాణానికి ఐదు లక్షలు అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 750 ఇందిరమ్మ ఇండ్లు పూర్తయ్యాయని, మిగిలిన వారు కూడా త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 650 ఇండ్లు గృహాప్రవేశాలు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా హౌసింగ్ పీడీ మాణిక్యం మెదక్ ఆర్డీఓ రమాదేవి, తాసిల్దార్ లక్ష్మ ణ్ బాబు, సర్పంచ్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## శంకర్ గౌడ్‌ది ప్రభుత్వ హత్యే

### ఎఐటియుసి నాయకులు వీరభద్రయ్య, బాజీ సైదా



ప్రజాపక్షం/శ్రీరాంపూర్ : ఆర్‌టిసి కార్మికుడు శంకర్ గౌడ్ ఆత్మహత్య ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా విమర్శించారు. శ్రీరాంపూర్ నస్పూర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్లే శంకర్ గౌడ్ క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం అందించి, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వారు కోరారు.

## నైపుణ్యాభివృద్ధితోనే భవిష్యత్‌పై విజయం

### అడిషనల్ కలెక్టర్ పాండు



ప్రజాపక్షం/సంగారెడ్డి : ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల్లో బాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్‌సి, ఎస్‌టి బిసి, మైనార్టీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమం జరిగింది.అడిషనల్ కలెక్టర్ పాండు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో ముందుగా తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకోవడం అత్యంత కీలకమని తెలిపారు. మీరు ఏం కావాలను కుంటున్నారు. ఏరంగంలో రాణించాలనుకుంటున్నారు. అనే ప్రశ్నలకు సమాధానం తెలుసుకుని ఆ దిశగా క్రమశిక్షణతో పయనిస్తే విజయాన్ని అందుకోవడం సులభమవుతుందని సూచించారు. ప్రస్తుతం పోటీ ప్రపంచంలో కేవలం పాఠ్యపుస్తకాల జ్ఞానం సరిపోదని, నైపుణ్యాల అభివృద్ధి ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ టెక్నికల్ నైపుణ్యాలు సమస్యలను పరిష్కరించే సామర్థ్యం వంటి అంశాలు, విద్యార్థులను మరింత ముందుకు తీసుకెళ్లాయని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ తరహా శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యతుకు బాటలు విద్యార్థులను ప్రొత్సహించారు. విజయం ఒక్క రోజుల్లో సాధ్యం కాదని నిరంతర శ్రమ, పట్టుదల,క్రమ శిక్షణ ఉంటే లక్ష్యాన్ని చేరుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. వైఫల్యాలను భయపడకుండా వాటిని పాఠాలుగా తీసుకుని మరింత ధైర్యంగా ముందుకు సాగాలని విద్యార్థుల కు సూచించారు. అలాగే తమ సామాజిక నేపథ్యాన్ని అడ్డంకిగా కాకుండా అవకాశంగా మలుచుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు శిక్షణ కార్యక్రమాలు అందరికి అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవడమే విజయానికి మొదటి అడుగని అన్నారు.డిడి సోషల్ వెల్ఫేర్, ఆఫీసర్, అకిలేష్ రెడ్డి, ఎస్సీ కార్పోరేషన్ ఈడి రామాచారి జిల్లా బిసి సంక్షేమ అధికారి జగదీష్ రెస్ట్ డైరెక్టర్ రాజేష్, కుమార్, ట్రైనర్ అరవింద్ స్కిల్ డెవలప్‌మెంట్, ట్రైనర్ కె కృష్ణ కుమార్, మోటివేటర్, కూన వేణు, రాజు రాథోడ్ తదితరులు పాల్గొని విద్యార్థులకు నైపుణ్య శిక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బిసి ఎస్‌సి, ఎస్‌టి హాస్టళ్లలోని డిగ్రీ విద్యార్థులు వివిధ సంక్షేమ శాఖల అధికారులు సిబ్బందిపాల్గొన్నారు.

## ఎంఎన్‌ఎం పరీక్షా ఫలితాలు విడుదల చేయాలి

### ఎఐటియూసి జిల్లా.. ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్

ప్రజాపక్షం/రెబ్బన : మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఫిమేల్ పరీక్షా ఫలితాలను వెంటనే వెల్లడించాలని కోరుతూ ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించే నిరసనలను విజయవంతం చేయాలని ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం రెబ్బన మెడికల్ ఆఫీసర్ రిషికకు ఎఐటియుసి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 డిసెంబర్ 29న నిర్వహించిన నోటిఫికేషన్ నం. 2/2023కు సంబంధించి ఎందరో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎఎన్‌ఎంలు పరీక్ష రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఎన్నికల కోడ్, కోర్టు కేసుల సాకుతో ఫలితాల వెల్లడిలో జాప్యం చేయడం వల్ల వయోపరిమితి ముగిసే దశలో ఉన్న అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితాల విడుదలపై స్పష్టత ఇవ్వకుంటే 27న నిరసన నిద్ర, 28న మహా ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఖాళీల సంఖ్యను పెంచి ఫలితాలు ప్రకటించడంతో పాటు, ఉద్యోగం రాని వారికి 100 శాతం గ్రాస్ శాలరీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెండో పీఆర్సీ ఏడు నెలల బకాయిలను వెంటనే చెల్లించాలని, 10 లక్షల హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. మరణించిన ఏఎన్‌ఎంల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగ అవకాశం కల్పించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు ప్రమీల, సునీత, వనిత, విజయలక్ష్మి పాల్గొన్నారు.



## కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు తీర్పు

## కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు

ప్రజాపక్షం/భీమ్‌గల్ : కాళేశ్వరం ప్రాజెక్టులో ఎటువంటి అవినీతి జరగలేదని, మాజీ సిఎం కేసీఆర్ హరీష్‌రావు పై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి సిఎం రేవంత్‌రెడ్డికి గట్టి చెంప పెట్టు లాంటిదని బీఆర్ఎస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. గత రెండున్నర సంవత్సరాలుగా కాళేశ్వరం ప్రాజెక్టుపై లక్ష కోట్ల అవినీతి జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అసత్య ప్రచారాలను ఈ తీర్పు పూర్తిగా ఖండించిందన్నారు. ఈ తీర్పుతో తెలంగాణ ప్రజలకు, రైతులకు అసలు నిజం తెలిసిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఇప్పటివరకు మొత్తం అయినా ఖర్చు సుమారు రూ.94 వేల కోట్లు అయితే, లక్ష కోట్ల అవినీతి జరిగిందని దుష్ప్రచారం చేయటం కాంగ్రెస్ నాయకుల అజ్ఞానానికి నిదర్శనమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే ఒక్క మేడిగడ్డ బ్యారేజీ మాత్రమే కాదని అందులో 3 బ్యారేజీలు, 16 రిజర్వాయర్లు, 21 పంపుహౌస్‌లు, 19 సబ్‌స్టేషన్లు 203 కిలోమీటర్ సొరంగాలు, 98 కిలోమీటర్ల ప్రెజర్ మెన్స్, 1531 కిలోమీటర్ గ్రావిటీ కెనాల్స్ వేల కిలోమీటర్ల పిల్లకాలువలు విజయవంతంగా కేసీఆర్ నిర్మించారని గుర్తు చేశారు.

## ఆర్టీసి కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడొద్దు

### సిపిఐ కార్యదర్శి భుక్యా రమేష్ పిలుపు

ప్రజాపక్షం/ నిర్మల్ రూరల్ : ఆర్టీసి కార్మికులు మనోధైర్యాన్ని కోల్పోయి ఆత్మహ్యతల వంటి తీవ్ర నిరణయాలు తీసుకోవద్దని సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి భుక్యా రమేష్ కోరారు. శుక్రవారం నిర్మల్‌లో ఆయన పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, కార్మికుల సమస్యలు ఆత్మహత్యలతో పరిష్కారం కావని, ఐక్య పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసి కార్మికుడు శంకర్ గౌడ్ మృతి పట్ల భుక్యా రమేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ మరణం అత్యంత భాధాకరమని పేర్కొన్న ఆయన, మృతుని కుటుంబానికి సిపిఐ జిల్లా సమితి తరపున ప్రగాఢ సానుభూతిని , సంతాపాన్ని తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా రవాణాలో అహర్నిశలు శ్రమిస్తున్న ఆర్టీసి కార్మికులకు తగిన గౌరవం వేతనాలు, ఉద్యోగ భద్రత లభించకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, మృతుడి కుటుంబానికి భారీ ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు ఆర్టీసిని బలోపేతం చేసి కార్మికుల్లో భరోసా కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని , పెండింగ్ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని భుక్యా రమేష్ స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో కార్మికుల పక్షాన పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ఆర్టీసి కార్మికుల మరణాలకు ప్రభుత్వానిదే బాధ్యత

### టియుసిఐ, ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజన్న, జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి డిమాండ్

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జేఏసి పిలుపు మేరకు చేపట్టిన సమ్మెమూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నిర్మల్ డిపో ముందు జరుగుతున్న సమ్మె శిభిరంలో ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.రాజన్న ఎఐటియుసి గౌరవ అధ్యక్షుడు ఎస్.ఎన్ రెడ్డి పాల్గొని తమ పూర్తి మద్దతును ప్రకటించారు. ఆర్టీసి కార్మికుల వరుస మరణాలకు రేవంత్ రెడ్డి సర్కారే పూర్తి బాధ్యత వహించాలని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేసిన సమయంలో తాము అధికారంలోకి వస్తే ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేసి ఆదుకుంటామని ప్రతిపక్ష హోదాలో రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను ఇప్పుడు తుంగలో తొక్కారని ఆయన విమర్శించారు. అధికారుల ఇష్టానుసారమైన చర్యలు, పనిగంటల పెంపు మరియు తీవ్రమైన పని ఒత్తిడి కారణంగా కార్మికులు అనారోగ్యానికి గురవుతున్నారని, ముఖ్యంగా గుండె జబ్బులతో ప్రాణాలు కోల్పోతున్నారని మండిపడ్డారు. లాబార్జనే ధ్యేయం కాకుండా సేవా దృక్పథంతో పనిచేస్తున్న సంస్థలో కార్మికులను పీల్చి పిప్పి చేయడం అన్యాయమని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి చర్యలు జరపాలని, లేని పక్షంలో గత కేసీఆర్ ప్రభుత్వానికి పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా పడుతుందని ఆయన హెచ్చరించారు.ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కె.లక్ష్మీ పిడిఎస్‌యూ జిల్లా కన్వీనర్ కిరణ్ ఆర్టీసి జేఏసి నాయకులు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.




# అక్రమ వడ్డీ వ్యాపారులపై పోలీస్ ‘స్ట్రైక్’..

### 15 కేసులు నమోదు

### ఎస్పి అఖిల్ మహాజన్

ప్రజాపక్షం/నేరడిగొండ: అమాయక ప్రజలు రైతుల బలహీనతలను ఆసరాగా చేసుకుని, అధిక వడ్డీలతో పీడిస్తున్న వడ్డీ వ్యాపారులపై జిల్లా పోలీస్ యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. జిల్లా ఎస్పి అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు శు క్రవారం ఏకకాలంలో45 బృ ం దాలు 15 పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆకస్మిక దా డులు నిర్వహించాయి.15 కేసులు నమోదు చేసి, భారీగా ప్రామిసరీ నోట్లు, బాండ్ పేపర్లు, ఖాళీ చెక్కులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పి తెలిపారు.

### ఆకస్మిక దాడుల్లో స్వాధీనం చేసుకున్న పత్రాలు

జిల్లాలోని 16 మండలాల్లో సుమారు వంద మంది వడ్డీ వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాలపై పోలీసులు దాడులు చేశారు. లైసెన్స్ లేకుండా అక్రమంగా వ్యాపారం చేస్తూ, రైతుల వ్యవసాయ భూముల పాస్ బుక్కులు తాకట్టు పెట్టుకోవడం, ఖాళీ స్టాంపు పేపర్లపై సంతకాలు తీసుకోవడం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. సోదాల్లో భాగంగా ప్రామిసరీ నోట్లు, బ్యాంక్ చెక్కులు, భూమి సేల్ డీడ్స్ వంటి కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలను ఎస్పీ ప్రకటించారు. ఆదిలాబాద్ టూటౌన్‌లో నాయిని సుదర్శన్, తలమడుగులో కటకం రాజు, శ్రీనివాస్, మావలలో కుంటి లింగన్న, దుర్గారెడ్డిలపై కేసులు నమోదయ్యాయి. నేరడిగొండలో గంగారెడ్డి, శ్రీనివాస్, జుంబేరాత్ రాహుల్, తాంసిలో ఉప్లంచి నగేష్, గంభీర్, ఇచ్చోడలో గౌతి సుందర్ సింగ్, గిట్టే మారుతి, కదమ్ సుదర్శన్, సాయికృష్ణలపై కేసులు నమోదు చేశారు. గుడిహత్నూర్‌లో దహాలే పవన్‌పై కేసు నమోదైంది. అక్రమార్కుల ఆటలు కట్టడి చేస్తామని, ప్రజలను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.



## ఆత్మబలిదానాలు వద్దు..

## హక్కుల సాధనకు కలిసి పోరాడుదాం

### ఎమ్మెల్యే చింతాప్రభాకర్

ప్రజాపక్షం/సంగారెడ్డి : ఆర్టీసీ కార్మికుల హక్కుల సాదన కోసం సంఘటితంగా కలిసి పోరాడుదాం తప్ప కార్మికులు ఎవ్వరూ తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని ఆర్టీసీ కార్మిక సోదరుడు శంకర్ గౌడ్ ఆత్మ బలి దానం చేసుకోవడం తీవ్రంగా కలిచివేసిందని , ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నామని, ఆర్టీసీ కార్మికులు ఎవ్వరూ ఆత్మబలిదానాలకు ఒడి గట్టవద్దని విజ్ఞప్తి చేస్తున్నాని, రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్లక్ష్యం వల్ల ఆర్టీసీలో ఇలాంటి పరిస్థితి వచ్చిందని శంకర్ గౌడ్ ఆత్మ బలిదానం కు కాంగ్రెస్ ప్రభుత్వానిదే పూర్తి బాధ్యతని అదికారంలోకి రాగానే ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి మాట తప్పారని, పీఆర్ఎస్ లతో పాటు కార్మికుల డిమాండ్లు ఏవీ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చడం లేదన్నారు. మేనిపెస్టోల్ ఇచ్చిన వాగ్దానాలు సైతం అమలు చేయకుండా రేవంత్ రెడ్డి కాలయాపన చేస్తున్నాడని, రేవంత్‌రెడ్డి ఇంకా ఎంత మంది ప్రాణాలు బలి తీసుకుంటావు, తెలంగాణ ఉద్యమ స్పూర్తితో సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాడుదాం అని మీ వెంటే మేమున్నామని చింతాప్రభాకర్ ఆర్టీసీ కార్మికులకు భరోసా ఇచ్చారు.ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలన్నింటిని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి సమస్యల నివారణకు తక్షణ చర్యలు చేట్టి వారిలో విశ్వాసం కల్పించాలని కోరారు.

# చెన్నై సూపర్ కింగ్స్ విజయం



మాజీ ఛాంపియన్ల పోరులో చెన్నై సూపర్ కింగ్స్‌దే పైచేయి. ఏకపక్ష మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌ను చిత్తుగా ఓడించిన చెన్నై పంతొమ్మిదో సీజన్‌లో మూడో విజయం నమోదు చేసింది. వాంఖడే స్టేడియంలో సంజూ శాంసన్ (101 నాటౌట్) మెరుపు శతకంతో భారీ స్కోరందించగా.. స్పిన్నర్లు అకీల్ హొసేన్(417), నూర్ అహ్మద్(224)లు ముంబై బ్యాటర్లను వణికించారు. పవర్ ప్లేలోనే మూడు వికెట్లు కోల్పోయిన ముంబై ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. హిట్టర్లంతా నట్టేట ముంచగా ముంబై 104కే కుప్పకూలగా సీఎస్కే భారీ విజయంతో రెండు పాయింట్లు సాధించింది. ఐపీఎల్లో అతి గొప్ప పోరాటాల్లో ఒకటైన మ్యాచ్లో చెన్నై సూపర్ కింగ్స్ పంజా విసిరింది. వాంఖడేలో సంజూ శాంసన్(101 నాటౌట్) శతక గర్జనతో ముంబై ఇండియన్స్కు భారీ లక్ష్యాన్ని నిర్దేశించిన చెన్నై స్పిన్నర్ల విజృంభణతో అదిరే విజయం సాధించింది. ఇంప్యాక్ట్ సబ్ అకీల్ హొసేన్(4–17) తన మొదటి ఓవర్లోనే ఓపెనర్ డానిష్ మలేవర్(0)ను ఔట్ చేసి షాకిచ్చాడు. ముకుల్ చౌదరీ ఓవర్లో డికాక్(7) బంతిని వికెట్ల మీదకు ఆడుకొని వెనుదిరిగాడు. తన రెండో ఓవర్లో డేంజరస్ నమన్ ధిర్(0)ను బౌల్ చేసిన అకీల్ ముంబైని ఒత్తిడిలో పడేశాడు. 11 పరుగులకే మూడు కీలక వికెట్లు పడిన వేళ గత మ్యాచ్ సెంచరీ హీరో తిలక్ వర్మ(37), సూర్యకుమార్ యాదవ్(36)లు ఆచితూచి ఆడారు. పెద్ద షాట్లకు వెళ్లకుండా సింగిల్స్, డబుల్స్.. చెత్త బంతుల్ని బౌండరీకి తరలించి స్కోర్ 50 దాటించారు. సూర్యతో కలిసి ముంబైని గట్టెక్కించాలనుకున్న తిలక్ను హొసేన్ బౌల్ చేయడంతో నాలుగో వికెట్ 73 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. 13వ ఓవర్లో నూర్ అహ్మద్ (224). హొసేన్ వరస బంతుల్లో హార్దిక్ పాండ్యా(1), రూథర్ఫొర్డ్(0)లను ఔట్ చేసి ముంబై ఓటమి అంచున నిలపగా.. తర్వాతి ఓవర్లో సూర్యను ఔట్ చేసిన హొసేన్ నాలుగో వికెట్తో చెన్నై విజయం ఖాయం చేశాడు. 103 పరుగుల తేడాతో గెలుపొందిన చెన్నై ప్లే ఆఫ్స్ రేసులో నిలిచింది.

**శాంసన్ శతక మోత..**

టాస్ ఓడిన చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్ను దూకుడుగా ఆరంభించింది. హార్దిక్ వేసిన రెండో ఓవర్లో రుతురాజ్ గైక్వాడ్(22) గట్టిగానే అరుసుకున్నాడు. రెండు ఫోర్లు, సిక్సర్తో దడ పుట్టించాడు. మరో ఎండ్లో సంజూ శాంసన్(101 నాటౌట్ : 54 బంతుల్లో 10ఫోర్లు, 6 సిక్సర్లు) సైతం ఉతికేసి నా.. ఫామ్ అందుకున్నట్టే కనిపించిన గైక్వాడ్.. గజన్ఫర్(225) బౌలింగ్లో సిక్సర్ కొట్టబోయి తిలక్‌వర్మకు దొరికాడు. దాంతో, 32 వద్ద చెన్నై తొలి వికెట్ పడింది. అనంతరం శాంట్నర్ ఓవర్లో వరసగా రెండుఫోర్లు బాదిన సర్ఫరాజ్ ఖాన్ (15) అనూహ్యంగా నాలుగో బంతికి బౌల్డయ్యాడు. ఆ తర్వాత వచ్చిన శివం దూబే(5)ను గజన్ఫర్ బౌల్ చేసి రెండో వికెట్ సాధించాడు.ముంబై బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తూ వికెట్లు తీస్తున్నా శాంసన్ తడబడలేదు. డెవాల్ బ్రెవిస్(21)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. ఉన్నంతసేపు దంచిన బ్రెవిస్కు అశ్వనీ కుమార్(2–37) చెక్ పెట్టాడు. డెత్ ఓవర్లలో గేర్ మార్చిన సంజూ.. బుమ్రా ఓవర్లో ఫోర్, భగత్ ఓవర్లో తొలి బంతికి సిక్సర్తో తొంభైలోకి వచ్చాడు. అదే ఊపులో బంతిని రెండుసార్లు స్టాండ్స్‌కి పంపిన శాంసన్ సెంచరీతో పాటు చెన్నై స్కోర్ రెండొందలు దాటించాడు. సంజూ విధ్వంసంతో చెన్నై నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది.

## నా ఆఖరి మిషన్ అదే..

### త్వరలోనే క్రికెట్‌ను వదిలేస్తా..!



న్యూజిలాండ్ మహిళా క్రికెటర్ సుజీ బేట్స్ కీలక నిర్ణయం తీసుకుంది. రెండు దశాబ్దాలకు పైగా వైట్ ఫెరన్స్ జట్టు విజయాల్లో కీలకమవుతున్న ఈ సీనియర్ ఆల్ రౌండర్ త్వరలోనే అంతర్జాతీయ క్రికెట్కు వీడ్కోలు పలకనుంది. ఈ ఏడాది టీ20 ప్రపంచకప్ విజేతగా క్రికెట్‌కు అల్విదా చెబుతానని వెల్లడించిందీ సీనియర్ ప్లేయర్. బ్రిటన్‌లో జరుగబోయే పొట్టి ప్రపంచకప్ నాకు ఆఖరు. ఈ టోర్నీలో ఛాంపియన్‌గా ఆటకు రిటైర్మెంట్ చెప్పేస్తాను అని బేట్స్ తెలిపింది. మహిళా క్రికెట్‌లో సీనియర్ ప్లేయర్ సుజీ బేట్స్ అంతర్జాతీయ క్రికెట్‌ను వీడేందుకు సిద్ధమైంది. వచ్చే పొట్టి ప్రపంచకప్ ఆడేసి ఆటకు గుడ్ బై చెప్పాలని బేట్స్ నిర్ణయించుకుంది. 'ఇరవై ఏళ్ల కెరీర్‌ను చూసుకుంటే.. కాలం ఎంత త్వరగా పరుగులు తీసిందో నమ్మలేకపోతున్నా. వైట్ ఫెరన్స్ తరఫున ఎన్నో విజయాలు సాధించడం చాలా గర్వంగా ఉంది. ప్రతిరోజు గొప్ప వ్యక్తిగా, జట్టు సభ్యురాలిగా, అథ్లెట్‌గా ఉండేందుకు ప్రయత్నిస్తాను అని బేట్స్ వెల్లడించింది. నా ఆఖరి మిషన్ ఒకటుంది. నాకు ఎన్నో మధుర జ్ఞాపకాలు మిగిల్చిన బ్రిటన్‌కు వెళ్లి.. అక్కడ మరొక వరల్డ్‌కప్ గెలవాలని అనుకుంటున్నా. చివరిసారిగా జట్టు కోసం నా సర్వశక్తులు ఒడ్డుతాను. నాకు మద్దతుగా నిలిచిన కుటుంబసభ్యులు, స్నేహితులు అందరికీ కృతజ్ఞతలు. ఈ ప్రయాణంలో ఎదురైన ఒడిదొడుకుల్లో తోడుగా ఉన్న నా భర్త స్కాటీ, నా కుమారులకు కృతజ్ఞతలు. నాకు ఇన్ని అవకాశాలు కల్పించిన కోచ్‌లకు ధన్యవాదాలు' అని బేట్స్ పేర్కొంది.

# గ్రహచలనం.. గురుత్వాకర్షణ...

సైన్స్



భూమి నిరంతరం అంతరిక్షంలో ప్రయాణిస్తున్నప్పటికీ మనకు ఆ చలనం స్పష్టంగా అనిపించకపోవడం వెనుక లోతైన శాస్త్రీయ కారణాలు ఉన్నాయి. ఈ పరిణామాన్ని అర్థం చేసుకోవాలంటే గురుత్వాకర్షణ, గ్రహాల చలనం, కేంద్రాభిముఖ బలం వంటి మౌలిక భౌతిక శాస్త్ర సూత్రాలను పరిశీలించాల్సి ఉంటుంది. గురుత్వాకర్షణ కేవలం వస్తువులు నేలపై పడేలా చేసే శక్తి మాత్రమే కాదు... భూమి, చంద్రుడు, సూర్యుడు వంటి ఖగోళ వస్తువుల మధ్య సమతుల్యాన్ని కాపాడే ప్రధాన శక్తి కూడా అదే. గురుత్వాకర్షణను భూమిపై జీవాన్ని బంధించి ఉంచే మౌలిక బలంగా చూడవచ్చు. మనుషులు, సముద్రాలు, వాతావరణం, జీవజాలం అంతా భూమికి అంటిపెట్టుకుని ఉండటానికి కారణం గురుత్వాకర్షణే. భూమి తన అక్షంపై తిప్పుకుంటూ, సూర్యుని చుట్టూ విపరీతమైన వేగంతో ప్రయాణిస్తున్నా కూడా మనం అంతరిక్షంలోకి ఎగిరిపోకపోవడం దీనివల్లే. భూమి నిరంతర చలనంలో ఉన్నప్పటికీ, గురుత్వ బలం అన్ని పదార్థాలను ఒక సమగ్ర వ్యవస్థగా బంధించి ఉంచుతుంది.

గురుత్వాకర్షణ మరో ముఖ్యమైన పాత్ర కేంద్రాభిముఖ బలంగా పనిచేయడమే. సాధారణంగా మనం గురుత్వాన్ని కిందికి లాగే శక్తిగా మాత్రమే ఊహిస్తాం. కానీ వాస్తవానికి అదే శక్తి చంద్రుడిని భూమి చుట్టూ కక్ష్యలో ఉంచుతోంది. అలాగే భూమిని సూర్యుని చుట్టూ తిరిగేలా చేస్తోంది. ఒక వస్తువు వృత్తాకార మార్గంలో కదలాలంటే దానిని లోపలికి లాగే కేంద్రాభిముఖ బలం అవసరం. ఖగోళ స్థాయిలో ఈ పాత్రను గురుత్వాకర్షణ నిర్వహిస్తుంది. ఈ బలం లేకపోతే గ్రహాలు తమ మార్గాన్ని విడిచి అంతరిక్షంలోకి దూసుకుపోయేవి. గ్రహాల చలనం గురుత్వాకర్షణ ఆధీనంలోనే జరుగుతుంది. భూమి సూర్యుని చుట్టూ ఒక పరిభ్రమణం పూర్తి చేయడానికి సుమారు ఒక సంవత్సరం పడుతుంది. ఈ సమయంలో భూమి దాదాపు ఒక బిలియన్ కిలోమీటర్ల దూరాన్ని తన కక్ష్య మార్గంలో ప్రయాణిస్తుంది. ఇది మనకు ఊహకు అందని విస్తారమైన దూరం. అయినా ఈ ప్రయాణం ఎంతో క్రమబద్ధంగా, ఖచ్చితమైన నియమాలకు లోబడి సాగుతుంది. దీనికి సూర్యుడు, భూమి మధ్య ఉన్న గురుత్వాకర్షణ సమతుల్యత ప్రధాన కారణాలు. భూమి వేగం కూడా ఈ చలనాన్ని అర్థం చేసుకునేందుకు కీలకం. భూమి సగటున గంటకు సుమారు 1,07,000 కిలోమీటర్ల వేగంతో సూర్యుని చుట్టూ తిరుగుతోంది. ఇది ఒక విమానం లేదా క్షిపణి వేగంతో పోలిస్తే అపారమైనది. అయినా మనకు ఆ వేగం అనుభూతి కావడం లేదు. కారణం మనం భూమితో పాటు అదే వేగంతో కదులుతున్నాం. ఒక సమాన వేగంతో కదిలే వ్యవస్థలో ఉన్నప్పుడు, ఆ చలనం అంతర్గతంగా ఉన్నవారికి స్పష్టంగా అనిపించదు. భూమిపై మన రోజువారీ జీవితంలో చలనాన్ని తగ్గించే ప్రధాన అంశం ఘర్షణ (ఫ్రిక్షన్). ఒక వస్తువు నేలపై కదిలితే గాలి ప్రతిఘటన లేదా ఉపరితల ఘర్షణ కారణంగా అది క్రమంగా ఆగిపోతుంది. కానీ అంతరిక్షంలో పరిస్థితి భిన్నంగా ఉంటుంది. గ్రహాలు ప్రయాణించే అంతరిక్షం దాదాపు శూన్య వాతావరణం (నియర్‌వ్యాక్యూమ్). అక్కడ ఘర్షణ లేదా ప్రతిఘటన దాదాపు ఉండదు. అందువల్ల ఒకసారి ప్రారంభమైన గ్రహాల చలనం నిరంతరంగా కొనసాగుతుంది. అదనపు శక్తి నిరంతరం సరఫరా చేయాల్సిన అవసరం లేకుండానే గ్రహాలు తమ కక్ష్యలో తిరుగుతుంటాయి. ఒకప్పుడు శాస్త్రవేత్తలు అంతరిక్షం పూర్తిగా ఖాళీ కాదని, ఈథర్ అనే అగోచర మాధ్యమం భూమి కదలికకు ప్రతిఘటన కలిగిస్తుందని భావించారు. అయితే 1887లో మైకెల్సన్–మార్లీ ప్రయోగం ఈ సిద్ధాంతాన్ని పూర్తిగా ఖండించింది. భూమి ఈథర్ అనే మాధ్యమం ద్వారా కదులుతుందని ఎలాంటి ఆధారాలు లేవని ఆ ప్రయోగం నిరూపించింది. దీని ద్వారా భూమి నిజంగా ఖాళీ అంతరిక్షంలోనే ప్రయాణిస్తోందని శాస్త్రం ధృవీకరించింది. అది మనలను భూమికి బంధించి ఉంచడమే కాకుండా, చంద్రుడు–భూమి, భూమి–సూర్యుడు వంటి ఖగోళ వ్యవస్థలను సమతుల్యంగా నడిపించే శక్తిగా పని చేస్తుంది. ఘర్షణలేని అంతరిక్షంలో, ఈ గురుత్వ సమతుల్యతే విశ్వంలోని క్రమబద్ధమైన గ్రహాల చలనానికి కారణమని శాస్త్రం స్పష్టంగా వివరిస్తుంది.

## విశ్వానికి ఆరంభం ఎక్కడ?



సాధారణంగా బిగ్ బ్యాంగ్ తర్వాతే విశ్వం ఉనికి మొదలైందనే ఒక సిద్ధాంతాన్ని ఇప్పటి వరకూ శాస్త్రవేత్తలు నమ్ముతున్నారు. అయితే, కొంతమంది భౌతిక శాస్త్రవేత్తలు కొత్తగా ఒక విపరీతమైన ఆలోచనను ప్రతిపాదిస్తున్నారు. 'క్వాంటమ్ టన్నెలింగ్' అనే ప్రక్రియ ద్వారా ఈ విశ్వ జననం జరిగి ఉండొచ్చనేది వారి అభిప్రాయం. సాధారణ భౌతికశాస్త్రంలో ఏదైనా జరగాలంటే ఒక అడ్డంకిని దాటాలి. కానీ క్వాంటమ్ స్థాయిలో అలా కాదు. అక్కడ ఏదో ఒకటి, దాటాల్సిన మార్గం లేకపోయినా, అకస్మాత్తుగా ఉనికిలోకి రావచ్చు. దీన్నే టన్నెలింగ్ అంటారు. ఇక్కడ కీలకమైన మలుపు ఏమిటంటే... క్వాంటమ్ ఫిజిక్స్‌లో ఏమీలేని స్థితి నిజంగా ఖాళీ కాదు. మనం ఊహించే శూన్యం మౌనంగా, నిశ్చలంగా ఉండదు. అది ఎప్పుడూ కదిలే అవకాశాలతో, తాత్కాలిక ఉనికితో నిండి ఉంటుంది. అంటే 'నథింగ్' కూడా ఒక రకమైన 'సమ్‌థింగ్' లాంటిదే. ఈ సిద్ధాంతాల ప్రకారం, స్థలం, కాలం కూడా ఇలాగే ఒక అత్యంత సూక్ష్మ క్వాంటమ్ స్థితి నుంచి టన్నెల్ అవుతూ ఉనికిలోకి వచ్చి ఉండవచ్చు. దీనికి ముందుగా పదార్థం ఉండాల్సిన అవసరం లేదు, స్థలం ఉండాల్సిన అవసరం కూడా లేదు. కాబట్టి, ఈ టన్నెల్ మాత్రమే విశ్వ సృష్టికి మూలమన్నది వారి వాదన. అయితే, ఇది ఇంకా పూర్తిగా నిరూపితమైన సిద్ధాంతం కాదు.... కేవలం ప్రతిపాదన మాత్రమే. అయితే, విశ్వం ఎందుకు ఉంది? అనే ప్రశ్నకు సమాధానం ఇవ్వడానికి ఈ ఆలోచన ఉపయోగపడవచ్చు. ఏదిఏమైనా పూర్తిగా ఏమీ లేదనే భావన సృష్టిలో అసలు లేనేలేదనేది వీరి అభిప్రాయం. ప్రతి చోటా ఏదో ఒకటి ఉంటుందని క్వాంటం సిద్ధాంతం పేర్కొంటున్న విషయాన్ని ఇక్కడ గుర్తుచేసుకోవాలి.

# కార్మికుల డిమాండ్లు నెరవేర్చకుంటే ఉద్యమం ఉధృతం

ఖమ్మంలో...




జీడిమెట్లలో ...




హనుమకొండలో ...




**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకుంటే మరొక ఉద్యమం తప్పదని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం జెఎసి ఆధ్వర్యంలో ఆర్‌టిసి కార్మికుడు కొలా శంకర్‌గౌడ్ మృతికి నిరసనగా సమ్మెలో మూడవ రోజు నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని బస్‌డిపో నుండి పాతబస్టాండ్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత బస్టాండ్ సెంటర్‌లో మానవహారం చేపట్టి రెండు నిమిషాలు పాటు మౌనం పాటించి శంకర్‌గౌడ్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికులు ఇప్పటికీ ఇప్పుడే అనుకొని సమ్మె నోటీస్ ఇవ్వలేదని 41 రోజుల క్రితమే సమ్మె నోటిసు ఇచ్చారన్నారు. సమ్మె ప్రారంభానికి ముందు కార్మికుల సంఘాలతో చర్చలు జరిపిన మంత్రులు మరో నాలుగు వారాలు సమయం కావాలని కోరడం సమజసం కాదన్నారు. మీరు పెట్టిన డిమాండ్స్ కొత్తవేమి కాదని, గత మూడు సంవత్సరాల నుండి యాజమాన్యం, కార్మికులు, ప్రజల మధ్య నలుగుతున్న డిమాండ్లేనన్నారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వంలో ఆర్‌టిసిని విలీనం చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా దొంగ దారిన బస్సులను నడపాలని చూసినప్పుడు కొంతమంది కార్మికులు నిస్సహాయతకు గురై ఆత్మహత్యయత్నానికి పాల్పడారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు ఎవరు నిరాశకు గురి కావద్దని, పోరాడి సాధించుకోవాలని ఆత్మహత్యలు పరిష్కారం కాదని అన్నారు. గతంలో 56 రోజుల పాటు జరిగిన సమ్మెలో మొదటి రోజు నుండి చివరి వరకు సిపిఐ కీలక పాత్ర పోషించిదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఏడు రోజుల పాటు అమరణ నిరాహర దీక్ష చేసి సమస్యకు పరిష్కారం చూపారన్నారు. ఈ సమ్మెలో కూడా సిపిఐ మద్దతు ఉంటుందని, కార్మికులకు ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాదె లక్ష్మీ నారాయణ, తోట రామాంజనేయులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, పగడాల మల్లేష్, పిడిఎస్‌యూ జిల్లా నాయకులు మస్తాన్, జెఎసి చైర్మన్ పిల్లి రమేష్, కన్వీనర్లు బిఎస్ రెడ్డి, ఎన్ నాగయ్య, ఎంఆర్‌నాథ్, ఎల్‌ఆర్‌కె రావు, పిట్టల సుధాకర్, నాయకులు అనిత, బేతంపూడి బుచ్చిబాబు, రామలక్ష్మీ, సుజాత, మాధవరావు, రోషయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఆర్‌టిసి కార్మికుల సమ్మెకు మద్దతుగా జీడిమెట్లలో భారీ ర్యాలీ

ఆర్‌టిసి కార్మికుల సమ్మెకు మద్దతుగా సిఐటియు, ఎఐటియుసి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం జీడిమెట్లలో భారీ ర్యాలీ నిర్వహించారు. షాపూర్‌నగర్ రైతు బజార్ నుంచి జీడిమెట్ల డిపో వరకు సాగిన ఈ ర్యాలీలో పారిశ్రామిక కార్మికులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్, సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్‌లు మాట్లాడుతూ ఈ నెల 22నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌టిసి కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మెకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడం, ఖాళీ ఉద్యోగాల భర్తీ, కార్మికుల బకాయిల చెల్లింపు, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించడం, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయడం వంటి 32 డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమ్మె కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనికి ప్రభుత్వం తక్షణ పరిష్కారం చూపాలని కోరుతూ, కార్మికుల డిమాండ్లను సానుకూలంగా పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పసుల అంజయ్య, టీవీఎస్ రమణ, ఎఐటియుసి నాయకులు ఉమా మహేస్, స్వామి, హరినాథ్, నరసింహారెడ్డి, కె.శ్రీను, ఆంజనేయులు, మల్లారెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

### సమ్మెకు సిపిఐ, ఎఐటియుసి సంఘీభావం

రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌టిసి కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరుకున్న సందర్భంగా, హనుమకొండ బస్టాండ్‌లో కార్మికులు జరుపుతున్న నిరసన కార్యక్రమానికి సిపిఐ, ఎఐటియుసి నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రే భిక్షపతి,రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌టిసి కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్నారని తెలిపారు. ఈ సమ్మెకు కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు మాత్రమే కాకుండా ప్రజల నుండి కూడా విస్తృత మద్దతు లభిస్తోందని వారు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, కార్మికుల న్యాయమైన డిమాండ్లపై చర్చలు జరిపి, సమస్యకు పరిష్కారం కనుగొనాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మె కార్యక్రమంలో జెఎసి నాయకులు వేముల కుమార్ స్వామి, యాకస్వామి, ఎన్.ఎం.యు, రీజనల్ సెక్రెటరీ, టి.ఎం.యూ. రీజనల్ సెక్రెటరీ జితేందర్ రెడ్డి, మహిళా కండక్టర్లు, డ్రైవర్స్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### కార్మికుల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి : సిహెచ్ రాజారెడ్డి

ఆర్‌టిసి కార్మికుల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డిలు డిమాండ్ చేశారు. శుక్రవారం జనగామలో ఆర్‌టిసి కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతూ సమ్మెలో పాల్గొన్నారు. అనంతరం డిపో ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సిహెచ్ రాజారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామని, కార్మికుల వేతనాలు పెంచుతామని, యూనియన్లను పునరుద్ధరిస్తామని హామి ఇచ్చిన ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఆర్‌టిసి కార్మికులు శంకర్‌గౌడ్ ఆత్మహత్య చేసుకున్నాడని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి కార్మికులతో పాటు బిఆర్‌ఎస్ నాయకులు ఊడుగుల కిష్టయ్య, గజ్జెల నర్సిరెడ్డి, బాల్నె సిద్దిలింగం, పోకల జమున, చేవెళ్లి మదు, కౌన్సిలర్ సువార్త, సిపిఎం నాయకులు చొప్పరి సోమయ్య, అది సాయన్న, ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు గద్దల కిషోర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

### కార్మికులు ఆధైర్యపడి ఆత్మహత్యలు చేసుకోవద్దు: యానాల

ఆర్‌టిసి కార్మికులు ఆ ధైర్యపడి ఆత్మహత్యలు చేసుకోవద్దని తెగించి పోరాడి తమ హక్కులను సాధించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ఆర్‌టిసి కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం భువనగిరి పట్టణంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం పెరబోయిన మహేందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్‌టిసి ప్రభుత్వంలో విలీనం చేయాలని కార్మికులపై కక్షసాధింపు చర్యలను మానుకోవాలని ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సిపిఐ వారికి అండగా ఉంటుందని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, రాష్ట్ర రాష్ట్ర సమితి సభ్యులు గోద శ్రీరాములు, కళ్లెం కృష్ణ, ఎండి ఇమ్రాన్, బండి జంగమ్మ, బచ్చనగోని గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

### మహబూబాబాద్ ఎన్‌టిఆర్ స్టేడియం నుంచి....

మూడవరోజు ఆర్‌టిసి సమ్మె సందర్భంగా గురువారం సిపిఐ ఆధ్వర్యంలో మహబూబాబాద్ ఎన్‌టిఆర్ స్టేడియం నుంచి ఆర్‌టిసి కార్మికులతో ర్యాలీలో పాల్గొని అనంతరం ఆర్‌టిసి డిపో వద్ద జరిగిన సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారధి ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఆర్‌టిసి కార్మికుల సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించి సమ్మె విరమింపజేసేలా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం నర్సంపేట బస్టాండ్‌లో ఆత్మహత్య చేసుకున్న శంకర్ గౌడ్ చిత్రపటానికి ఘనంగా పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి జెఎసి నాయకులు, వివిధ పార్టీల ప్రజా సంఘాల నాయకులు ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రేసపల్లి నవీన్, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం :వామపక్ష పార్టీలు

ఆర్‌టిసి కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకే ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో సిపిఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్‌టిసి సమ్మెకు మద్దతుగా రౌండ్ టేబుల్ సమావేశాన్ని వివిధ వామపక్ష పార్టీలతో నిర్వహించారు. రౌండ్ టేబుల్ సమావేశాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి పి. సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఐ, సిపిఐఎం, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి, సిపిఐఎం ఎల్ మాస్ లైన్, బిఎల్‌పి, ఎంసిపిఐ, ఆర్‌ఎస్‌పి, జమాతే ఇస్లామి హింద్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటిన ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయకపోగా, గత ప్రభుత్వంలో కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలను చెల్లించడం లేదన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా వెంటనే ఆర్‌టిసి కార్మిక నాయకులతో చర్చించి సమస్యలు పరిస్కరించి సమ్మెను విరమింపజేయాలన్నారు. లేనిచో ఆర్‌టిసి సమ్మెలో వామపక్ష ప్రజా సంఘాలు ప్రత్యక్షంగా పాల్గొని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో ఆర్‌టిసి జేఏసి నాయకులు శ్రీనివాస్, సంజీవ్, వామపక్ష పార్టీల నాయకులు వై.ఓమయ్య, ఏ. రమేష్ బాబు, పెద్ది వెంకట్‌రాములు, ఆకుల పాపయ్య, వరదయ్య, నరేందర్, ఎం.సుధాకర్, దండి వెంకట్, శ్రీనివాస్, రాములు, అనిల్, హుస్సేన్, కోయిడి నర్సింలు, రఘురాం, ఫిరోజ్ అలీ, సురేష్, గణేష్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జనగామలో...




భువనగిరి పట్టణంలో...




మహబూబాబాద్‌లో...




నిజామాబాద్‌లో...



## 22 కొనుగోలు కేంద్రాలు మంజూరు

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడె నియోజకవర్గానికి రికార్డు స్థాయిలో 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంజూరయ్యాయని, ఇది నియోజకవర్గ రైతాంగానికి ఎంతో శుభ పరిణామం అని ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల మంజూరీపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో మండలానికి కేవలం ఒకట్రెండు కేంద్రాలు మాత్రమే ఉండేవని, కానీ తమ ప్రత్యేక కృషితో ఈసారి ఏకంగా 22 కేంద్రాలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. సుజాతనగర్ మండలానికి 4 కేంద్రాలు, చుంచుపల్లి మండలానికి 4, లక్ష్మీదేవిపల్లి మండలానికి 5, పాల్వంచ మండలానికి 9 కేంద్రాలు ఏర్పాటు కానున్నాయన్నారు. రైతులు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, పంటను సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లే అవసరం లేకుండా గ్రామాల సమీపంలో కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. తద్వారా రైతులకు రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా దళారుల ప్రమేయం లేకుండా మద్దతు ధర నేరుగా వారి ఖాతాల్లోనే జమ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అత్యధిక సంఖ్యలో కేంద్రాలు రావడం వల్ల ధాన్యం సేకరణ ప్రక్రియ వేగవంతం అవుతుందని, ఎక్కడా జాప్యం లేకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నియోజకవర్గ అభివృద్ధికి రైతుల మేలుకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులోక తేవాలని ఆదేశించారు.



## ప్రజా దర్బార్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఏర్పాట్లను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్, డిపిఒ, జడ్‌పి సిఇఒ

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన సొంత నియోజకవర్గంలో శనివారం నుంచి ప్రజాదర్బార్ ను నిర్వహించనున్నారు. నేలకొండపల్లి మండలం లోని రాయగూడెం లో తొలి కార్యక్రమం ను లాంచనంగా ప్రారంభించనున్నారు. ప్రజల ముంగిట కు అన్ని శాఖల అధికారులను తీసుకొస్తున్నారు. ఎటువంటి ప్రజా సమస్యకైనా తక్షణ పరిష్కారం చేసేందుకు శాఖల వారీగా జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులను ఆహ్వానిస్తున్నారు. రాయగూడెం క్లస్టర్ లో ఆజయ్ తండా, రాయగూడెం, చెరువుమాధారం, మంగాపురంతండా, అప్పలనరసింహాపురం, బుద్దారం, కట్టుకాచారాం, కొంగర, రాజారాంపేట, బైరవునిపల్లి పంచాయతీ లకు సంబంధించిన ప్రజలు ఈప్రజా దర్బార్ లో పాల్గొనున్నారు. రెవిన్యూ భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల విజ్ఞప్తులు, కొత్త రేషన్ కార్డులు, స్థానిక మౌలిక సదుపాయాల గురించి ఏ సమస్య కు సంబంధించినదైనా వినతి పత్రాలను స్వీకరించనున్నారు. ఏర్పాట్లు ను జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, సీఈవో శ్రీనివాసరెడ్డి లు పరిశీలించారు. తొలుత రాయగూడెం లో దర్బార్ జరిగే ప్రదేశంను పరిశీలించారు. ఏర్పాట్లు గురించి చర్చించారు. వసతులు గురించి ఆరా తీశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలనిఆదేశించారు. వేసవి తీవ్రత ఉన్నందున్న మజ్జిగ, చల్లని తాగునీటిని అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. దర్బార్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాం ప్రసాద్, ఎంపీడీవో యర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## బిఎస్ఎన్ఎల్ సేవలు మెరుగుపర్చాలి

టిఎసి సమావేశంలో సభ్యులు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో బిఎస్ఎన్ఎల్ సిగ్నల్ సమస్యలను తక్షణమే పరిష్కరించి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ (టిఎసి) సభ్యులు బిఎస్ఎన్ఎల్ అధికారులను కోరారు. శుక్రవారం ఖమ్మంలోని ఎంపి క్యాంపు కార్యాలయంలో టిఎసి సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న నెట్‌వర్క్ ఇబ్బందులపై కమిటీ సభ్యులు అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, హిమామ్‌బాయ్, రంజిత్ నాయక్, మచ్చా రామారావు, సత్యనారాయణ రెడ్డి తదితరులు పలు కీలక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కూసుమంచి ప్రాంతంలో ఇంటర్ నెట్ సేవలు అత్యంత పేలవంగా ఉన్నాయని ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలన్నారు. వినియోగదారుల కోసం బిఎస్ఎన్ఎల్ ఖమ్మం కార్యాలయంలో సిమ్ కార్డులను నిరంతరం అందుబాటులో ఉంచాలని కోరారు. బోనకల్, చింతకాని మండలాల్లో నెట్‌వర్క్ పరిధిని విస్తరించేందుకు నూతన టవర్లను ఏర్పాటు చేయాలన్నారు. గోవిందాపురం, వైరా, బ్రాహ్మణపల్లి, ఉప్పలమడక గ్రామాల్లో సిగ్నల్ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఖమ్మం రూరల్ మండలం కస్నాతండా, ఖమ్మం నగరంలోని ఇందిరా నగర్, గోశాల ప్రాంతాల్లో మెరుగైన సిగ్నల్ కోసం నూతన టవర్లను ఏర్పాటు చేయాలని సమావేశం తీర్మానించింది. టిఎసి సభ్యుల విజ్ఞప్తి మేరకై డిజిఎం రాజశేఖర్, ఏజిఎం లు స్పందిస్తూ సమస్య తీవ్రతను బట్టి ప్రాధాన్యత క్రమంలో అవసరమైన చోట కొత్త టవర్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి సూచనల మేరకు పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి సిగ్నల్, ఇంటర్‌నెట్ సేవలకు ఆటంకం కలుగకుండా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## కార్మికులకు అండగా ఉంటాం

ధర్నాలో పలు రాజకీయ పార్టీల నేతల హామీ

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఆర్టీసి కార్మికుల సమ్మెకు అండగా ఉంటామని పలు రాజకీయ పార్టీల నేతలు హామీ ఇచ్చారు. శుక్రవారం కొత్తగూడెం ఔట్‌గేట్ వద్ద జరిగిన నిరసన,ధర్నా కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, మాజీ మంత్రి, బిఆర్ఎస్ నాయకులు వనమా వెంకటేశ్వరరావు, న్యూడెమోక్రసి నేత ఆవునూరి మధు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య తదితరులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా పోతినేని మాట్లాడుతూ కార్మికుల పక్షన సిపిఎం ఉంటుందని, ఆర్టీసి కార్మికులతో చర్చలు జరిపి సమ్మె విరమించకుంటే గత పాలకులకు పట్టిన గతే పడుతుందని అన్నారు. కార్మికులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోని బిఆర్ఎస్ ప్రభుత్వం కార్మికుల ఆగ్రహానికి బలైందని గుర్తు చేశారు. మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్న కార్మికులను ఏడ్పించుకోవడం సరైంది కాదన్నారు.

# మినరల్ మాటున 'జనరల్'

అడ్డగోలు దోపిడీకి పాల్పడుతున్న వాటర్ పాంట్లు

నీటి శుద్ధి లేకుండా విక్రయాలు

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలం, ఏదులాపురంమున్సిపాలిటీలో మినరల్ వాటర్ పేరిట జనరల్ వాటర్ దందా యథేచ్ఛగా సాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఆర్వో వాటర్ ప్లాంట్ల యజమానులు అడ్డగోలు దోపిడీకి పాల్పడుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుభకార్యాలు, హోటళ్లు తదితర అవసరాలకు ఈ ప్లాంట్ల ద్వారా క్యాన్లలో నీటిని సరఫరా చేస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నట్ల సమాచారం. ముఖ్యంగా నీటి శుద్ధి విషయంలో పాటించాల్సిన నిబంధనలను పూర్తిగా విస్మరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎటువంటి ప్రమాణాలు పాటించకుండా మినరల్ వాటర్ పేరిట కెమికల్స్ కలిపిన నీటిని విక్రయిస్తున్నారని స్థానికులు అంటున్నారు. దీని వలన ప్రజలు మోకాళ్ల నొప్పులు సహా పలు అనారోగ్య సమస్యలకు గురవుతుండటం ఆందోళన కలిగిస్తుంది. ప్రస్తుతం ఎండాకాలం కావడంతో ఈ దందా తారస్థాయిలో కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తక్షణమే అధికారులు స్పందించి అక్రమంగా నడుస్తున్న వాటర్ ప్లాంట్లపై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**అపరిశుభ్రంగా క్యాన్లు**

మినరల్‌వాటర్ పేరుతో శుద్ధి చేయని నీటిని క్యాన్లలో నింపి ప్రజలకు అంటగడుతున్నారు. ఇవి ఫిల్టర్ చేసినవని భావించి ప్రజలు సైతం కొనుగోలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం 180రోజుల వినియోగించిన తర్వాత తిరిగి ఆ క్యాన్లను వాడకూడదు. అయినప్పటికీ వినియోగిస్తుండటంతో క్యాన్ల అడుగు భాగంలో నాచు పేరుకుపోతోంది. ఆ క్యాన్లలోనే నీటిని నింపి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. అంతేకాకుండా ప్లాంట్ల వద్ద పరిశుభ్రత లోపించడం రోగాలకు కారణం అవుతున్నట్లు తెలిసింది. ఇలా ఆ నీరు తాగితే పిల్లలు, పెద్దలకు మోకాళ్ల నొప్పులు, ఎముకలు సంబంధిత వ్యాధులు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. వేసవిలో నీటి డిమాండ్‌ను ఆసరా చేసుకొని వ్యాపారులు లాభాల వేటలో ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్నారు. నీటిని ప్యూరిపై చేసే పేరుతో దందా కొనసాగిస్తున్నప్పటికీ ఎక్కడా నిబంధనలు పాటించడం లేదని తెలుస్తోంది.

**వాల్టా చట్టానికి తూట్లు...**

వాల్టా చట్టం ప్రకారం బోరు వేసేందుకు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అటు రెవెన్యూ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్స్ తీసుకోవాలి. వీటితో పాటు ఆహార భద్రత, కాలుష్య నియంత్రణ మండలి, గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ అనుమతి పొందాలి. కానీ ఇవేమి పట్టించుకోకుండానే వాటర్‌ప్లాంట్లను ఏర్పాటు చేసి శుద్ధ జలం పేరిట అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ప్రతీ గ్రామం, మున్సిపాలిటీలో పుట్టగొడుగుల్లా ఒక్క నీటి ప్లాంటు ఏర్పాటు చేసి అడ్డగోలు వ్యాపారం చేస్తున్నారు. ఆర్వో ప్లాంట్ల ద్వారా నీటిని క్యాన్లలో నింపి ఇంటింటికి పంపిణీ చేస్తున్నారనే వాదనలున్నాయి. వాస్తవానికి వీటి ద్వారా వాటర్‌ను క్యాన్లలో పంపిణీ చేయడం నిబంధనలకు విరుద్ధమైనప్పటికీ కొనసాగిస్తున్నారు. తనిఖీలు చేయాల్సిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అధికారులు మామూలుగా తీసుకుంటూ పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి.

**చోద్యం చూస్తున్న అధికారులు**

అనుమతులు లేకుండా తాగునీటిని శుద్ధిచేసే ప్లాంట్లు ఏర్పాటు ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇలా అక్రమంగా ఏర్పాటు చేస్తున్న ప్లాంట్లవైపు అధికారులు కన్నెత్తి చూడటం లేదు. ఈ నేపథ్యంలో ప్లాంట్ల నిర్వాహకులు కోట్లాది రూపాయల దందా చేస్తూ నాణ్యత ప్రమాణాలు ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. చిన్న షెడ్లు, ఇళ్లలోనే యంత్రాలు పెట్టుకోని నీటిని క్యాన్లలో నింపుతున్నారు. అవసరమైన ఫిల్టర్ మార్పులు, ల్యాబ్ పరీక్షలు శుద్ధి ప్రక్రియలు పాటించడం లేదు. ఒక ల్యాబ్ టెక్నిషన్ ఉండి జనరల్ వాటర్‌ను మినరల్‌గా మారడానికి ఎంత మోతాదు కెమికల్ వినియోగించాలో చూడాలి. కానీ ప్లాంట్ల యజమానులే ఈ అవతారం ఎత్తి నీటి శుద్ధి లేకుండానే నీటిని విక్రయిస్తున్నారు. అలాగే ఎక్కువ మోతాదులో కెమికల్స్ కలుపుతుండటంతో నీరు చేదుగా పలు అనారోగ్యాలకు నిలవుగా మారుతోంది. నిబంధనల ప్రకారం ప్రతీ మినరల్ వాటర్ ప్లాంట్ తప్పనిసరిగా తరచుగా నీటి నమూనాలను ల్యాబ్‌కు పంపించి పరీక్షలు చేయించుకోవాలి. ఫిల్టర్లు, మెంబ్రేన్లు, యువీ లైట్లు వంటి పరికరాలకు అనుగుణంగా మార్చాలి. కానీ చాల ప్లాంట్లలో ఇవేమి పాటించడం లేదని తెలుస్తోంది. కొన్ని చోట్ల నెలల తరబడి ఒకే ఫిల్టర్ వాడుతున్నారని, నీటి నాణ్యత పూర్తిగా పడిపోయినా సరే క్యాన్లలో నీరు నింపి సరఫరా చేస్తున్నారు.

**అనుమతులు పరిశీలిస్తాం, తహసీల్దార్, విజయేందర్‌రెడ్డి**



మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్వహనకు ఎటువంటి అనుమతలు ఉన్నాయో పరిశీలిస్తాను. ఈ విషయంపై జిపిల ద్వారా తెలుసుకుంటాను. ఒకవేళ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్లాంట్లపై చర్యలు తీసుకుంటాను.

**మా నుంచి ఎటువంటి పర్మిషన్లు లేవు : ఎంపిడిఒ, శ్రీదేవి**



మా పంచాయతీల నుంచి కేవలం ప్రభుత్వం ఇచ్చే సురక్షిత మంచినీటి పథకానికి మాత్రమే అనుమతి ఉంటుంది. అంతేకానీ ఆర్వోవాటర్ ప్లాంట్లకు ఎటువంటి అనుమతులు మేము ఇవ్వము. కార్యదర్శుల ద్వారా పరిశీలన జరిపించి చర్యలు తీసుకుంటాను నోటీసులిస్తాం

**కమిషనర్, మున్వర్‌అలీ**



అన్ని వాటర్ ప్లాంట్లకు మున్సిపాలిటీ నుంచి నోటీసులు ఇస్తాము. శానిటేషన్ లేకుంటే చర్యలు తీసుకుంటాను. ప్లాంట్లు తప్పకుండా నిబంధనలు పాటించాల్సిందే.



## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పంపిణీ చేశారు. శుక్రవారం ఖమ్మం బుర్హాన్‌పురంలోని తన క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తన సిఫారసు మేరకు 19 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 8.50 లక్షల విలువ గల చెక్కులను ఎంపి వద్దిరాజు రవిచంద్ర పంపిణీ చేశారు. మరో ఇద్దరికి ముందస్తు ఆపరేషన్ నిమిత్తం మంజూరైన నాలుగు లక్షల విలువైన ఎల్‌వోసి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పలు అనారోగ్య కారణాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొంది కోలుకున్న బాధితులను పరామర్శించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజ్, మధిర మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, మధిర మున్సిపల్ కౌన్సిలర్లు వెన్నంశెట్టి అప్పారావు, మధిర బిఆర్ఎస్ కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ యాసా రామారావు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లేడిబోయిన గోపాలరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**రఘునాథపాలెం :** మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కాపా ఆదినారాయణ, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు లు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్ధిదారులకు మంజూరైన రూ.2,98,500 విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. శ్రీరామనేని అన్నపూర్ణ రూ. 45వేలు, శాఖమూడి సుధాకర్ రూ.13,500, బానోత్ బాబు రూ. 18వేలు, చంద్ర రమేష్ రూ. 52,500, సుజాత నర్రా రూ. 24,000, పోతగాని ఉదయ్ రూ.60,000, మూడ్ సైదమ్మ రూ. 19,000, బానోత్ మంగీ రూ.60,000 మొగిలిపాలెపు బ్రహ్మం రూ. 16,500 చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మూడు శంకర్, నాయకులు కిలారు వెంకటరమణ, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు బానోత్ కిషోర్, బోలగాని రామలింగం, పరుచూరి శ్రీను, యడ్లపల్లి నాదం తదితరులు పాల్గొన్నారు.

## రైతు వ్యతిరేక విధానాలపై పోరాడాలి

మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు చేయటంలో విఫలం

అమెరికాతో ఒప్పందాలతో రైతాంగానికి తీవ్ర నష్టం

ఎఐకెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ




**ప్రజాపక్షం/పాల్వంచ :** కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రైతులను సమీకరించి, ఏకం చేసి పోరాటం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం(ఎఐకెఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ అన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశం పాల్వంచ సిపిఐ కార్యాలయం చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో నాయకులు సలిగంటి శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమెరికాతో చేసుకొన్న వాణిజ్య ఒప్పందాలు దేశ రైతాంగాన్ని తీవ్ర నష్టం చేసే విధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మనం పండించిన పంటలను ఎగుమతి చేయాలంటే అమెరికా, ఐరోపా తదితర దేశాలకు 18 శాతం పన్నులు చెల్లించాలి. అదే అమెరికా ఎలాంటి సుంకం లేకుండా మన దేశానికి దిగుమతి చేసుకొని మార్కెట్ చేసుకోవచ్చని ఫిబ్రవరి 28వ తేదీన ఒప్పంద పత్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంతకం చేశారని ఆరోపించారు. ఇలాంటి రైతాంగ వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో సుమారుగా 12 లక్షల ఎకరాలకు పైగా మొక్కజొన్న పంటను సాగుచేస్తున్నారని తెలిపారు. ఎకరాకు 30 క్వింటాళ్ళకు పైగా దిగుబడి వస్తుందన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం సగటున 26 క్వింటాళ్ళకు లెక్క గట్టి అందులో సగం పంటను మాత్రమే కొనుగోలు చేయటానికి మార్క్‌ఫెడ్ సంస్థకు రూ. 400 కోట్ల రుణం తీసుకోవటానికి అనుమతులు ఇచ్చిందన్నారు. కానీ నరేంద్ర మోదీ విధానాలతో ప్రవేటు వ్యాపారులకు ఎగుమతులపై ఖర్చు పెరిగి భారీ ఎత్తున నష్టం వస్తున్నదని పంటను కొనుగోలు చేయటానికి భయపడుతున్నారని అన్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు వైఎస్ గిరి, రైతు సంఘం జిల్లా నాయకులు కమటం సురేష్, కొంగర అప్పారావు, వాడె లక్ష్మి, కట్ట నాగయ్య, కోడెరెక్కల రాజారావు, వజ్జా వాసు, కట్టం నాగేశ్వరరావు, లాల్ పాషా పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయకుండా కార్మికులను మోసం చేస్తున్న ప్రభుత్వం

డ్రైవర్ మృతికి నిరసనగా సిపిఐ మౌన ప్రదర్శన

మౌన ర్యాలీలో కండక్టర్ సొమ్మసిల్లి పడిపోవడంతో ఆందోళన



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** టీజి ఆర్టీసీ కార్మికుల సమ్మె గురువారం మూడో రోజుకు చేరింది. విలీన హామీ అమలులో ప్రభుత్వ జాప్యాన్ని నిరసిస్తూ ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ శంకర్ గౌడ్ మృతికి సంతాపంగా సిపిఐ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు పట్టణంలో మౌన ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీలో మహిళా కండక్టర్ సొమ్మసిల్లి పడిపోవడంతో కార్మికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చి 30 నెలలు గడిచినా అమలు చేయకుండా కార్మికులను మోసం చేస్తున్నారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ, ఎఐటియుసి నాయకుడు నిమ్మటూరి రామకృష్ణ ప్రభుత్వంపై తీవ్రంగా ధ్వజమెత్తారు. ఫ్రీ బస్ పథకాన్ని విజయవంతం చేసిన ఆర్టీసీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిగణలోకి తీసుకోకపోవడం హాస్యాస్పదమని దండు ఆదినారాయణ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలు నీటి మూటలుగా మిగిలాయన్నారు. గవర్నర్ ఆమోదం పొందిన విలీన ప్రక్రియకు తేదీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

**అంబులెన్స్‌ను ఢీకొట్టిన ఆర్‌టిసి బస్సు..**

ఇదిలా ఉండగా, గురువారం విధులకు హాజరైన ఓ ప్రైవేట్ డ్రైవర్ బస్టాండ్‌లో బస్సును రివర్స్ చేస్తూ ఆగి ఉన్న అంబులెన్స్‌ను ఢీకొట్టాడు. దీంతో బస్టాండ్ ఆవరణలో ఒక్కసారిగా అలజడి మొదలైంది. పెద్ద ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు, కార్మికులు ఊపిరి పీల్చుకున్నారు. సిపిఐ నాయకులు తడికమళ్ళ యోబు, పిడిఎస్‌యూ నాయకులు శరత్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జాజిరి శ్రీనివాస్, జెఎసి ఛైర్మన్ జి.మల్లికార్జున్,వైస్ ఛైర్మన్ రాంబాబు, కన్వీనర్ కేవిస్ రావు, కో కన్వీనర్లు సతీష్, రాఘవులు, దొరబాబు, కమిటీ సభ్యులుడి కృష్ణ, జిఎంకే రావు, ముత్తయ్య, భూషణం, జానకి, ఫుడ్ కమిటీ సభ్యులు ఎన్ ఎన్ కుమార్, ఎస్ ఎస్ రావు పాల్గొన్నారు.



## పోషణ పక్వాడలో విశిష్ట ప్రతిభ

బూర్గంపాడు సిడిపిఒ రేవతికి జిల్లా స్థాయి అవార్డు

అదనపు కలెక్టర్ విద్యా చందన చేతుల మీదుగా పురస్కారం

**ప్రజాపక్షం/బూర్గంపాడు :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సంవత్సరం నిర్వహించే 15 రోజుల పోషణ పక్వాడ కార్యక్రమంలో బూర్గంపాడు మండల అంగన్వాడీ విభాగం విశిష్ట ప్రతిభ కనబర్చింది. కార్యక్రమాల అమలు మాత్రమే కాకుండా, వాటి వివరాలను సమయానికి ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో మెరుగైన పనితీరు ప్రదర్శించినందుకు బూర్గంపాడు ప్రాజెక్ట్ ఆఫీసర్(సిడిపిఒ)రేవతి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐడిఒసిలో జిల్లా అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనీనా చేతుల మీదుగా రేవతికి అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సిడిపిఒ రేవతి మాట్లాడుతూ పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా నిర్వహించిన పోషణ అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య పరీక్షలు, గర్భిణీ స్త్రీలు, చిన్నారుల సంక్షేమానికి సంబంధించిన చైతన్య కార్యక్రమాలను సమయానికి డిజిటల్ వేదికల్లో నమోదు చేయడం వల్లే ఈ గుర్తింపు లభించింది. అనంతరం అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనీనా మాట్లాడుతూ అంగన్వాడీ వ్యవస్థను డిజిటల్ వైపు మళ్లించడం వల్ల సేవల పర్యవేక్షణ సులభతరం అవుతుందని, బూర్గంపాడు టీమ్ చేసిన కృషి ఇతర మండలాలకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# పండిన పంటను కొనే దిక్కేది?

కలెక్టరేట్ ఎదుట బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు మహా ధర్నా

పాల్గొన్న మాజీ మంత్రి పువ్వాడ, ఎంపి వద్దిరాజు, ఎంఎల్‌సి తాతా మధు




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రైతును రాజులా చూసుకుంది కెసిఆర్ ప్రభుత్వం మాత్రమేనని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్న, వరి పంటలకు మద్ధతు ధర కల్పించి కొనే దిక్కులేకుండాపోయిందని ఆయన ఆరోపించారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు మహాధర్నా నిర్వహించారు.ఈ ధర్నాలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌సి తాతా మధుసూదన్, మాజీ ఎంఎల్‌ఎలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ధర్నాను ఉద్దేశించి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌సి తాతా మధుసూదన్ లు మాట్లాడుతూ పదేళ్ల కేసిఆర్ పాలనలో ఏ ఒక్క రైతు ఇబ్బందులు పడలేదని యూరియా కోసం తిప్పలు పడలేదన్నారు. కరోనా వంటి సమయంలో కూడా రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రైతులకు కష్టాలు ఎదురయ్యాయన్నారు. యూరియా కోసం తిప్పలు పడ్డారని షాపుల్లో లేని యూరియా యాప్‌లో ఎలా వస్తుందని ప్రశ్నించారు. కరెంటు ఎప్పుడు వస్తుందో పోతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. కేసిఆర్ హయాంలో రైతులకు స్వర్ణయుగంలా గడిచిందన్నారు. రైతుబంధు పది రోజుల్లో అందరి ఖాతాల్లో వేసిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. రైతుభరోసా, రైతుభీమా వంటి పథకాలను అమలు చేసిందన్నారు. కాంగ్రెస్ రైతుభరోసా నిధులు ఎకరానికి ఆరువేలు మొదటి దఫా, రెండవ దఫా అంటూ కాలయాపన చేస్తుందన్నారు. ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన పంటను కొనేందుకు దిక్కులేదన్నారు. కొనుగోలు కేంద్రాలు లేక రైతులు దళారులను నమ్మి మోసపోతున్నారన్నారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా కూడా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మొక్కజొన్న పంటను కొనుగోలు చేయడంతో పాటు వరి ధాన్యానికి మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయాలన్నారు. లేని పక్షంలో రైతులతో కలిసి ఉద్యమిస్తామన్నారు. ధర్నా అనంతరం బిఆర్ఎస్ శ్రేణులు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. అనంతరం అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్‌రాజ్, డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు ఆర్‌జెసి కృష్ణ, బచ్చు విజయ్‌కుమార్, పగడాల నాగరాజు, అజ్మీర వీరునాయక్, నాయకులు బొమ్మెర రామ్మూర్తి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోళ్లలో గందరగోళం



ప్రజాపక్షం/నెక్కొండ:వరంగల్ జిల్లా నెక్కొండ మండలం కేంద్రంలో రైతుల ఆవేదన రోడ్డెక్కింది. తాము పండించిన మొక్కజొన్నను తక్షణం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు మార్కెట్ ముందు రోడ్డుపై బైఠాయించడంతో రాకపోకలు స్తంభించాయి. నర్సంపేట, గూడూరు, సూరిపల్లి, లింగగిరి, నాగారం ప్రాంతాల నుండి నెక్కొండకు వచ్చే రహదారులు పూర్తిగా మూసుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మార్కెట్ కమిటీ పిఏసిఎస్ నిర్లక్ష్యం, సమన్వయం లోపం కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని రైతులు మండిపడుతున్నారు. పంట కొనుగోళ్లలో ఆలస్యం, కనీస సదుపాయాల లేమి, అధికారుల నిర్లిప్త వైఖరి రైతులను ఆందోళనకు దారి తీసిందని విమర్శించారు. తక్షణం మొక్కజొన్న కొనుగోళ్లు ప్రారంభించి రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని రైతులు హెచ్చరించారు. మార్కెట్ కమిటీ, పిఏసిఎస్ వైఫల్యంతో రైతులు, ప్రజలు ఒకేసారి ఇబ్బందులు పడడం పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చెప్పకనే చెబుతోంది.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

ప్రజాపక్షం/పాలకుర్తి: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని పాలకుర్తి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు అపర్ణ అన్నారు. శుక్రవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు మండలంలోని వ్యవసాయ ఇన్‌పుట్ డీలర్ల దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ బృందం ఆకస్మికంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఇన్‌పుట్లు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని డీలర్లకు ఆదేశించారు. ప్రతీ రైతుకు విక్రయించినపుడు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను ఎంఆర్‌పి ధరలకే విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ముత్తిరెడ్డి వెంకటేష్, సంకటబోయిన మహేష్ పాల్గొన్నారు.

## ఆర్‌టిసి సమ్మెపై ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడాలి



ప్రజాపక్షం/పరకాల : తెలంగాణ ప్రభుత్వంఆర్‌టిసికార్మికులు చేస్తున్న సమ్మెపై నిర్లక్ష్యాన్ని వీడి కార్మికులతో వెంటనే చర్చలు జరిపి వారి సమస్యకు పరిష్కారాన్ని చూపించాలని పరకాల నియోజకవర్గ సిపిఐ ఇన్ చార్జ్ మంద సదాలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారంఆర్‌టిసికార్మికులు చేస్తున్న మూడోరోజు కార్యక్రమంలో భాగంగా పరకాల బస్ డిపో వద్ద కార్మికుల శిబిరాన్ని సందర్శించి ఆమె మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రజలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే బాధ్యత గల కార్మికులుగా ఆర్‌టిసి కార్మికులు పనిచేస్తున్నారని ఆమె వారి సేవలను కొనియాడారు. అత్యంత తక్కువ వేతనాలు కలిగి అంకితభావంతో నిరంతరం కష్టపడి పనిచేస్తున్న ఆర్‌టిసికార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రభుత్వం అప్పటి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసే బాధ్యతను నెరవేర్చాలన్నారు. అదేవిధంగా ఉద్యోగ విరమణ డబ్బులు బకాయిలు వెంటనే చెల్లించడంతోపాటుగా ఆర్‌టిసిలో యూనియన్లకు పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. పరిష్కరించగలిగిన హామీలను విషయాలను గుర్తు పెట్టుకొని రాజకీయ పార్టీలు హామీలు ఇవ్వాలని ఇచ్చిన హామీలను నెరవేర్చని పార్టీల గుర్తింపులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి దుప్పటి సాంబయ్య, మహిళా కార్యదర్శి ఉమా తోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆర్‌టిసికార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హౌస్ అరెస్ట్



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : హనుమకొండ రాంనగర్ లోని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నివాసంలోఆర్‌టిసి డ్రైవర్ శంకర్ గౌడ్ కు నివాళులు అర్పించడానికి నర్సంపేట మండలం ముత్తోజిపేట గ్రామానికి వెళ్తుండగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తో పాటు గా మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసులు రెండున్నర సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌టిసి కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా మోసం చేసిందని,శంకర్ గౌడ్ హాస్పిటల్ లో చికిత్స పడుతుంటే పొన్నం ప్రభాకర్ ఐనా వచ్చి పరామర్శిస్తాడు అనుకున్నామని, కెసిఆర్, బిఆర్‌ఎస్ పార్టీ ఆర్ టి సి కార్మికులకు అండగా ఉంటుందని అన్నారు.బిఆర్‌ఎస్ నాయకులను అక్రమంగా నిర్బంధించారని,రేవంత్ రెడ్డి, ప్రభుత్వంపై హత్య కేసు నమోదు చేయాలని అన్నారు.శంకర్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్తుంటే బిఆర్‌ఎస్ నాయకులను అక్రమంగా హౌస్ అరెస్ట్ చేస్తున్నారని అన్నారు. కార్మికుల హక్కుల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్నారని, శంకర్ గౌడ్ కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. శంకర్ గౌడ్ ఆత్మహత్య ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని అన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ప్రజాపక్షం/ములుగు:ములుగు మండలం బరిగలానిపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇంచర్ల గ్రామ సర్పంచ్ ముస్లిశ్నిపెల్లి కుమార్ గౌడ్, బరిగలాని పల్లి సర్పంచ్ వీరగోని రాజేందర్ ముదిరాజ్‌లు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరిధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా మాత్రమే వరిధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని అన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ఏవైనా సమస్యలు ఉంటే 1800...425...00333 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్‌లు మామిడి అశోక్, బిట్ల కొమురయ్య, నాయకులు వేముల సమ్మిరెడ్డి, కాయిత కుమార స్వామి, మట్టేవాడ తిరుపతి, సిఈఓ సురేష్, యువకులు, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

# ఆర్‌టిసి సమ్మెతో జనజీవనం అస్తవ్యస్తం



ప్రజాపక్షం/భూపాలపల్లి:జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని ఆర్‌టిసి బస్సు డిపోలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆర్‌టిసి సమ్మెలో భాగంగా మూడవ రోజు అదే జోరు కొనసాగుతోంది. కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సమ్మె తీవ్ర ఉధృతానికి దారితీసింది. భూపాలపల్లి ఆర్టీసీ డిపోలో డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్న రవీందర్ అనే డ్రైవర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. హనుమకొండ జిల్లా వంగపహాడ్ కు చెందిన రవీందర్ తన ఇంటి వద్దనే గడ్డి మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా అడ్డుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేట డిపోకు చెందిన శంకర్ గౌడ్ కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య యత్నం చేయగా చికిత్సకు వెళుతున్న సమయంలోనే హైదరాబాదులో మరణించడం అట్లాగే రాష్ట్రవ్యాప్తంగా భద్రాచలం డిపోకు చెందిన లింగారెడ్డి, నల్గొండ జిల్లాకు చెందిన వెంకన్న ఇప్పటికే నలుగురు ఆర్‌టిసి కార్మికులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో రాష్ట్రంలో ఆర్‌టిసి సమ్మె ఉధృతంగా మారింది. మా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు ప్రాణాలైనా వదులుతాను గాని మా సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె విరమించేది లేదని జెఎసి సంఘాల నాయకులు తేల్చి చెబుతున్నారు.

**ఆర్‌టిసి సమ్మెతో జనజీవనం అస్తవ్యస్తం**

ఈ మూడు రోజులుగా ఆర్‌టిసి సమ్మెతో జనజీవనం స్తంభించిపోయి ప్రజా రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.ఒకపక్క ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు ఆర్‌టిసి సమ్మె సమ్మెతో ప్రజలు,వ్యాపారులు, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పేదవాడి గమ్యస్థానాన్ని క్షేమంగా ఇంటికి చేర్చే ఆర్‌టిసి రవాణా వ్యవస్థ స్తంభించడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు.

**భూపాలపల్లి డిపోలోనే నిలిన 87 బస్సులు**

ఆర్‌టిసి సమ్మెలో భాగంగా భూపాలపల్లి డిపోలో కార్మికుల సమ్మె కొనసాగుతోంది. 3వ రోజు సమ్మె సందర్భంగా డిపోలో ఉన్న 87 బస్సులు బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. డిపో పరిధిలో 320 వరకు కార్మికులు పనిచేస్తున్నారు. అందులో 22 అద్దె బస్సులు ఉండగా 52 మంది కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రయాణికులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది.

**ఆర్‌టిసి కార్మికులకు మద్దతు తెలిపిన టిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి**

ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చి వెంటనే పరిష్కరించాలని కోరుతూ భూపాలపల్లి ఆర్‌టిసి డిపో ముందు కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మెలో బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి పాల్గొని ఆర్‌టిసి కార్మికులకు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికులు చనిపోతున్న ప్రభుత్వానికి చలనం లేదన్నారు. ఆర్‌టిసికి చెల్లించవలసిన 3000 కోట్లను చెల్లించి ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి తక్షణమే పరిష్కారంచూపాలనిగండ్రజ్యోతిప్రభుత్వాన్నిడిమాండ్‌చే శారు.

**ఆర్‌టిసి డ్రైవర్ ఆత్మహత్యాయత్నం, దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే :మాజీ ఎమ్మెల్యే గండ్ర**

భూపాలపల్లి డిపోకు చెందిన ఆర్‌టిసి డ్రైవర్ వర్కోలు రవీందర్ గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రవీందర్‌ను మాజీఎమ్మెల్యేగండ్రవెంకటరమణా రెడ్డి, పరామర్శించా రు.

## పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న ప్రభుత్వం

### స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ప్రజాపక్షం/ధర్మసాగర్ : రైతును రాజును చేయాలి, వ్యవసాయాన్ని పండుగ చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశ్యమని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ధర్మసాగర్ మండలం మల్లక్ పల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజ రయ్యారు. ఈ సందర్బంగా మల్లక్ పల్లి గ్రామంలో 35లక్షల రూ పా యలతో నిర్మించిన సిసి రోడ్డు, ఇందిరమ్మ ఇల్లు, పిఏసీఎస్ ధర్మసాగర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రార ంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రేవంత్ రెడ్డి వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తూ రైతు సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరిగిందని ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే 3లక్షల 50వేల ఎకరాలలో మొక్కజొన్న సాగు చేస్తున్నారని అన్నారు. మన స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో 20వేల ఎకరాలలో మక్కల సాగు చేస్తున్నారని తెలిపారు. మొక్కజొన్నలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర 2400గా ఉన్నప్పటికీ మక్కల వ్యాపారాలు మాత్రం క్వింటాకు 1600 నుండి 1700 లకే కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. దీంతో మక్క రైతులు ఎకరానికి 20వేల వరకు నష్టపోతున్నారని అన్నారు. రైతులు ఆర్థికంగా నష్టపోకూడదనే ఉదేశ్యంతో ప్రభుత్వమే మద్దతు ఇచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని, ధాన్యం కొనుగోలుతో సీజన్‌కు ప్రభుత్వానికి 5వేల కోట్ల నష్టం వస్తుందని అయినప్పటికీ రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలుస్తుందని అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలని సద్వినియోగం చేసుకొని మద్దతు ధరకు ధాన్యాన్ని అమ్ముకోవాలని సూచించారు. త్వరలోనే 2లక్షల కొత్త పెన్షన్లు మంజూరు చేయడంతో పాటు తెల్ల రేషన్ కార్డు ఉన్న కోటి 10లక్షల కుటుంబాలకు ఇందిరా కుటుంబ భీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా కుటుంబ పెద్ద చనిపోతే 15 రోజులలో 5లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. రెండో విడతలో మరో 40ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తానని, మల్లక్ పల్లి నుండి రాంపూర్ రోడ్డును కూడా త్వరలోనే మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శాశ్వత భవనం నిర్మిస్తానని తెలిపారు. మల్లక్ పల్లి, ధర్మాపురం గ్రామాల రైతులకు పైప్ లైన్ ద్వారా గోదావరి జలాలు తీసుకువస్తానని వెల్లడించారు. మా ఎమ్మెల్యే కడియం శ్రీహరి అని గర్వంగా చెప్పుకునే విధంగానే తన పని తీరు, ప్రవర్తన ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గిన్నారపు లత, వివిధ శాఖల అధికారులు, మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## శంకర్‌గౌడ్ మృతి ప్రభుత్వ హత్యే

ప్రజాపక్షం/వెంకటాపూర్ : నర్సంపేట ఆర్‌టిసి డిపోకు చెందిన డ్రైవర్ కోల శంకర్ గౌడ్ మృతి ప్రభుత్వ చేసిన హత్యేనని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి చంటి భద్రయ్య హెచ్చరించారు. ఈ సంఘటన ప్రభుత్వ నియంత పోకడకు పరాకాష్ట అని విమర్శించారు.ఆర్‌టిసి కార్మికులు గత రెండు న్నర ఏండ్లుగా ప్రభుత్వం తో చర్చలు జరిపిన పట్టించుకక పోవడం వల్లనే గత నెల రోజుల క్రితం సమ్మె నోటీస్ ఇచ్చి కార్మికులు సమ్మెకు దిగారని అన్నారు. చర్చల పేరుతో కాలయాపన చేసే కుట్రలో భాగంగానే మనో వేదనకు గురైన నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ కోల శంకర్ గౌడ్ పెట్రోల్ పోసుకొని కాలి చనిపోవడం ప్రభుత్వ కుట్రలో భాగమేనని విమర్శించారు. తోటి కార్మికుల హక్కుల సాధన కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఆత్మ బలిదానం చేసుకున్న ఆ వీరుడి మరణం ఎంతో త్యాగ నిరతి అని కొనియాడారు.ఈ సంఘటనతో కలత చెందిన రంగారెడ్డి జిల్లాకు చెందిన మరో కార్మికుడు, భూపాలపల్లి డిపోకు చెందిన రవీందర్ రెడ్డి అనే కార్మికుడు ఆత్మహత్య యత్నానికి పాల్పడడం వంటి సంఘటనలు ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని ఆరోపించారు. శంకరగౌడ్ మృతితో నైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి ఆర్‌టిసి కార్మికుల పట్ల శిత్తశుద్ధితో డిమాండ్ల పరిష్కారం కోసం పని చేయాలని డిమాండ్ చేసారు.. మృతుడు శంకర్ గౌడ్ కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం తో పాటు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం అవకాశం కల్పించాలని అన్నారు. ఈ సంఘటనతో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనల వల్ల జరిగే శాంతి భద్రతల సమస్యకు ప్రభుతమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. ఆర్‌టిసి కార్మికులు సంయమనం పాటించాలని క్షణికావేశాలతో ఆత్మహత్యలు చేసుకోవడం వల్ల తమ కుటుంబాలు రోడ్డున పడి దిక్కు లేనివారు అవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రావాల్సిన హక్కులను పోరాడి సాధించుకోవాలి తప్ప ఆత్మహత్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు.

## ధాన్యం కొనుగోలు సజావుగా సాగేలా చర్యలు

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

ప్రజాపక్షం/భూపాలపల్లి :రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ధాన్యం కొనుగోలు సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఒసి కార్యాలయంలో యాసంగి రబీ ధాన్యం కొనుగోలుపై పౌరసరఫరాలు రెవెన్యూ, సహకార, డిఆర్‌డిఒ, వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా, తూనికలు కొలతలు, కార్మిక శాఖ, రైస్ మిల్లర్లు, రవాణా కాంట్రాక్టర్లతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ, రవాణాకు లారీలు అందుబాటులో ఉంచాలని, తూకం అవగానే ధాన్యాన్ని ట్యాగ్ చేసిన మిల్లులకు తరలించాలని స్పష్టం చేశారు. లారీలు అందుబాటులో ఉంచాలని, ఇబ్బందులకు గురి చేస్తే రైతులు నష్టపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. తూకం వేసిన వెంటనే ట్రక్ షీట్ ఇవ్వాలని, కాని ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని అన్నారు. తాను కల్లం కల్లం తిరుగుతూ, రైతులతో ముఖాముఖి అవుతున్నానని రైతులు తన దృష్టికి తెచ్చిన సమస్యలు మీ దృష్టికి తెస్తున్నానని స్పష్టం చేశారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా సజావుగా ధాన్యం కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రాల నిర్వహకులు నెలరోజులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. అన్ని కొనుగోలు కేంద్రాల్లో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు తగిన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాల్లో నీడ, తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రైతులకు వ్యవసాయ అధికారులు టోకెన్లు జారీ చేయాలని, దీని ద్వారా కొనుగోలు కేంద్రాల్లో రద్దీని నియంత్రించవచ్చని తెలిపారు. రానున్న రెండు రోజుల్లో అన్ని కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఆదేశించారు. అకాల వర్షాల వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌర సరఫరాల సంస్థ డిఎం రాములు, సరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్, సహకార అధికారి వాలియ నాయక్, డిఆర్డిఓ బాలకృష్ణ, వ్యవసాయ అధికారి బాబురావు, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, రవాణా శాఖ అధికారి సంధాని, తూనికల కొలతలు, కార్మిక శాఖ అధికారులు, రైస్ మిల్లర్లు రవాణా కాంట్రాక్టర్లు, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

### ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్



ప్రజాపక్షం/నర్సంపేట: ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆత్మహత్య చేసుకున్న శంకర్ గౌడ్ కుటుంబనికి రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయల నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ డిమాండ్ చేశారు. ఈసందర్భగా ఆయన మాట్లాడుతూ గత మూడు రోజుల నుండి ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తుంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో వచ్చిన హామీలను నెరవేర్చకుండా కార్మికుల సమస్యలు పెండింగ్లో ఉంచుతూ ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయకుండా కాల కాలయాపన చేస్తూ ఆర్‌టిసి సంస్థను ప్రైవేటు పరం చేయాలని ఉద్దేశంతో ప్రైవేటు బస్సులను తీసుకొచ్చి నడుపుతున్న క్రమంలో మా డిమాండ్ల నెరవేర్చపోగా ఇక మా ఉద్యోగాలు గ్యారెంటీ లేవు మా కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఉద్దేశంతో ఆవేదన చెందిన శంకర్ గౌడ్ పెట్రోల్ పోసుకొని చనిపోవడం జరిగింది అన్నారు. ప్రభుత్వం పూర్తి బాధ్యత వహిస్తూ శంకర్ గౌడ్ కుటుంబానికి కోటి రూపాయల నష్ట పరిహారం ఇస్తూ ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఆర్‌టిసి కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంస్థను ప్రభుత్వ పరం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కందిక చెన్నకేశవులు, జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ గుంపెల్లి మునిశ్వర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అక్క పెల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల నెరవేరడం ఆనందంగా ఉంది

ప్రజాపక్షం/హనుమకొండ :వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు పథకం ద్వారా సొంతింటి కల నెరవేరుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు .ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన వివిధ డివిజన్లలోని 256 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి అజీజ్ ఖాన్, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, ఏనుగుల మానస రాంప్రసాద్, జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇండ్లు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఎలాంటి దళారి వ్యవస్థ లేకుండా పారదర్శకంగా పథకాన్ని అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఇంటి స్థలం లేని నిరుపేదలకు జీ ప్లస్ త్రీ విధానంలో ఇండ్లు నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నామని, ప్రభుత్వ భూములను గుర్తించి త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. లబ్ధిదారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 28న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ, నిరుపేదలకు ఇండ్లు అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్లు పథకం ద్వారా సొంతింటి కలను సాకారం చేస్తున్నారని పేర్కొన్నారు.

## జనగామలో... ఉద్రిక్తం




ప్రజాపక్షం/జనగామ :జనగామలో ఆర్‌టిసి కార్మికుల సమ్మె ఉద్రిక్తంగా మారింది. శుక్రవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో బిఆర్‌ఎస్ శ్రేణులు ఒక్కసారిగా డిపోలోకి దూసుకుపోయాయి. పోలీసులు అడ్డుకున్నా దూసుకెళ్లడంతో స్వల్పంగా లాఠీచార్జీ చేశారు. అనంతరం డిపో ముందు బిఆర్‌ఎస్, సిపిఐ, సిపిఎం మద్దతుతో కార్మికులు ధర్నా చేశారు. ధర్నా ముగియక ముందే మాజీ మంత్రిని సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎంపిలు మాలోతు కవిత, వినోద్‌కుమార్‌లను రఘునాథపల్లిలో, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను స్టేషన్‌ఘనపూర్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం ఆత్మహత్యాయత్నానికి యత్నించి మృతి చెందిన శంకర్‌గౌడ్ కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్తున్న క్రమంలో వీరిని పలు చోట్ల అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. జనగామలో బస్టాండ్‌లో ఆందోళనలో ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి హుటాహుటిన రఘునాథపల్లి చేరుకొని సిఐ కార్యాలయం ముందు ఆందోళన చేయడంతో అరెస్ట్ చేశారు. పోలీస్‌లు తమ నాయకుల్ని అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని డిజిపి దృష్టికి తీసుకెళ్లారు. సాయంత్రం 4 గంటల వరకు హైడ్రామా జరిగింది. ఆ తరువాత ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగామలోని తన క్యాంప్ కార్యాలయంలో భోజనం చేయిస్తాను మీ కస్టడిలోనే ఉంటారని చెప్పడంతో బిఆర్‌ఎస్ నాయకులను జనగామకు తరలించారు. ఆ తరువాత సాయంత్రం విడిచిపెట్టారు. ఆర్‌టిసి సమ్మె మూడో రోజుకు చేరుకుంది. తమ డిమాండ్లు పరిష్కరించాలని కార్మికుల ఆందోళన చేస్తున్నారు. నర్సంపేటలో శంకర్ గౌడ్ అనే కార్మికుడు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి యత్నించి హాస్పటల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. దీనితో ఉమ్మడి వరంగల్ జిల్లాలో సమ్మె మరింత ఉద్రిక్తంగా మారింది. అయితే శంకర్‌గౌడ్‌ను పరామర్శించి మృతదేహానికి నివాళ్లు అర్పించడం కోసం బిఆర్‌ఎస్ నేతలు హైదరాబాద్ నుండి నర్సంపేటకు వెళ్తుండగా పోలీసులు అక్కడక్కడ అరెస్ట్ చేశారు.

**రఘునాథపల్లి, స్టేషన్‌ఘనపూర్‌లో బిఆర్‌ఎస్ ఆందోళన**

రఘునాథపల్లిలో సబితాఇంద్రారెడ్డి, కవిత, వినోద్‌కుమార్, స్టేషన్‌ఘనపూర్‌లో శ్రీనివాస్‌గౌడ్‌లను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ రఘునాథపల్లిలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో, స్టేషన్‌ఘనపూర్‌లో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ల ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పాటు అక్రమ అరెస్ట్‌లను ఖండించారు. వేల కోట్ల రూపాయలు అందాల పోటీలకు ఖర్చు చేసిన ప్రభుత్వం ఆర్‌టిసి కార్మికులకు పిఆర్‌సి ఇవ్వడానికి, ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడానికి తప్పేంటని ప్రశ్నించారు. పోలీస్‌లు ఎంత చెప్పినా వినలేదు. చివరకు సాయంత్రం అదుపులోకి తీసుకున్న నాయకులు విడిచిపెట్టారు.

## వరంగల్ టెక్స్‌టైల్ పార్క్‌కు కేంద్రం భరోసా



ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : వరంగల్ అభివృద్ధి పట్ల అంకితభావంతో ముందుకు సాగుతున్న వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మరోసారి తన సంకల్పబలం చాటారు. వరంగల్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ త్వరితగతిన ప్రారంభం అయ్యేలా కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని లోక్‌సభలో రూల్ 377 కింద ప్రస్తావించారు. ప్రధానంగా పార్క్ త్వరితగతిన ప్రారంభం కావడానికి అవసరమైన ఆర్థిక, మౌలిక వసతుల మద్దతు పెంచాలని కేంద్రాన్ని ఎంపి కోరారు. ప్రధాని మిత్ర పథకం కింద ఈ ప్రాజెక్ట్‌ను ప్రాధాన్యంగా తీసుకోవాలని స్పష్టం చేశారు.వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య వినతిపై స్పందించిన కేంద్ర టెక్స్టైల్స్ మంత్రి గిరిరాజ్ సింగ్, ఇప్పటికే రూ.30 కోట్ల తొలి విడత నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. తదుపరి విడత నిధులు అర్హతల ప్రకారం విడుదల చేస్తామని వెల్లడించారు. పరిశ్రమలను ఆకర్షించేందుకు రూ.300 కోట్ల వరకు ఆకర్షణాత్మక ప్రోత్సాహకాలు అందుబాటులో ఉన్నాయని మంత్రి వివరించారు. పీఎల్ఐ, సమర్థ్ వంటి పథకాల ద్వారా కూడా యూనిట్లు లబ్ధి పొందగలవని సూచించారు.వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య నిరంతర అనుసరణతో ఈ ప్రాజెక్ట్ వేగం పెరిగింది. ఈ టెక్స్‌టైల్ పార్క్ ద్వారా వరంగల్‌లో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు విస్తృతంగా పెరగనున్నాయి.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
శనివారం
25-04-2026
www.prajapaksham.in

‘ హీరో రవితేజ సోదరుడి తనయుడు, నటుడు రఘు కుమారుడు మాధవ్ హీరోగా పరిచయమవుతున్న సినిమా మారెమ్మ. విలేజ్ యాక్షన్ -డ్రామాగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే అమ్మవారి కథను బ్యాక్ డ్రాప్‌గా తీసుకుని తెరకెక్కిస్తున్న ప్రేమ కథ ఇది. ’

# రీల్

## పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ‘గాడ్స్ అండ్ సోల్జర్స్’



రఫ్ నోట్ ప్రొడక్షన్ సంస్థ నిర్మిస్తున్న ప్రతిష్ఠాత్మక తమిళతెలుగు ద్విభాషా చిత్రం ‘గాడ్స్ అండ్ సోల్జర్స్’. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణనంతర పనులను శరవేగంగా జరుపుకుంటోంది. ప్రముఖ దర్శకుడు, సినిమాటోగ్రాఫర్ విజయ్ మిల్టన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం కమర్షియల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటోంది. రాజ్ తరుణ్ ఈ చిత్రంతో తమిళంలో అడుగుపెడుతున్నారు. భరత్ కీలక పాత్ర లో నటిస్తున్నారు. అమూ అభిరామి, కిశోర్ ప్రాధాన్యత ఉన్న పాత్రల్లో కనిపించ నున్నారు. ఇక ప్రత్యేక ఆకర్షణగా స్వతంత్ర సంగీత కళాకారుడు వేధన్ కూడా ఒక ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. తన ప్రత్యేక గాత్రం, సామాజిక అం శాలపై ఆధారిత గీతాలతో యువతలో గుర్తింపు పొందిన వేధన్ పాల్గొనడం ద్వారా చిత్రానికి సాంస్కృతిక, సంగీత పరమైన ప్రత్యేకత కలగనుంది. విభిన్న ప్రదేశాల్లో విస్తృతంగా షూటింగ్ జరుపుకుంది. ప్రస్తుతం చిత్ర బృందం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో నిమగ్నమైంది. తమిళ, తెలుగు భాషల్లో ఒకే సారి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## గ్రామీణ నేపథ్యంలో అమ్మవారి కథ మారెమ్మ



హీరో రవితేజ సోదరుడి తనయుడు, నటుడు రఘు కుమారుడు మాధవ్ హీరోగా పరిచయమవుతున్న సినిమా మారెమ్మ. విలేజ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే అమ్మవారి కథను బ్యాక్ డ్రాప్‌గా తీసుకుని తెరకెక్కిస్తున్న ప్రేమ కథ ఇది. ఈ చిత్రంతో మంచాల నాగరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మయూర్ రెడ్డి బండారు మోక్ష ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్ అద్భుతమైన రెస్పా న్స్ వచ్చిన తర్వాత ఇటీవల రిలీజ్ చేసిన మారెమ్మ ఫస్ట్ సింగిల్ ‘బావ బావ’ సాంగ్ సూపర్ చార్ట్ బస్టర్‌గా నిలిచింది. షూటింగ్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుపుకుంటోంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ ప్రశాంత్ అంకిరెడ్డి అందించగా, సంగీతాన్ని ప్రశాంత్ ఆర్ విహారి సమకూర్చారు. ఎడిటర్‌గా దేవ్ రాథోడ్, ఆర్ట్ డైరెకర్‌గా రాజ్‌కుమార్ మురుగేసన్ పని చేస్తున్నారు. అన్ని పనులు పూర్తి చేసి త్వరలోనే ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి రచన దర్శకత్వం: మంచాల నాగరాజ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఉమేష్ విలాసాగరం డిఒపి : ప్రశాంత్ అంకిరెడ్డి, సంగీత దర్శకుడు: ప్రశాంత్ ఆర్ విహారి, ఎడిటర్: దేవ్ రాథోడ్, ఆర్ట్ డైరెక్టర్: రాజ్ కుమార్ మురుగేషన్, యాక్షన్ డైరెక్టర్: మాడిగొండ నటరాజ్, కొరియోగ్రాఫర్: సాగ్గీ సాగర్, సాహిత్యం: మిట్టపల్లి సురేందర్, కమల్ ఎస్లావత్.

## చిన్న సినిమాలను తొక్కేస్తున్నారు

### ‘ ఓ అందాల రాక్షసి’ రీ-రిలీజ్‌కు థియేటర్లు ఇవ్వలేదు

### నటుడు, దర్శకుడు షెరాజ్ మెహదీ ఆవేదన



తెలుగు సినిమా పరిశ్రమలో చిన్న సినిమాలకు థియేటర్లు దక్కడం లేదని నటుడు, దర్శకుడు షెరాజ్ మెహదీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తెలుగు ఫిలిం చాంబర్లో నిర్వహించిన ప్రెస్మీట్లో మాట్లాడుతూ తన దర్శకత్వంలో తానే హీరోగా నటించిన ‘ఓ అందాల రాక్షసి’ సినిమా రీరిలీజ్కు కూడా థియేటర్లు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు .ప్రేక్షకుల అభ్యర్థన మేరకు ఏప్రిల్ 24న ఈ చిత్రాన్ని రీరిలీజ్ చేయాలని నిర్ణయించినప్పటికీ, ముఖ్యంగా నైజాం ప్రాంతంలో ఒక్క థియేటర్ కూడా ఇవ్వకపోవడం బాధాకరమని తెలిపారు. మా సినిమాకు ఈసారి కూడా థియేటర్లు ఇవ్వడం లేదు. ఇది చిన్న సినిమాలపై జరుగుతున్న అన్యాయం అని ఆయన అన్నారు.తెలుగు సినిమా థియేటర్ వ్యవస్థ కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమైందని షెరాజ్ మెహదీ ఆరోపించారు. నలుగురు రాక్షసుల చేతుల్లో సినిమా థియేటర్లు ఉన్నాయి. చిన్న సినిమాలు విడుదల కాకుండా అడ్డుకుంటున్నారు. దీనిపై నేను న్యాయపోరాటం చేస్తాను అని స్పష్టం చేశారు.చిన్న సినిమాల నిర్మాతలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తీవ్రంగా ఉన్నాయని, ఇలాంటి పరిస్థితులు కొనసాగితే చిన్న సినిమా నిర్మాణం పూర్తిగా ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. నాకు ఏమైనా జరిగితే దిల్ రాజు, సురేష్ బాబు, బిజిలి, సునీల్ వంటి వారే కారణం అవుతారు అంటూ భావోద్వేగానికి లోనయ్యారు.ఇక ఐనాక్స్, ఏషియన్ థియేటర్ వ్యవస్థలో కూడా ముందుగా హామీ ఇచ్చినా థియేటర్లు ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. చిన్న సినిమాలను చంపేస్తున్నారు. తెలుగు ఫిలిం ఇండస్ట్రీని కాపాడాలని కోరుతూ ప్లీజ్ సేవ్ తెలుగు ఫిలిం ఇండస్ట్రీ అని షెరాజ్ మెహదీ విజ్ఞప్తి చేశారు.

## క్రైం థ్రిల్లర్‌గా ‘చింతామణి సొంత కథ’



శ్రీరామ్, మహిమా గుప్త హీరో హీరోయిన్‌లుగా నటిస్తున్న సినిమా ‘చింతామణి సొంతకథ’. ఈ చిత్రాన్ని దర్శకుడు ప్రేమ్ రాజ్ రూపొందిస్తున్నారు. మిత్రా మూవీ మేకర్స్ బి.రాజీవ్ కుమార్, రాకేష్ క్రరె, డా.ఎన్.వి.రావు, శ్రీనివాస్ పసుపులేటి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం తొలి షెడ్యూల్ పూర్తి చేసుకుంది. హీరో హీరోయిన్‌లు, ఇతర తారాగణంపై కొన్ని ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరించారు. రెండో షెడ్యూల్ త్వరలోనే ప్రారంభం కాబోతుందని దర్శకుడు ప్రేమ్ రాజ్ తెలిపారు. మా సినిమాకు హీరో హీరోయిన్స్ శ్రీరామ్, మహిమా గుప్త పర్ఫెక్ట్‌గా సరిపోయారని చెప్పారు. దర్శకుడిగా నాకు నాలుగో చిత్రమిది. గతంలో నేను చేసిన మూడు చిత్రాలు మెసేజ్ ఓరియెంటెడ్ గా ఉంటాయి. ఇప్పుడు నాలుగో చిత్రంగా కమర్షియల్ పంథాలో క్రైమ్ థ్రిల్లర్ కథతో ఈ సినిమా చేస్తున్నాను. క్రైమ్ థ్రిల్లర్ కథైనా ఇందులో భార్య భర్తల మధ్య మంచి డ్రామా ఉంటుంది. ఎమోషనల్ సీన్స్ ఉంటాయి. యూత్‌ను టార్గెట్ చేస్తూ రూపొందిస్తున్న చిత్రమిది. ఇప్పటి ట్రెండ్‌కు అనుగుణంగా రూపొందిస్తున్నాం. ప్రేక్షకులు సినిమాను కొత్తగా ఫీలవుతారు. తెలుగు, హిందీ భాషల్లో స్ట్రైట్ మూవీ ఇది. తమిళ, మలయాళ, కన్నడలో డబ్ చేస్తాం. మా ప్రొడ్యూసర్స్ నలుగురు నాలుగు పిల్లర్స్ లా నిలబడి ఈ మూవీ నిర్మిస్తున్నారు. హీరోయిన్ మహిమా గుప్తకు ఈసినిమాతో మంచి పేరొస్తుంది. హీరో శ్రీరామ్ మా మూవీకి ముఖచిత్రం లాంటివారు. కథ విన్న వెంటనే ఈ సినిమా చేస్తానంటూ ముందుకొచ్చారు అని అన్నారు. శ్రీరామ్, మహిమా గుప్త,నాజర్, కాశీ విశ్వనాథ్, వడ్లమాని శ్రీనివాస్, మురళీధర్ గౌడ్, రవికాలే, శ్రీలక్ష్మి , నర్రా శ్రీనివాస్, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి డిఒపి : ప్రతాప్, ఫైట్స్ : సుబ్బు, లిరిక్స్ సుద్దాల అశోక్ తేజ, చంద్రబోస్, మెట్టపల్లి సురేందర్.

## కొత్త సినిమా కోసం విష్ణు రెడీ



కన్నప్ప సినిమా తరువాత విష్ణు మరో సినిమా చెయ్యడానికి సిద్ధమవుతున్నాడు. భారీ ఆశలతో కన్న ప్ప సినిమాను తెరకెక్కించారు. కానీ ఈ సినిమా ఆశించినంతగా బాక్సాఫీస్ వద్ద ఆడలేదు. దీంతో కొంత నిరాశకు గురయిన మంచి సినిమా తీశారని సంతృప్తి మిగిలింది. భక్తి నేపథ్యంలో తెరకెక్కించిన సినిమా కన్నప్ప. ఇప్పుడు పూర్తిగా కమర్షియల్ సినిమాను రూపొందించడానికి విష్ణు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. అందుకే రాబోయే సినిమాకోసం ఫోటో షూట్ చేశాడు. యాక్షన్, ఎంటర్టైన్‌మెంట్ నేపథ్యంలో సినిమా ఉండబోతోందని సమాచారం. గతంలో తాను చేసిన ఢీ వంటి సినిమాల నేపథ్యంలోనే రాబోయే సినిమాను నిర్మించనున్నారు. అందుకు గాను ముందుగానే ఫోటో షూట్ చేసి చూశారు. బులెట్ బైక్ పక్కన కూర్చుని రకరకాల తీరుగా ఫోటో షూట్ చేశారు. త్వరలోనే కొత్త సినిమా సెట్స్ మీదకు రాబోతుందని ఫిలింనగర్ టాక్.

## ‘టైటిల్ డిజైన్’ చెయ్యడం పరీక్ష లాంటిదే

### వివా రెడ్డి



సినిమాకు కథ ఎంత ప్రాణమో , ఆ సినిమా కథకు టైటిల్ అంతే ప్రాణం. టైటిల్ చూసే జనం థియేటర్లకు వస్తారని ఒక నమ్మకం. అందుకే టైటిల్ విషయంలో దర్శక, నిర్మాతలు చాలా ప్రాధాన్యతనిస్తారు. సినిమా టైటిల్ క్యాచీగా ఉంటె జనాలకు త్వరగా ఎక్కుతుందని భావిస్తుంటారు. అలా టైటి ల్ పెట్టిన తరువాత దాన్ని డిజైన్ చెయ్యడం మరో ప రీక్ష లాంటిది. టైటిల్ అంత బాగున్నా డిజైన్ సరిగ్గా లేకపోతే ఫ్యాన్స్ హార్ట్ అవుతారు. అందుకే టైటిల్ డిజైన్ విషయంలో కూడా దర్శకులు ఎంతో జాగ్రత్త వహిస్తారు. టైటిల్ డిజైన్ చెయ్యడం ఒక కల. అంత ఈజీ కాదు అంటున్నాడు వివా రెడ్డి. చిన్ననాటి చిత్రలేఖనపు అమాయక ఆసక్తితో ప్రారంభమైన ప్రయాణం.. కాలక్రమేణా లోగో రూపకల్పనలో నైపుణ్యంగా వికసించి, పబ్లిసిటీ రూపకల్పనలో ప్రత్యేక గుర్తింపును సాధించి, నటనలోనూ తన అభిరుచిని ప్రతిబింబించిన కళాకారుడిగా వివా రెడ్డి ఎదిగారు.దిల్‌తో ప్రారంభమైన ఆయన సినీ ప్రయాణం, శివమణి, అర్జున్, చంద్రముఖి, సింహా, ఒక్కమగాడు, పరమవీరచక్ర, బొమ్మరిల్లు, పరుగు, శంకర్ దాదా జిందాబాద్, గుడుంబా శంకర్, దేశముదురు, పోకిరి, రక్తచరిత్ర, సూపర్, రెడీ, ప్రస్థానం, బ్లేడ్ బాబ్జీ, ఆర్య 2, ఆపరేషన్ దుర్యోధన వంటి అనేక విజయవంతమైన చిత్రాల వరకు విస్తరించింది. బంగారుకొండ, జై బోలో తెలంగాణ, లగ్గం, బాపు, రుద్రంగి, సోదర సోదరీమణులారా వంటి వందకు పైగా చిత్రాలకు ఆయన అందించిన రూపకల్పనలు సినిమాకి ముందే ప్రేక్షకుల హృదయాల్లో ఆసక్తిని రేకెత్తించాయి.ఫైన్ ఆరట్స్ విద్యతో పదును పెట్టుకున్న నైపుణ్యం, కృషి, పట్టుదలతో అవకాశాలను ఆహ్వానించుకుని సాగిస్తున్న ఈ ప్రయాణం సంతృప్తిగా ఉందని వివా రెడ్డి అంటున్నారు. ఇటీవల చార్లిన్ చాప్లి జయంతి సందర్భంగా పలు సినిమాల్లో చేసిన నటనకు గాను అవార్డుతో సత్కరించడం గర్వాంగా ఉందని చెప్పారు.

## ఆప్ రాజ్యసభ ఎంపిలు

(3వ పేజీ తరువాయి)

చెమట ధారపోసి నేను పోషించిన, నా యవ్వనంలోని 15 ఏళ్లను నేను అంకితం చేసిన ఆమ్ ఆద్మీ పార్టీ, ఇప్పుడు తన సూత్రాలు, విలువలు, మౌలిక నైతికత నుండి పూర్తిగా పక్కదారి పట్టింది’ అని ఆయన అన్నారు. ఇటీవల రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీ ఉప నాయకుడి పదవి నుండి చద్దా తొలగించబడగా, ఆయన స్థానంలో మిట్టల్ నియమితులయ్యారు. ‘రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీకి 10 మంది ఎంపిలు ఉన్నారు. వారిలో మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ మంది మా వెంటే ఉన్నారు. వారు ఇప్పటికే సంతకాలు చేశారు. ఈ శుక్రవారం ఉదయం, సంతకాలు చేసిన లేఖలు, ఇతర అధికారిక పత్రాలతో సహా అవసరమైన డాక్యుమెంటేషన్ మొత్తాన్ని తాము రాజ్యసభ ఛైర్మన్‌కు సమర్పించామని చద్దా విలేకరులకు తెలిపారు. అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ, ఆ పార్టీ ఇప్పుడు దేశం కోసం కాకుండా, కేవలం తన సొంత ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని చద్దా ఆరోపించారు. మరొక రాజ్యసభ సభ్యుడు సందీప్ పాఠక్ మాట్లాడుతూ ఇటువంటి పరిస్థితి వస్తుందని కలలో కూడా అనుకోలేదని, కానీ ఇప్పుడు అది సంభవించిందని అన్నారు. ‘పదేళ్ల పాటు నేను ఈ పార్టీతో అనుబంధం కలిగి ఉన్నాను. కానీ ఈ రోజు, నేను ఆమ్ ఆద్మీ పార్టీతో నా బంధాన్ని తెంచుకుంటున్నాను’ అని పాఠక్ పేర్కొన్నారు. ఈనెల 15న, ఫెమా నిబంధనల ఉల్లంఘన ఆరోపణలపై జరుగుతున్న దర్యాప్తులో భాగంగా, పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యుడు అశోక్ మిట్టల్‌కు సంబంధించిన వ్యాపార సంస్థలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు దాడులు నిర్వహించారు.

**ఆపరేషన్ లోటస్ కుట్రలో భాగమే : ఆప్**

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాజ్యసభ సభ్యుల పార్టీ ఫిరాయింపును బిజెపి చేపట్టిన ఆపరేషన్ లోటస్ కుట్రలో భాగమని ఆప్ నాయకుడు సంజయ్ సింగ్ శుక్రవారం తీవ్రంగా విమర్శించారు. పార్టీని వీడిన ఆ ఏడుగురిని పంజాబ్ ప్రజలు క్షమించరని ఆయన అన్నారు. బిజెపిలోకి భారీ ఎత్తున ఫిరాయింపులు జరిగిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సింగ్ మాట్లాడుతూ పంజాబ్‌లో భగవంత్ మాన్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులకు అడ్డుపడేందుకు బిజెపి కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఆమ్ ఆద్మీ పార్టీని వీడిన ఆ ఎంపిలను పంజాబ్ ప్రజలు ఎప్పటికీ క్షమించరని సింగ్ స్పష్టం చేశారు.

## తొలగించాల్సిందే

(3వ పేజీ తరువాయి)

పార్టీలు లేవనెత్తిన ఆందోళనలను ప్రస్తావిస్తూ, ‘ఈ నోటీసు తేదీ నాటికి, జ్ఞానేష్ కుమార్ ఆ ఫిర్యాదులలో దేనిపైనా ఎటువంటి షోకాజ్ నోటీసు, సలహా లేదా బహిరంగ స్పందన జారీ చేయలేదు అని ఆ నోటీసులో పేర్కొన్నారు. వర్గాల తెలిపిన ప్రకారం.. కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేష్, టిఎంసి నాయకురాలు సాగరిక ఘోష్ ఈ నోటీసును రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు సమర్పించారు. నోటీసు ఇచ్చేందుకు 50 మంది సంతకాలు అవసరం కాగా, 73 మంది రాజ్యసభ ఎంపిలు సంతకాలు చేశారు. కాంగ్రెస్, టిఎంసి, ఎస్‌పి, డిఎంకె, వామపక్ష పార్టీలు, శివసేన (యుబిటి), ఎన్‌సిపి (ఎస్‌పి), ఆర్‌జెడి, ఐయుఎంఎల్ వంటి ప్రతిపక్ష పార్టీల సభ్యులు, అలాగే ఏకాభిప్రాయం కలిగిన పార్టీలు ఈ నోటీసుపై సంతకాలు చేశాయని వర్గాలు తెలిపాయి. లోక్‌సభ, రాజ్యసభలలో ప్రతిపక్ష ఎంపిలు సమర్పించిన ఇలాంటి నోటీసులను ఆయా సభల అధ్యక్షులు తిరస్కరించిన కొద్ది రోజులకే ఈ పరిణామం చోటుచేసుకుంది. పార్లమెంటులో సిఇసిని తొలగించాలని కోరుతూ నోటీసు సమర్పించడం ఇదే మొదటిసారి. తమ మునుపటి నోటీసులలో, ప్రతిపక్షం సిఇసి కుమార్ స్వాతంత్ర్యం, రాజ్యాంగ విశ్వసనీయతను కాపాడటంలో విఫలమయ్యారని, కార్యనిర్వాహక వర్గం అదుపులో పనిచేస్తున్నారని ఆరోపించింది. అయితే, దాదాపు ఇలాంటి ప్రతిస్పందనలలోనే, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ ఆ నోటీసులను తిరస్కరించారు. ఒకవేళ ఆ ఆరోపణలు నిజమేనని భావించినప్పటికీ, ఆయనను తొలగించడానికి అవసరమైన దుష్ప్రవర్తన అనే ఉన్నత రాజ్యాంగ ప్రమాణానికి అవి సరిపోవని వారు పేర్కొన్నారు.

# ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి రూ. కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా చెల్లించాలి
ఆత్మహత్యలు వద్దు.. పోరాడి సాధించుకుందాం
సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
కార్మికుల సమ్మెకు మద్దతుగా సిపిఐ ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో



**ప్రజాపక్షం/హనుమకొండ :** ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, సమ్మె పై మొండి వైఖరి వీడాలని, ఈ విషయంలో సమ్మెపై ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు హనుమకొండలోని కాళోజి సెంటర్ లో ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో కార్మికుల పక్షాన నిలబడి పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆర్టీసీ కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరారు. ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. ఆగిపోయిన రెండు వేతన సవరణలను తక్షణమే అమలు చేయాలని కోరారు. ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్సులను తక్షణమే కొనుగోలు చేయాలన్నారు. కార్మికుల ఐక్య పోరాటంతోనే హక్కుల సాధన సాధ్యం అని, సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ప్రైవేటు డ్రైవర్ల ప్రయోగం ప్రజల ప్రాణాలతో చెలగాటమేనని, సమ్మెను అణచివేసేందుకు ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెడుతున్న ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలని అన్నారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం, ఉద్యోగ భద్రత, వేతన సవరణ, ఖాళీ పోస్టుల భర్తీ, కార్మికులకు సంబంధించిన సంక్షేమ చేశారు గత ఎన్నికల సందర్భంగా రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, అదేవిధంగా ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్ గ్రేషియో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్టీసి కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని, ఆత్మహత్యలు పరిష్కారం కాదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ రాస్తారోకో కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు ఎన్ ఎ స్టాలిన్, వుట్కూరి రాములు, కర్రే లక్ష్మణ్, ఎదునూరి వెంకట్రాజం, కొట్టేపాక రవి, వేల్పుల సారంగపాణి, గుంటీ రాజేందర్, అలువాల రాజు, పొనుగోటి రామ్ గోపాల్ చారి, పూజారి అమృతయ్య, కట్కూరి కృష్ణ, మామునూరి దామోదర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీ ప్రకటన

(3వ పేజీ తరువాయి)

20 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ‘ప్రొఫెసర్ జయశంకర్’ సభా ప్రాంగణం నుంచి కొత్త రాజకీయ పార్టీని కవిత ప్రకటించనున్నారు. రెండు దశాబ్దాల క్రితం తెలంగాణ స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో సంస్కృతిక విప్లవానికి ఊతకర్రగా నిలుస్తూ తెలంగాణ జాగృతిని ఏర్పాటు చేసిన కల్వకుంట్ల కవిత 20 ఏళ్ల ప్రజా జీవితంలో అనేక మైలు రాళ్లకు చేరుకున్నారు. అదే సమయంలో అనేక ఇబ్బందులనూ ఎదుర్కొన్నారు.

**షెడ్యూల్ ఇదే...:** శనివారం ఉదయం 7.30 గంటలకు బంజారాహిల్స్ లోని తన నివాసం నుంచి కల్వకుంట్ల కవిత ర్యాలీగా అమరవీరుల స్తూపం వద్దకు బయల్దేరుతారు. ఉదయం 8.15 గంటలకు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తారు. ఉదయం 8.25 గంటలకు అమరవీరుల స్తూపం వద్ద నుంచి బయల్దేరుతారు. ఉదయం 9.30 గంటలకు మేడ్చల్ జిల్లా మునీరాబాద్ లోని అద్వయ కన్వెన్షన్ హాల్ మెయిన్ గేట్ వద్దకు చేరుకుంటారు. ఉదయం 10 గంటలకు పార్టీ జెండాను ఆవిష్కరిస్తారు. ఉదయం 10.05 గంటల ప్రసంగం ప్రారంభిస్తారు. గంట 15 నిమిషాల నుంచి గంటన్నర పాటు కవిత ప్రసంగించనున్నారు.

**ప్రాంగణం, భోజన శాలకు ప్రముఖుల పేర్లు...**

రాజకీయ పార్టీ ఏర్పాటు చేయబోతున్న సభ ప్రాంగణం పేరును ‘ప్రొఫెసర్ జయశంకర్’గా నామకరణం చేశారు. ప్రధాన ద్వారానికి ప్రజాకవి కాళోజీ నారాయణ రావు ద్వారమని, ఇతర ద్వారాలకు రాణి రుద్రమ దేవి, మారోజు వీరన్న,చాకలి ఐలమ్మ పేర్లను పెట్టారు. అలాగే భోజనశాలకు సురవరం ప్రతాపరెడ్డి, మరో భోజన శాలకు సమ్మక్క సారాలమ్మ పేరును పెట్టారు. మీడియా –భోజన శాలకు షోయబుల్లా ఖాన్ పేరు పెట్టారు.

**34 రకాల తెలంగాణ వంటకాలు..**

పార్టీ కార్యకర్తలకు, అతిథులకు ‘తెలంగాణ రుచుల’తో భోజనాలు వడ్డించనున్నారు. మధ్యాహ్న భోజనం కోసం 34 రకాల వంటకాలను సిద్ధం చేయనున్నారు. ఇందులో తలకాయ కూర, బోటీ ఫ్రై, తెలంగాణ మటన్ కర్రీ, నాటు కోడి పులుసు, బొమ్మిడాయల పులుసు, హైదరాబాదీ చికెన్ దమ్ బిర్యానీ, మిర్చి కా సాలాన్, ఎగ్ ఇగురు వడ్డించనున్నారు. వెజిటేరియన్‌లో బగరా బైంగన్ మసాలా కర్రీ, కందగడ్డ ఫ్రై, పాలకూర, మామిడి పప్పు, ఆలూ టామాటా, చామగడ్డ పులుసు, కట్ చారు సిద్ధం చేయనున్నారు. తెలంగాణ ప్రత్యేక వంటకాలుగా పేరు గాంచిన మక్క గారెలు, జొన్న రొట్టె, సర్వపిండి, బూరెలు, అరిసెలను కూడా మెనులో చేర్చారు. అలాగే బగరా రైస్, వైట్ రైస్, సాంబర్, రోటి పచ్చడి, దోస, ఆవకాయ, మిర్చి బజ్జి, పచ్చి పులుసు, పాపడ్, పెరుగు, రైతా కూడా ఉంటాయి. మజ్జిగ, రాగి అంబలిని కూడా అందుబాటులో పెట్టనున్నారు. ఇక డిజర్ట్‌లో బటర్ స్కాచ్ ఐస్ క్రీమ్, షాహి తుక్ డా, జిలేబీ పెట్టనున్నారు






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com